రూ. 10/-

కమ్యూనిజం

సంపుటి 34 మే 2009 సంచిక 5

సైద్ధాంతిక మాసపత్రిక

communism communism communism communism communism communism

ఈ సంచికలో

communism communism communism communism communism

వృత్తి ఎన్నిక ఎలా?

మనమొక వృత్తి నెంచుకోడానికి ప్రస్తుత పరిస్థితులు అనుమతించినట్లయితే, పరువు ప్రతిష్ఠలను అత్యధికంగా ఒనగూర్చే వృత్తిని మనమెంచుకో గల్గుతాం. యధార్థమైనవిగా నిరూపించుకోబడ్డ భావాలపై ఆధారపడే వృత్తిని మనమెంచుకో గల్గుతాం. మానవజాతికి మేలు చేకూర్చగల వృత్తిని, అత్యంత విస్తృతమైన కార్యకలాపాలకు అవకాశమిచ్చే వృత్తిని మన మెంచుకోగల్గుతాం. ఒక ఉమ్మడి లక్ష్యాన్ని చేరుకొనేందుకు, అనగా పరిపూర్ణత్వాన్ని సాధించేందుకు, దానికి మరింత చేరువయేందుకు ఒక పనిముట్టుగా ఉపయోగపడే వృత్తిని ఎంచుకోగల్గుతాం.

అన్నిటికంటే ముఖ్యంగా, మానవుని ఉన్నతుణ్ణి చేసేవి పరువు ప్రతిష్టలు; అవే అతని కార్యాలకు, కోర్కెలకూ ఘనత చేకూరుస్తాయి. ఈ ఘనతే అతణ్ణి యితరు లందరికంటే, భీరువులందరికంటే ఉన్నతుణ్ణి చేస్తుంది.

అయితే, యీ పరువు ప్రతిష్ఠలకు ఎలాంటి వృత్తి ప్రోద్బలమీయగల్గుతుంది? మనల్ని కేవలం విధేయతగల పనిముట్లుగా తయారుచేసే వృత్తికాక, మన జనం మధ్య స్వతంత్ర కృషికి అవకాశమిచ్చే వృత్తి మాత్రమే, సృజనాత్మక కృషికి అవకాశమిచ్చే వృత్తి మాత్రమే అలాంటి ప్రోద్బల మీయగలదు. మనచే దూష్యమైన కార్యాలు (అవి పైకి మాత్రమే అలా కనిపించవచ్చు) చేయించే వృత్తి కాక, మనలో అత్యుత్తములైనవారు సగర్వంగా చేపట్టే వృత్తి మాత్రమే అలాంటి ప్రోద్బలమీయ గల్గుతుంది. ఈ లక్షణాలన్నీ అత్యధికంగా ఉన్న వృత్తి ఎల్లప్పుడూ అత్యంత ఘనమైనదిగా వుండకపోవచ్చు; కాని, అత్యంత వాంఛనీయంగా మాత్రం వుంటుంది.

ఒక వ్యక్తి తన సొంత మేలుకే పాటుపడితే, అతడొక ప్రఖ్యాత సైంటిస్టుగానో, గొప్ప రుషిగానో, చక్కని కవిగానో తయారుకావచ్చు; కాని ఎన్నటికీ పరిపూర్ణ వ్యక్తిగా, మహాపురుషుడుగా తయారవడు.

ఎవరైతే లోక కళ్యాణం కొరకు కృషి చేయడం ద్వారా తమ్ము తాము ఉన్నతుల్ని చేసుకుంటారో, వారినే చరిత్ర అత్యుత్తములుగా పరిగణిస్తుంది. అత్యధికులకు సౌఖ్యం చేకూర్చినవారే అందరికన్న అదృష్టవంతులని అనుభవం తెలియజేస్తుంది.

మానవజాతికి అత్యధికంగా మేలు చేయగల వృత్తిని మనం ఎంచుకొన్నట్లయితే, మనం దేనికీ తలవంచనవసరం లేదు. ఎందుచేతంటే, అది అందరికోసం చేసే త్యాగం, అప్పడు మనం పొందే ఆనందం అల్పమైనది కాదు; పరిమితమైనది కాదు; స్వార్థపూరితమైనది కాదు. ఎందుచేతనంటే, లక్షలాది ప్రజల సౌఖ్యమే మన సౌఖ్యం అవుతుంది; మన కార్యాలు ప్రపంచంలో శాశ్వతంగా నిలిచిపోతాయి; మన అస్తికలు మహానుభావుల అశ్రుధాలతో పునీతమవుతాయి.

- కారల్ మార్క్స్

"ఏదైనా వృత్తినెంచుకోవటంపట్ల ఒక యువకుని మనోభావాలు" (1835) (వ్యాసభాగం)

కమ్యూనిజం

సంపుటి 34 మే 2009 సంచిక 5

విషయసూచిక ...

జనాకర్షణ వాదం (Populism) ! తస్మాత్ జాగ్రత్త !!

భారతదేశంలో పార్లమెంటుకు, కొన్ని రాష్ట్ర శాసనసభలకు ఎన్నికలు ప్రకటించారు. మొదటి దశ పోలింగ్ ముగిసింది. రెండవ విడత పోలింగ్ మరికొన్ని రోజులలో ముగియనుంది. ఎన్నికల సందర్భంగా వివిధ పార్టీలు వాగ్దానాల వాన కురిపిస్తున్నాయి. వాన కాదు జడివాన. జడివాన కాదు పెనువాన. ప్రజాస్వామ్య ప్రక్రియ వేగవంతమౌతుందనడానికి వివిధ పార్టీల వాగ్దానాల హోరు ఒక సానుకూల నిదర్శనం.

ఎన్నికలలో పాల్గొనే సామాన్య ప్రజానీకం ఏమీ అడక్కుండానే ప్రధాన రాజకీయ పార్టీలు వాగ్దానాల పేరిట ఎందుకింత ప్రేమ వలకబోస్తున్నాయి.

తమ తమ దీర్ఘకాలిక విధానాల ద్వారా, ప్రతిపాదనల ద్వారా రాజకీయ కార్యాచరణ ద్వారా ఆయా పార్టీలు ఒకప్రక్క సామాజికార్థికాభివృద్ధిని లక్షిస్తాయి. అలానే వాటి నాయకత్వాన నడుస్తున్న ప్రభుత్వాలు సమకాలీన పరిస్థితులలో తాము నడిపిస్తున్న పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాన్ని అనుసరించి కొన్ని దీర్ఘకాలిక లక్ష్యాలను, మరికొన్ని తాత్కాలిక లక్ష్యాలను యెంచుకొంటాయి. జాతీయ ఉత్పత్తి పెరుగుదలను పెంచడానికి, ప్రత్యేకించి ప్రపంచీకరణ నేపథ్యంలో దానిని రెండంకెల స్థాయికి పెంచి ప్రపంచంలో ఒక పెద్ద ఆర్థిక శక్తిగా దేశాన్ని నడిపించడానికి తాము కృషి చేస్తున్నట్లు ఈ పార్టీలు చెప్పకొంటున్నాయి. దానిలో భాగంగా ప్రైవేటు చొరవను ప్రోత్సహించేందుకు, పారిశ్రామికాభివృద్ధిని వేగవంతం చేసేందుకు పెద్దయెత్తున ఉన్నత వర్గాలకు రాయితీలు ఇవ్వడం అవసరమని ఈ పార్టీల వాదన. శీఘ్రగతిన ఆర్థికాభివృద్ధికి ఇలాంటి దీర్ఘకాలిక లక్ష్యం, ఆచరణ అవసరమని పాలకవర్గం, దేశ ఆర్థిక విధాన నిర్ణేతలు బాకాలూది మరీ చెబుతున్నారు. ఇంకో మార్గం లేదంటున్నారు. (There is no alternative)

ఇలాంటి నయా ఉదారవాద ఆర్థిక విధానాల మూలంగా ప్రజా బాహుళ్యం అభివృద్ధి ఫలితాలకు దూరమౌతుంది. ఆర్థిక వ్యత్యాసాలు మరింతగా పెరుగుతున్నాయి. ప్రజల జీవన ప్రమాణాలు పెద్దయెత్తున దిగజారుతున్నాయి. నానాటికీ తీసికట్టుగా తయారౌతున్న జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి కాకపోయినా, కనీస జీవన ప్రమాణాలను నిలపడానికి ప్రజాస్వామ్య ప్రభుత్వం, ప్రజాస్వామ్యాన్ని కాంక్షించే పార్టీలు కృషి చేయవలసి వస్తుంది. దీనిలో భాగమే ఆయా ప్రభుత్వాలు, పార్టీలు ప్రకటించే సంక్షేమ కార్యక్రమాలు లేక రాయితీలు లేక జనాకర్షణ పథకాలు తప్ప మరేమి కాదు.

అలానే జనాకర్షణ పథకాల రూపకల్పనకు ఎన్నికలొక సందర్భం. ప్రజాస్వామ్య ప్రక్రియను అర్థవంతంగా అర్థవంతంగా ముందుకు తీసుకెళ్ళడంలో ఎన్నికల కొక కీలకమైన పాత్ర వుంది. ఎన్నికలు లేకపోతే ప్రజలకున్న అనేక హక్కులకు (అవి నామమాత్రపు హక్కులైనప్పటికి) హామీ వుండదు. ప్రజల జీవన పరిస్థితులు మరింత దుర్భరంగా తయారౌతాయి. తమకు హక్కులు కావాలని, వాటికి హామీ, భద్రతా వుండాలని, తద్వారా తమ జీవన ప్రమాణాలు మెరుగుపరచుకోవాలని, సమాజ సర్వతోముఖాభివృద్ధికి ప్రజాస్వామ్యం ఒక సాధనం కావాలని ప్రజల ఆకాంక్ష. దానిని కాపాడుకోవడానికి నిరంతరం అప్రమత్తులై వుంటున్నారు.

ప్రజాస్వామ్యంలో ప్రజల పాత్రను బేరీజు వేసుకొనడానికి ఎన్నికలొక కీలక సందర్భం. అవే లేకపోతే ప్రజలకు ఎలాంటి రాయితీలు ఇవ్వవలసిన పనిలేదు; వారి జీవన ప్రమాణాల మెరుగుదలకు ఎలాంటి చర్యలు తీసుకోవలసిన పనిలేదు; నిరాటంకంగా నయా ఉదారవాద విధానాల అమలు ద్వారా శీఘ్ర అభివృద్ధిని సాధించవచ్చన్న ఒకనాటి చంద్రబాబు ఆకాంక్షను గుర్తు తెచ్చుకోవడం అవసరం; ఇలాంటి అభివృద్ధి ఆధిపత్య వర్గాలకేనన్న విషయాన్ని చెప్పనవసరం లేదు. దోపిడీ వర్గాల ప్రయోజనాలతో లంకె వేసుకొన్న నయా ఉదారవాద విధానాలను, వాటి దుష్ఫలితాలను అడ్డుకోగలిగిన శక్తి ప్రజా బాహుళ్యానికి వుంది. ప్రజాస్వామ్యానికి వుంది. అందుకు ఎన్నికలొక వేదిక.

జనసామాన్యానికి ఆయా పార్టీలు ఇస్తున్నామని లేక ఇస్తామని చెప్పే రాయితీలు అవి ప్రజలకిచ్చే వరాలు కాదు. ఇవ్వడానికి ఆయా పార్టీల అధినాయకులు దేవుళ్ళు కాదు. పుచ్చుకొనే ప్రజలు భక్తులు కాదు. ఇలాంటి రాయితీలు పొందడం ప్రజల రాజ్యాంగబద్ధ హక్కు ప్రజాస్వామిక హక్కు అయితే విద్యా సామాజిక విషయాలలో వెనుకబడిన ప్రజల సముద్ధరణకు రిజర్వేషన్లను ఏవిధంగా తాత్కాలిక ఉపశమనంగా పరిగణిస్తున్నారో, ఈ రాయితీలను కూడా అలానే చూడాలి. లేదంటే ఇవి ప్రజల స్వతంత్ర కార్యాచరణకున్న పదునును మొద్దుబారుస్తాయి. వారి చొరవను హరించివేస్తాయి. చివరికి వీరిని నీరుకారుస్తాయి. విధి వాదానికి బలిపశువులను చేస్తాయి. తమ స్వతంత్ర కార్యాచరణ శక్తిని, చొరవను మొద్దుబార్చే రాయితీల బారినపడి మోసపోకుండా, జాతి సంపదలో తమ న్యాయమైన వాటా పొందేందుకు జరిగే పోరులో ఎన్నికలను ప్రజలు ఒక ఆయుధంగా మలచుకోవాలి. దానికి పదును పెట్టాలి. అవినీతి, అసమర్థ పాలనను అంతమొందించాలి. జాతిని మరోమారు అన్యాక్రాంతం చేసే విధి, విధానాలపై ఓటనే అస్త్రాన్ని సంధించాలి.

(నన్నపనేని అంజయ్య)

మార్క్సిజం, అంబేద్కర్ అవగాహన - ఒక పరిశీలన

ఎన్. అంజయ్య *

"కమ్యూనిజంపై నేను చదివిన పుస్తకాలు కమ్యూనిస్టు నాయకులందరూ కలిపి చదివిన వాటికంటే ఎక్కువ" (డా॥ అంబేద్కర్ రైటింగ్స్ అండ్ స్పీచెస్, హైయర్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్, మహారాష్ట్ర ప్రభుత్వం, ముంబాయి, 2003, 17వ సంపుటం, మూడవ భాగం, పేజీ 171)

"నేను రాజకీయ శాస్త్ర విద్యార్థిని, ఆర్థిక శాస్త్ర ఆచార్యుడ్ని, కారల్ మార్క్సుని, కమ్యూనిజం తదితర అంశాలను అధ్యయనం చేయడానికి నేను ఎంతో సమయం వ్యయించాను" (డా॥ అంబేద్కర్, సంపుటం 17, మూడవ భాగం, పేజీ 556)

అంబేద్కర్ బహుముఖ మేధావి. ఒకప్రక్క మేథోవ్యాసంగం సాగిస్తూ, మరోప్రక్క అణగారిన తన జాతి జనుల హక్కుల పరిరక్షణ కొరకు ఉద్యమించిన నేత. తాను పోరాటం సాగించదలచుకొన్న ఏ సమస్యమీదనైనా నిశితంగా అధ్యయనం చేసి, పరిశోధన సాగించే తత్వం అంబేద్కర్‌ది. అది కుల సమస్య కావచ్చు, శూద్ర వర్ణం ఏ విధంగా ఆవిర్భవించిందనే సమస్య కావచ్చు, అంటరానితనం ఎలా ఉద్భవించిందనే చిక్కు సమస్య కావచ్చు, స్వేచ్ఛా, సమానత్వం, సౌభ్రాతృత్వాన్ని ప్రతిపాదించే బౌద్ధం ఏ విధంగా దేశ ప్రజలకు విముక్తిదాయకం కాగలదనే జటిల సమస్య కావచ్చు, లేదా బౌద్ధంతో పోల్చినపుడు మార్క్స్, మార్క్సిజం అణగారిన ప్రజల విముక్తికి అదనంగా అందించేది ఏమైనా వుందా? అనే ప్రశ్న కావచ్చు. ఏ సమస్యనైనా రాగ, ద్వేషాలకు అతీతంగా, నిష్పక్షపాతంగా, వస్తుగతంగా పరిశీలించడం చరిత్రకారునికి ఉండవలసిన లక్షణమని అంబేద్కర్ నమ్మకం. అందుకే చరిత్రకారునికి ఉండవలసిన లక్షణాన్ని అంబేద్కర్ ఇలా పేర్కొన్నారు : "చరిత్రకారుడు తప్పనిసరిగా ఖండితంగా వుండాలి. నిష్కపటంగా, నిష్పక్షపాతంగా వుండాలి; మోహానికి దూరంగా వుండాలి. స్వప్రయోజనానికి, భయానికి, కోపం లేక అభిమానానికి అతీతంగా వుండాలి. చరిత్రకు మాతృకైన సత్యానికి విశ్వాసపాత్రంగా వుండాలి. మహత్తర కార్యాచరణకు సంరక్షకుడుగా వుండాలి. విస్మృతికి విరోధిగా, గతానికి సాక్షిగా, భవిష్యత్‌కు మార్గదర్శిగా వుండాలి. క్లుప్తంగా చెప్పాలంటే, చరిత్రకారునికి, ఖాళీది కానప్పటికి, దేన్నైనా ఆహ్వానించగలిగిన మనస్సుండాలి. ఆధారరహితమైనప్పటికి అన్నిరకాల సాక్ష్యాలను పరిశీలించడానికి సంసిద్ధంగా వుండాలి." (**డా॥ అంబేద్కర్ రైటింగ్స్ అండ్ స్పీచెస్**, ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్, మహారాష్ట్ర ప్రభుత్వం, ముంబాయి, 1990, సంపుటం 7, పేజి 17)

మార్క్స్, మార్క్సిజం లేక కమ్యూనిజంపై అంబేద్కర్ అవగాహన తెలుసుకోవడానికి ప్రధానంగా ఉపకరించే రచన **బుద్ధుడూ లేక కారల్ మార్క్స్**. (**డా॥ అంబేద్కర్ రైటింగ్స్ అండ్ స్పీచెస్**, హయ్యర్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్, మహారాష్ట్ర ప్రభుత్వం, ముంబాయి, 1987, మూడవ సంపుటం, పేజీలు 441-462) **బౌద్ధం లేక కమ్యూనిజం** అనే ఉపన్యాసం. నవంబర్ 20, 1956న నేపాల్ రాజధాని ఖాట్మండ్‌లో జరిగిన వరల్డ్ ఫెలోషిప్ ఆఫ్ బుద్ధిస్ట్స్ నాల్గవ ప్రపంచ మహాసభలో అంబేద్కర్ చేసిన ఉపన్యాసం (**డా॥ అంబేద్కర్ రైటింగ్స్ అండ్ స్పీచెస్**, హయ్యర్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్, మహారాష్ట్ర ప్రభుత్వం, ముంబాయి, 2003, సంపుటం 17, మూడవ భాగం, పేజీలు 549-558)

బుద్ధుడు లేక కారల్ మార్క్స్ రచన విపులమైన వ్యాసం. రెండవది ఉపన్యాసం. మొదటి రచన ఆధారంగానే ఉపన్యాసం చేసినట్టు కనిపిస్తుంది. అందుచేత రెండింటి మధ్య కొంత పునరుక్తి కూడా కనిపిస్తుంది. ఈ రెండు ఆధారంగా మార్క్స్, మార్క్సిజం లేక కమ్యూనిజంపై అంబేద్కర్ వ్యక్తం చేసిన అభిప్రాయాలను పరిశీలించాలన్నదే వ్యాసం ఉద్దేశం. బౌద్ధం, మార్క్సిజం లేక కమ్యూనిజాలను పోల్చి అంబేద్కర్ అధ్యయనం చేశారు కనుక ప్రస్తుత వ్యాస పరిశీలనలో ఒక్కొక్కసారి బౌద్ధం మీద అవశ్యనీయంగా మాట్లాడవలసి వచ్చింది.

మార్క్స్, మార్క్సిజంపై అంబేద్కర్ అవగాహనను పరిశీలించే ముందు మార్క్స్ లేక మార్క్సిజం సారాంశాన్ని ఆయన మాటల్లో పేర్కొనడం ఉచితంగా వుంటుంది.

మార్క్స్ వాదన ఈ క్రింది సూత్రాలపై ఆధారపడి వుంది.

1. తత్వశాస్త్ర లక్ష్యం ప్రపంచాన్ని పునర్నిర్మించడం. విశ్వజనాన్ని వివరించడం కాదు.
2. చరిత్ర గమనాన్ని ప్రభావితం చేసే శక్తులు ప్రధానంగా ఆర్థికమైనవి.
3. యజమానులు, శ్రామికులనే రెండు వర్గాలుగా విడిపోయింది.
4. రెండు వర్గాల మధ్య నిరంతరం వర్గపోరాటం జరుగుతుంది.
5. శ్రామికుల శ్రమ ఫలితమైన అదనపు విలువను యజమానులు సొంతం చేసుకోవడం వలన శ్రామికులు దోపిడీకి గురౌతున్నారు.
6. ఉత్పత్తి సాధనాలను జాతీయం చేయడం ద్వారా, అంటే

* శాస్త్రీయ సామ్యవాద అధ్యయన కేంద్రం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్ - 522 510

ప్రైవేట్ ఆస్తిని రద్దు చేయడం ద్వారా దోపిడీని అంత మొందించవచ్చు.

7. దోపిడీ అధికాధికంగా శ్రామికుల దైన్యానికి దారితీస్తుంది.
8. పెరుగుతున్న శ్రామికుల దైన్యం వారిలో విప్లవస్ఫూర్తికి కారణమౌతుంది. ఇది వర్గ ఘర్షణను వర్గ పోరాటంగా మార్చుతుంది.
9. యజమానులను మించి శ్రామికుల సంఖ్య వుంటుంది కనుక, శ్రామికులు రాజ్యాన్ని కైవసం చేసుకుని, తమ పాలనను స్థాపించడం తథ్యం. దీనినే మార్క్స్ శ్రామికవర్గ నియంతృత్వ మన్నారు.
10. ఈ అంశాలు అప్రతిహతమైనవి. అందుచేత సోషలిజం అనివార్యం.

(చూడండి. **డా॥ అంబేద్కర్ రైటింగ్స్ అండ్ స్పీచెస్**, మూడవ సంపుటం, పేజీ 443)

మార్క్స్ సిద్ధాంతాన్ని చెప్పిన తరువాత, దానిలోని నిర్జీవ, సజీవ అంశాలను అంబేద్కర్ ఇలా పేర్కొన్నారు :

ఎప్పుడో 19వ శతాబ్దం మధ్య భాగంలో ప్రకటితమైన మార్క్స్ సిద్ధాంతం అప్పటి నుండి ఎన్నో విమర్శకులకు గురైంది. ఫలితంగా మార్క్స్ ప్రతిపాదించిన భావజాల నిర్మాణం తునాతునకలైంది. సోషలిజం అనివార్యమన్న మార్క్స్ ప్రతిపాదన సంపూర్ణంగా నిరాకరించబడింది. రష్యాలో వచ్చిన సోషలిజం లేక కమ్యూనిజం లేక శ్రామికవర్గ నియంతృత్వం కూడా మానవ ప్రయత్నం లేకుండా రాలేదు. సోషలిజం అనివార్యమనే ప్రతిపాదననే కాక, పైన పేర్కొన్న మార్క్స్ ప్రతిపాదనలలో అనేక సూత్రీకరణలను చరిత్ర, దాని తర్కం, అనుభవం నిరాకరించాయి. చరిత్రను వివరించడానికి ఆర్థిక భాష్యమొక్కటే సరిపోతుందనే భావనను ఇప్పుడు ఎవరూ అంగీక రించడం లేదు. శ్రామికులు క్రమేపి దైన్యస్థితికి చేరుకుంటున్నారన్న ప్రతిపాదనను ఎవరూ ఆమోదించడం లేదు. అలానే మార్క్స్ ఇతర ప్రతిపాదనలను కూడా తిరస్కరిస్తున్నారు. (చూడండి. **డా॥ అంబేద్కర్ రైటింగ్స్ అండ్ స్పీచెస్**, మూడవ సంపుటం, పేజీ 444)

మరి అంబేద్కర్ ప్రకారం మార్క్స్‌లో ఏమి మిగిలి వుంది? మార్క్స్‌లో బూడిదకుమ్మ మిగిలి వుంది. అది చిన్నదే. కాని చాలా ముఖ్యమైంది. మార్క్స్‌లో మిగిలిన అవక్షేపంలో ఈ క్రింది నాలుగు అంశాలున్నాయి :

1. తత్వశాస్త్ర కర్తవ్యమేమంటే ప్రపంచాన్ని పునర్నిర్మించడం తప్ప విశ్వజనాన్ని వివరించే పనిపెట్టుకొని సమయాన్ని వృధా చేయడం కాదు.
2. వర్గాల మధ్య ప్రయోజనాలకు సంబంధించిన ఘర్షణ వుంది.
3. ప్రైవేట్ ఆస్తి హక్కు ఒక వర్గానికి అధికారమిస్తుంది. దోపిడీ ద్వారా మరో వర్గానికి దుఃఖాన్నిస్తుంది.
4. సమాజ సంక్షేమం దృష్ట్యా ప్రైవేటు ఆస్తిని రద్దుచేయడం ద్వారా దుఃఖాన్ని తొలగించాలి. (చూడండి. డా॥ అంబేద్కర్ రైటింగ్స్ అండ్ స్పీచెస్, మూడవ సంపుటం, పేజీ 444)

మార్క్స్, మార్క్సిజం లేక కమ్యూనిజంపై అంబేద్కర్ అవగాహనను పరిశీలించే క్రమంలో రెండు అంశాలను విడదీసి చూడాలి. 1) మార్క్స్ సిద్ధాంత ప్రతిపాదనలోని పరిశోధన సంవిధానపు అంశం [Element of Marx's methodology] 2) తన పరిశోధన సంవిధానాన్ని అనుసరించి సమకాలీన పెట్టుబడిదారీ సమాజాన్ని విశ్లేషించడం ద్వారా మార్క్స్ చేసిన నిర్ధారణలు. ఆ నిర్ధారణలు కొన్ని రుజువు కావచ్చు లేదా వాటిని తరువాత జరిగిన చారిత్రక పరిణామాలు తిరస్కరించవచ్చు. ఇది చర్చనీయాంశమే. ఈ చర్చలోనికి వెళ్ళకుండా మార్క్స్ మౌలిక ప్రతిపాదన ఏమిటి? దానిని అంబేద్కర్ ఎలా చూశారన్న విషయాన్ని ఇప్పుడు పరిశీలిద్దాం.

II

మార్క్స్ సహచరులు, మార్క్స్ సిద్ధాంతాన్ని అభివృద్ధి చేయడంలో భాగస్వామిగా వున్న ఏంగెల్స్ ఈ క్రింది అంశాలను మార్క్స్ ప్రధాన ఆవిష్కరణలుగా పేర్కొన్నారు :

"చరిత్రపట్ల భౌతికవాద దృక్పథం, అదనపు విలువ ద్వారా పెట్టుబడిదారీ ఉత్పత్తి విధాన రహస్య ఛేదన లాంటి రెండు మహత్తర ఆవిష్కరణలకు మనం మార్క్స్‌కు రుణపడి వున్నాం". (చూడండి, **మార్క్స్, ఏంగెల్స్ కలక్టెడ్ వర్క్స్**, సంపుటం, 25, ప్రొగ్రెస్ పబ్లిషర్స్, మాస్కో, 1987, (యాంటి డ్యూరింగ్) పేజీ 27) చరిత్రపట్ల భౌతికవాద దృక్పథాన్ని ఏంగెల్స్ ఇలా చెప్పారు : "ప్రణాళికలో వున్న మూలభాగం - ప్రతి చారిత్రక శకంలోను ఆర్థిక ఉత్పత్తి విధానమూ, దానినుండి విధిగా ఉత్పన్నమయ్యే సామాజిక వ్యవస్థా కలిపి ఆ శకపు రాజకీయ, బౌద్ధిక చరిత్ర కు పునాదిగా వుంటాయి అనీ; తత్ఫలితంగా (భూమి మీద ఆదిమ సమిష్టి స్వామ్యం విచ్ఛిన్నమైనప్పటి నుంచి) చరిత్ర అంతా వర్గ పోరాటాల చరిత్ర, దోపిడీదార్లకూ, దోపిడీ చేయబడినవారికి జరిగే పోరాటాల చరిత్ర, భిన్న సామాజిక అభివృద్ధి దశలలో వున్న పాలిత, పాలక వర్గాల మధ్య జరిగే పోరాటాల చరిత్ర అనీ; కానీ, అణగదొక్కబడిన పీడిత వర్గం (కార్మికవర్గం) తన్ను అణగదొక్కి పీడించే (బూర్జువా) వర్గం నుండి విముక్తి పొందడం అనేది మొత్తం సమాజమంతటినీ దోపిడీ నుండి, పీడన నుండీ, వర్గ పోరాటాల నుండి శాశ్వతంగా విముక్తి చేస్తే తప్ప సాధ్యం కాదనే దశకు వర్గ పోరాటాల చరిత్ర ఈనాడు చేరిందనీ - ఈ మూలభావం పూర్తిగా మార్క్స్‌దే, మార్క్స్ ఒక్కనిదే." (చూడండి. **కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక**, తెలుగు అనువాదం : రాచమల్లు రామచంద్రారెడ్డి, ప్రగతి ప్రచురణాలయం, మాస్కో, పేజీ 11)

కనుక మార్క్స్ చరిత్రకు చేసిన వ్యాఖ్యానం భౌతికవాద వ్యాఖ్యానం తప్ప, అది ఆర్థిక వ్యాఖ్యానం కాదు. మార్క్స్ వ్యాఖ్యా నాన్ని ఆర్థిక వ్యాఖ్యానంగా అర్థం చేసుకొన్నవారున్నారు. ఇలాంటి

వ్యాఖ్యానం చేసినవారిలో మొదటి వ్యక్తి పాల్ బార్త్ (1858-1922). ఇతను జర్మనీకి చెందిన తాత్వికులు, సామాజిక శాస్త్రవేత్త. మార్క్స్ చారిత్రక దృక్పథాన్ని ఆర్థిక వ్యాఖ్యానంగా పరిగణించడం సబబేనని సమర్థించిన వ్యక్తి ఎడ్వర్డ్ బెర్నెస్టీన్ (1854-1932). ఇతను జర్మనీకి చెందిన సిద్ధాంతవేత్త. మార్క్స్, ఏంగెల్స్‌ల అనుయాయి. మార్క్స్, ఏంగెల్స్‌ల సాహితీ వారసత్వ సంరక్షకుడు కూడా.

చరిత్రను అర్థం చేసుకోవడానికి తాము అభివృద్ధిచేసిన దృక్పథంలో ప్రారంభంలో సిద్ధాంత ప్రచార నిమిత్తం ఆర్థిక అంశాల మీద మేం ఎక్కువ నొక్కి చెప్పాం. అంతమాత్రంచేత చరిత్రకు తాము చేసిన వ్యాఖ్యానాన్ని ఆర్థిక వ్యాఖ్యానంగాను, తమ దృక్పథాన్ని ఆర్థిక దృక్పథంగాను చెప్పడం సబబు కాదని మార్క్స్, ఏంగెల్స్‌లు ఇద్దరూ చెప్పారు. తన వ్యాఖ్యానాన్ని ఆర్థిక వ్యాఖ్యానంగా భావించి దానినే మార్క్సిజంగా పరిగణించి, ఆ మేరకు తమని తాము మార్క్సిస్టులుగా చెప్పుకొనే వారి జాబితాలో నేను చేరలేనని, ఆ మేరకు నేను మార్క్సిస్టును కాలేకపోతున్నందుకు ఆనందంగా వుందని కూడా మార్క్స్ చెప్పుకొన్నారు. ఇదే విషయాన్ని ఏంగెల్స్ తన ఉద్యమ సహచరులకు రాసిన ఉత్తరాలలో పేర్కొన్నారు. (చూడండి. మార్క్స్, ఏంగెల్స్ **సెలక్టెడ్ కరస్పాండెన్స్**, ప్రొగ్రెస్ పబ్లిషర్స్, మాస్కో, 1975, పేజీలు 394-396)

మార్క్స్ తనని తాను ఎప్పుడూ ఆర్థిక భౌతికవాదిగా పరిగణించుకోలేదని చారిత్రక భౌతిక దృక్పథంపై విశేష కృషి చేసిన రష్యన్ మార్క్సిస్టు వైతాళికుడు జార్జి ప్లెహనోవ్ (1856-1918) పేర్కొన్నారు. (చూడండి : **జార్జి ప్లెహనోవ్ సెలక్టెడ్ ఫిలాసఫికల్ వర్క్స్**, సంపుటి 1, ప్రొగ్రెస్ పబ్లిషర్స్, మాస్కో, 1974, పేజి 660)

మార్క్స్ చారిత్రక భౌతిక దృక్పథానికి ఇలాంటి దుర్వ్యాఖ్యానాలు చేయడం సరికాదని, "చారిత్రక భౌతికవాద మంటే ఏమీ కాదు" అనే శీర్షికను చెప్పడానికి యత్నించారు ఒకనాటి అమెరికన్ మార్క్సిస్టు విద్వాంసులు సిడ్నీ హుక్. మార్క్సిస్టులమని చెప్పుకొనే అనేకమంది ఉత్పత్తి సాంకేతిక శక్తులతో ఉత్పత్తి సామాజిక సంబంధాలను సమానం చేయడం ద్వారా చారిత్రక భౌతికవాద దృక్పథాన్ని చారిత్రక సాంకేతికవాద దృక్పథంగా పేర్కొంటూ సర్వసాధారణమైన తప్పిదానికి పాల్పడుతున్నారని సిడ్నీ హుక్ పేర్కొన్నారు. (చూడండి. సిడ్నీ హుక్, **టు వర్డ్స్ ది అండర్‌స్టాండింగ్ ఆఫ్ కారల్ మార్క్స్, ఏ రివల్యూషనరీ ఇంటర్‌ప్రెటేషన్**, విక్టర్ గొలాంజ్ లిమిటెడ్, లండన్, 1933, పేజీలు 125-141)

మార్క్స్ భావనను కేవలం ఆర్థిక వ్యాఖ్యానంగా అర్థం చేసుకోరాదని తరువాత కాలంలో కూడా అనేకమంది రాశారు. ఉదాహరణకు బ్రిటిష్ మార్క్సిస్టు అర్థ శాస్త్రవేత్త మారిస్ డాబ్ 'హిస్టారికల్ మెటీరియలిజం అండ్ ది రోల్ ఆఫ్ ఎకనమిక్ ఫాక్టర్' అనే వ్యాసంలో ఈ అంశాన్నే చర్చించారు. 'ఉత్పత్తి విధాన'మనే భావనను మార్క్స్, ఏంగెల్స్‌లు చాల విస్తృతమైన అర్థంలో ఉపయోగించారు. కనుక చరిత్ర నిర్మాతలుగా మానవులకున్న స్థానాన్ని మార్క్స్, ఏంగెల్స్‌లు గుర్తించారేకాని తిరస్కరించలేదు. తిరస్కరించి మనుషుల స్థానే యాంత్రికశక్తిని నిలపలేదు. పైగా మార్క్స్ దృష్టిలో హెగెల్ "పౌర సమాజం సమాజపు' విస్తృత రూపమే ఉత్పత్తి విధానం. ఈ పౌర సమాజమే చరిత్రంతటికి మూలం, వేదికని కూడా మార్క్స్ పేర్కొన్న అంశాన్ని డాబ్ గుర్తుచేశారు. (చూడండి. **మారిస్ డాబ్, ఆన్ ఎకనమిక్ థియరీ అండ్ సోషలిజం**, న్యూఢిల్లీ, 1986, పేజీలు 226-235)

ఇదే విషయాన్ని జోసఫ్ లొబెరా కూడా పేర్కొన్నారు. మార్క్స్ చారిత్రక భౌతిక వాదనను సాంకేతిక, ఆర్థిక నియతివాదంగా పరిగణించడం అసమంజసమన్నారు. (చూడండి. జోసఫ్ లొబెరా, టెక్నో - ఎకనమిక్ డిటర్మినిజం అండ్ ది వర్క్ ఆఫ్ మార్క్స్ ఆన్ ది ప్రీ కాపిటలిస్టు సొసైటీస్, **మాన్** (ఎన్.ఎస్.) 14, పేజీలు 249-70)

ఇంత చర్చ తరువాత కూడా మార్క్సుది ఆర్థిక వ్యాఖ్యానమని ఆర్థర్ ప్రింజ్ వాదించారు. (చూడండి. ఆర్థర్ ప్రింజ్, బాగ్రౌండ్ అండ్ అల్టీరియర్ మోటివ్ ఆఫ్ మార్క్స్ 'ప్రిఫేస్' ఆఫ్ 1859, **జర్నల్ ఆఫ్ హిస్టరీ ఆఫ్ ఇండియాస్**, సంపుటం 29, పేజీలు 437-450, 1968)

ఈ చర్చను ప్రఖ్యాత బ్రిటిష్ మార్క్సిస్టు చరిత్రకారులు ఎరిక్ హాబ్స్ బామ్ మాటలతో ముగిద్దాం : "మార్క్స్, ఏంగెల్స్‌లకు ఉత్పత్తి వాస్తవ క్రమం కేవలం జీవిత భౌతిక ఉత్పత్తి కాదు, ఇంకా విస్తృతమైందన్న విషయాన్ని మనం గమనించాలి. ఎరిక్ ఊల్ఫ్ సరైన సూత్రీకరణను ఉపయోగించి చెప్పాలంటే ఇది ప్రకృతి, పని, సామాజిక సంబంధాలు, సామాజిక నిర్మాణాల పరస్పరాశ్రిత సంక్లిష్ట సమాహారం. మానవులు చేతితోను, మేధస్సుతోను ఉత్పత్తి చేస్తారని కూడా గమనించాలి." (చూడండి. ఎరిక్ హాబ్స్ బామ్, **ఆన్ హిస్టరీ, అబాకస్**, లండన్, పేజి 212)

చరిత్రపట్ల భౌతికవాద దృక్పథం (Materialist conception of history) మార్క్స్ మొదటి ప్రధాన ఆవిష్కరణ అనుకొన్నాం. దానిని మార్క్స్ అనుయాయులు, మార్క్సేతరులు, మార్క్స్ వ్యతిరేకులు ఎలా అర్థం చేసుకొన్నారో చూశాం.

మార్క్సును, మార్క్సిజాన్ని ఎంతో లోతుగా, విస్తృతంగా అధ్యయనం చేసిన అంబేద్కర్ కూడా మార్క్స్ చారిత్రక దృక్పథాన్ని ఆర్థిక దృక్పథంగా చెప్పడం ఆశ్చర్యంగా కనిపిస్తుంది. అలానే సోషలిజం అనివార్యంగా వస్తుందని చెప్పడం చరిత్ర తర్క ఫలితమని, శ్రమ సంబంధాల ఫలితమని, దీనిలో శ్రమశక్తి, దాని పాత్ర అంటే మానవ ప్రయత్నం ఉంటుందన్న విషయాన్ని కూడా అంబేద్కర్ పరిగణనలోనికి తీసుకొన్నట్లు కనబడలేదు.

చరిత్రపట్ల భౌతికవాద దృక్పథం ప్రాతిపదికగానే మార్క్స్ తన సమకాలీన సమాజాన్ని అంటే పెట్టుబడిదారీ సమాజాన్ని విశ్లేషిం

వారు. తద్వారా పెట్టుబడిదారులు పొందుతున్నది సాదాసీదా లాభం కాదు. సరళ లాభం అంతకంటే కాదు. అది అమిత లాభమని, దానికి మూలం శ్రామికుల శ్రమలోకాక, వారికున్న శ్రమ చేసే శక్తిలో దాగి వుంది. పెట్టుబడిదారులు శ్రామికుల శ్రమకు మాత్రమే వేతనమిచ్చి, వారి శ్రమ చేయగల శక్తిని వినియోగించుకోవడం మూలానే వారికి అధిక లాభం చేకూరుతుంది. అంటే శ్రమ చేసే శక్తికి, శ్రమకు చెల్లించే వేతనానికి మధ్య గల తేడాయే అదనపు విలువ (Surplus value)ని, ఇదే పెట్టుబడిదారుల అధిక లాభాలకు ఇబ్బడిముబ్బడి పెరుగుదలకు కారణమన్నది మార్క్స్ రెండవ ప్రధాన ఆవిష్కరణ.

చరిత్రపట్ల మార్క్స్ వ్యాఖ్యానాన్ని ఆర్థిక వ్యాఖ్యానంగా భావించి, చరిత్ర పునర్నిర్మాణానికి దానినే ఏకైక సాధనంగా ఎవరూ అంగీకరించడం లేదని అంబేద్కర్ భావించారు. అలానే పెట్టుబడి దారీ సమాజం లేక తత్పూర్వ వర్గ సమాజాలలోని శ్రమ సంబంధాల విశ్లేషణకు, ఆ సంబంధాలు ఏ చలనసూత్రం ఆధారంగా పనిచేస్తాయో వివరించే విశ్లేషణ అభివర్గం (Analytical Category)గా వర్గానికున్న పాత్రను అంబేద్కర్ గుర్తించలేదు. అంటే వర్గాన్ని మార్క్స్ పరిశోధన సంవిధాన పరిధిలోనే, సాధారణ, రూప రహిత (Amorphus) అభివర్గంగానే అంబేద్కర్ దానిని చూసినట్లు కనిపిస్తుంది. అలా చూడకపోతే, మార్క్స్, మార్క్సిజంలోని సజీవ అంశాన్ని చెబుతూ "ప్రైవేట్ ఆస్తి హక్కు ఒక వర్గానికి అధికారమిస్తుంది. దోపిడీ ద్వారా మరో వర్గానికి దుఃఖాన్నిస్తుంద"ని అంబేద్కర్ చెప్పేవారు కాదు. అలా చెప్పడమే కాక, ఇదే విషయాన్ని మార్క్సకన్నా 2381 సంవత్సరాలు ముందు పుట్టిన బుద్ధుడు చెప్పారని, ఆ మాటలే మార్క్స్ నోట మనకు వినిపించాయని అంబేద్కర్ భావించారు. (చూడండి. **డా॥ అంబేద్కర్ రైటింగ్ అండ్ స్పీచెస్**, మూడవ సంపుటం, పేజీలు 445-446) వర్గ దోపిడీ విషయంలో బుద్ధుడు, మార్క్సకున్న సారూప్యతను అంబేద్కర్ ఇలా చెప్పారు : "భాషే మార్పు, అర్థమొకటే. దుఃఖం స్థానే దోపిడీ అనే మాటను వుంచితే మార్క్సకు బుద్ధుడు దగ్గరౌతారు". (అదే సంపుటం, పేజీ 446)

మార్క్స్ చారిత్రక భౌతికవాద దృక్పథాన్ని అభివృద్ధి చేసిన, దాని ప్రాతిపదికగా వర్గ విశ్లేషణా పద్ధతిని ముందుకు తీసుకెళ్ళినా, అలానే అదనపు విలువ సిద్ధాంతాన్ని శాస్త్రీయంగా ప్రతిపాదించినా అందుకు ముందస్తుగా ఒక నిర్దిష్ట స్థాయిలో సామాజిక, ఆర్థిక, చారిత్రకాభివృద్ధి నేపథ్యంగా నిలిచింది. అలానే ఒక నిర్దిష్ట స్థాయిలో మేధో వికాసం కూడా ముందస్తు షరతుగా వుంటుందన్న విషయాన్ని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఇలాంటి ముందస్తు అంశాల (Pre-requisites) పాత్ర లేకుండా బుద్ధుడు మార్క్స్, అతని సిద్ధాంతాన్ని ఎంతో ముందుగానే ఊహించారనడం చరిత్ర పరిశోధన పద్ధతిని, వస్తుగత దృష్టిని అపహాస్యం చేసినట్టు కాదా?

III

మార్క్స్, మార్క్సిజంలో సజీవంగా ఉన్న నాలుగు అంశాలను అంబేద్కర్ పేర్కొన్న విషయాలని ఇంతకుముందు చూశాం. వాటిలో మూడవ అంశాన్ని మార్క్స్ రెండవ ప్రధాన ఆవిష్కరణ (అదనపు విలువ) కోణం నుండి పరిశీలించాం.

మార్క్స్, మార్క్సిజంలోని సజీవ అంశాలు నాల్గని చెప్పిన అంబేద్కర్ అంతటితో ఆగలేదు. వాటిని బౌద్ధంలోని నాలుగవ అంశాలతో పోల్చారు. బౌద్ధం, మార్క్సిజాల మధ్య లక్ష్యానికి సంబంధించిన తేడా లేదన్నారు. బౌద్ధం, మార్క్సిజంలో తమ లక్ష్య సాధనకు యెంచుకొన్న మార్గాలలోనే తేడా వుందన్నారు. (చూడండి. **డా॥ అంబేద్కర్ రైటింగ్ అండ్ స్పీచెస్**, మూడవ సంపుటం, పేజీ 450)

బౌద్ధం, మార్క్సిజాల లక్ష్యాలను తులనాత్మకంగా పరిశీలించి రెండింటి మధ్య తేడా లేదన్నారు అంబేద్కర్. అంటే ఈ రెండు ప్రాపంచిక దృక్పథాలు, వాటి మధ్య వున్న చారిత్రక కాల వ్యవధిని అంబేద్కర్ గుర్తించలేదని కాదు. రెండింటి విభిన్న చారిత్రక, సామాజిక, ఆర్థిక నేపథ్యాలు అంబేద్కర్ దృష్టిలో లేవని కాదు. ఈ తేడాలు తన ఎరుకలో వున్న తరువాత కూడా బౌద్ధం, మార్క్సిజం మధ్య తులనాత్మక అధ్యయనం చేసిన అంబేద్కర్ నిర్ధారణ ఇలా వుంది :

"ప్రపంచపు పెద్ద సమస్య దుఃఖం. దానిన తొలగించాలి. అందుకు బుద్ధుని పరిష్కార పద్ధతి అత్యంత పదిలం, అత్యంత ఆరోగ్యకరం." (చూడండి. **డా॥ అంబేద్కర్ రైటింగ్ అండ్ స్పీచెస్**, సంపుటం 17, మూడవ భాగం, పేజి 556)

మార్క్సిజంలోని నాలుగు సజీవ సూత్రీకరణలను, బౌద్ధ సూత్రీకరణలతో పోల్చిన సందర్భంలో మార్క్స్ సూత్రీకరణలపై అంబేద్కర్ అవగాహనను ఇప్పుడు పరిశీలిద్దాం.

1) "తత్వశాస్త్ర విధి ప్రపంచాన్ని పునర్నిర్మించడం. విశ్వజనాన్ని వివరించడంలో సమయాన్ని వృథా చేయడం కాదు."

ప్రపంచం శాశ్వతమా? అది అనంతమైనదా? కాదా? ఆత్మ, శరీరం ఒకటా? వేర్వేరా? సత్యం తెలిసిన వ్యక్తి, మరణానంతరం మరలా జీవిస్తారా? లాంటి ప్రశ్నలపై బుద్ధుడు స్పందించలేదు. కారణం, ఇలాంటి ప్రశ్నలకు స్పందించడం వలన ప్రయోజనం లేదు. ధర్మానికి, వీటికి సంబంధం లేదు. నిర్వాణానికి సంబంధం లేదు. కనుక ఇలాంటి నిరుపయోగమైన అధిక భౌతికవాద సమస్యలపై స్పందించడంకంటే లౌకిక సమస్యలను పరిష్కరించుకుంటూ ముందుకు సాగడం ప్రయోజనకరమని బుద్ధుని భావం. అంటే అధిభౌతికవాద ప్రశ్నలపై బుద్ధునికి ఆసక్తి లేదని దీని సారాంశం. (అయితే ఈ విషయంలో బౌద్ధ చరిత్రలో అభిప్రాయ భేదాలున్నాయి. ఆ చర్చ ప్రస్తుత వ్యాసపరిధికి మించినది.)

"తత్వవేత్తలు ఇంతవరకు ప్రపంచాన్ని రకరకాలుగా వ్యాఖ్యా

నించారు, కాని అసలు విషయం దాన్ని మార్చడ"మని ఫొయర్ బాఖ్‌పై మార్క్స్ చేసిన సూత్రీకరణ (**కారల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఏంగెల్స్ సంకలిత రచనలు**, భాగం-1, ప్రగతి ప్రచురణాలయం, **మాస్కో**, 1980 పేజీ 38), పైన పేర్కొన్న అధిభౌతికవాద ప్రశ్నలకు స్పందించని బుద్ధుని దృక్పథం ఒకటేనని అంబేద్కర్ భావన. అంబేద్కర్ దృష్టిని ఇక్కడ అంగీకరించలేం. సిద్ధాంత చర్చకు కాని, సిద్ధాంతీకరణ లేక సూత్రీకరణకు కాని మార్క్స్ వ్యతిరేకం కాదు. అంతటితో ఆగకుండా దానిని ఆచరణతో ముడిపెట్టాలి. అంటే ఆచరణలో భాగంగా ఇది జరగాలి. అంటే సిద్ధాంత పరిజ్ఞానం తత్సంబంధ చర్చ, ఆచరణ ఒకే నాణానికి బొమ్మా, బొరుసు లాంటివి తప్ప వేర్వేరు కాదు. ఇది మార్క్స్ ప్రతిపాదించిన విప్లవ కార్యాచరణ సిద్ధాంతం (Revolutionary theory of Praxis) దానినే అయన ఇలా చెప్పారు. "పరిస్థితులలోను, మానవ కార్యాచరణలోను ఒకేసారిగా మార్పులు రావడాన్ని కేవలం విప్లవాత్మక కార్యాచరణగా భావించాలి. హేతుబద్ధంగా అవగాహన చేసుకోవడానికి ఇదే మార్గం." (చూడండి. పైన ఉటంకించిన సంపుటం. పేజీ 36)

2) "వర్గానికి, వర్గానికి మధ్య ప్రయోజనపూర్వక ఘర్షణ వుంది."

"అదనంగా, రాజుల మధ్య, పాలకుల మధ్య, బ్రాహ్మల మధ్య, గృహస్థుల మధ్య, తల్లీ కొడుకుల మధ్య, కొడుకు తల్లి మధ్య, తోబుట్టువుల మధ్య, స్నేహితుల మధ్య నిరంతరం ఘర్షణ" నడుస్తుందని కోసల రాజు ప్రసేనుడు చెప్పిన మాటలను బుద్ధుడు తిరస్కరించలేదు. కాగా సమాజంలో ఈ ఘర్షణ వుందని భావించారు. ఇదే దుఃఖానికి కారణమని బుద్ధుడు భావించారు.

బుద్ధుడు గణరాజ్యవాసి. తన నాటి సమకాలీన సమాజంలో ఆదిమ కమ్యూనిస్టు సమాజ రూపమైన గణరాజ్యాలు అంతరించి, వర్గ సమాజాలు తలయెత్తడాన్ని బుద్ధుడు గుర్తించి వుండవచ్చు. అలానే ఏదో ఒకమేర వర్గ పరిస్థితిని చైతన్యయుతంగా గుర్తించి వుండ వచ్చు. అలానే ఏదోమేర తన సమకాలీన వర్గ సమాజం, వర్గ ఘర్షణను బుద్ధుడు గమనించి, అంగీకరించి వుండవచ్చు.

ఇలాంటి పరిస్థితిని ప్రాచీన కాలంలో పాశ్చాత్య దేశాలలో చూడవచ్చు. ఏసుక్రీస్తును చాలామంది కమ్యూనిస్టు వైతాళికు డన్నారు. కారల్ కౌట్స్కీ అనే మార్క్సిస్టు పండితుడు ఇలాంటి వారిమీదే **ఫోర్ రన్నర్స్ ఆఫ్ సోషలిజం** పేరుతో ఒక పెద్ద గ్రంథం రాశారు. (చూడండి. కారల్ కౌట్స్కీ, కమ్యూనిజం ఇన్ సెంటర్ యూరప్ ఇన్ ది టైం ఆఫ్ రిఫర్మేషన్ డబ్ల్యు.డబ్ల్యు.డబ్ల్యు. మార్క్సిస్టు, ఒ.ఆర్.జి.) ఒక రాజకీయ, ఆర్థిక సామాజిక వ్యవస్థ శక్తి పూర్తిగా ఉడిగిపోకుండా ఎలా అంతరించదో, ఒక నిర్దుష్ట రాజకీయ, ఆర్థిక, సామాజిక నేపథ్యం లేకుండా సమాజంలో వర్గాలు, వర్గ ఘర్షణలు వున్నాయని, అందుకు ఉత్పత్తి, ఉత్పత్తి వ్యవస్థ మూలమన్న విషయాన్ని గ్రహించలేం. అందుకనే ఆధునిక కాలంలో పారిశ్రామిక విప్లవం జరిగి, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం అభివృద్ధి జరిగిన నేపథ్యంలోగాని వర్గాలు, వర్గ ఘర్షణ ఉన్నదన్న విషయాన్ని సెయింట్ సైమన్, అగస్టు థ్యేరి, మిన్యే లాంటి ఫ్రాన్స్ సామాజిక శాస్త్రవేత్తలు స్పష్టంగా ప్రతిపాదించగలిగారు. దాని ఉత్పత్తి మూలాలను తెలుసుకోగలిగారు. వారు అభివృద్ధి చేసిన వర్గ సిద్ధాంతాన్నే మార్క్స్ ఇంకా ముందుకు కొనిపోయారు.

బుద్ధుడు భారతదేశంలో నిశిత దృష్టి కలిగిన మొదటి సామాజిక శాస్త్రవేత్త అనడంలో సందేహం లేదు. తాను పుట్టి, పెరిగిన గణతంత్ర వ్యవస్థ (ఆదిమ కమ్యూనిస్టు సమాజం) సమానత్వ ప్రాతిపదికగా ఉన్న విషయం బుద్ధునికి తెలుసు. అది ఒకప్రక్క క్షీణించిపోతున్న విషయమూ ఆయనకు తెలుసు. రెండవప్రక్క కొత్త రంగంలోకి వచ్చి, అభివృద్ధి చెందుతున్న వర్గ సమాజం దానిలోని అసమానతలు, కష్టాలు ఆయనకు తెలుసు. మారుతున్న సామాజిక వాస్తవాన్ని అంటే అప్పుడే ఆవిర్భవిస్తున్న వర్గ సమాజాన్ని అంగీకరించలేక, సమున్నత ప్రాతిపదికగా ఉన్న గణతంత్ర సమాజాన్ని నిలుపుకోలేక, గణతంత్ర సమాజ నమూనాలో బౌద్ధ సంఘాలను నిర్మించారు బుద్ధుడు. "నిజ జీవితంలో నశించిన (సమతా) ధర్మం (బౌద్ధ సంఘాలలో) పునర్దర్శనం ఇచ్చేది. ఇదే తొలి బౌద్ధం విజయం పొందడానికి కారణం. దాని వైఫల్యానికి కూడా ఇదే కారణం." (చూడండి. **బౌద్ధం-మార్క్సిస్టు దృక్పథం**. దేవీప్రసాద్ ఛటోపాధ్యాయ వ్యాసం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, 1987, పేజీ 41). ఈ మేరకు ఆధునిక కాలంలో సమతా ధర్మం కొరకు, సోషలిజం కొరకు జరిగే ఉద్యమాలు బౌద్ధం నుండి ప్రేరణ పొందవచ్చు. కాని నిర్దుష్ట తక్షణ సామాజిక, మేథో నేపథ్యంలో రూపుదిద్దుకొన్న మార్క్సిస్టు వర్గ పోరాట భావనకు బౌద్ధ భావనను ప్రత్యామ్నాయంగా భావించి, బౌద్ధ వర్గ పోరాట భావన ప్రాసంగికతను నొక్కి చెప్పే అంబేద్కర్ అవగాహన ప్రశ్నార్థకమే.

3) ప్రైవేట్ ఆస్తి హక్కు ఒక వర్గానికి అధికారాన్నిస్తుంది. దోపిడీ ద్వారా మరొక వర్గానికి దుఃఖాన్నిస్తుంది.

మార్క్స్‌లో మిగిలి వుందన్న ఈ సజీవ అంశంపై అంబేద్కర్ అవగాహనను కొంత మేరకు ఇంతకుముందే పరిశీలించాం. ప్రైవేట్ ఆస్తి, దాని మూలాలు ఏమిటి అన్న విషయం మీద బుద్ధుడు అవగాహనకు, మార్క్స్ అవగాహనకు తేడా లేదన్నది అంబేద్కర్ అభిప్రాయం. ఈ అభిప్రాయాన్ని పరిశీలించడానికి ఇక్కడ పరిమిత మౌదాం.

ఆధునిక పూర్వ వర్గ సమాజాలలో అటు భారతదేశంలో కాని ఇటు ఐరోపా దేశాలలో గాని ప్రైవేట్ ఆస్తి, దాని రూపాలు మారుతూ వస్తున్నాయి. పరిణామం చెందుతున్నాయి. పెట్టుబడిదారీ సమాజానికి వచ్చేసరికి ఇంకా మారాయి. ఈ క్రమాన్ని, పరిణామాన్ని గమనించకపోతే, ఆధునిక పూర్వ వర్గ సమాజంలోని ఏదో ఒక రూపంలోని ప్రైవేట్ ఆస్తి సంబంధాలపై జరిగే విమర్శను

అఖండీకరించి, సర్వ కాలాలకు అదే వర్తిస్తుందని చెప్పే ప్రమాదం వుంది. ప్రైవేట్ ఆస్తిపై బుద్ధుని అవగాహనను అఖండీకరించి, ఈ విషయంలో మార్క్స్ అవగాహనకు దాన్ని ప్రత్యామ్నాయంగా చూపే అంబేద్కర్ ప్రయత్నాన్ని అంగీకరించలేం. ఈ విషయంపై రష్యన్ మార్క్సిస్టు వైతాళికులు ప్లెహనొవ్ మాటలను పేర్కొనడం సముచితంగా వుంటుంది : "కమ్యూనిజం వైపు మళ్ళిన మారెల్లి, మాస్లీ లాంటి రచయితలను నేనిక్కడ గుర్తుచేయాలి. ఈ రచయితలది కమ్యూనిజం సమానత్వం పట్ల బోలు ప్రసంగం తప్ప మరేమి కాదు. ఈ ప్రసంగానికి వాళ్ళు ఎలాంటి ప్రాధాన్యతా కల్పించలేదు. ఆస్తికి వ్యతిరేకంగా జరిగే దాడుల తీవ్రత కూడా ఈ ప్రసంగాల లాంటివే. దొంగతనమే ఆస్తని, ఆస్తికి నిర్వచనమిచ్చిన బ్రిసాట్ ఇందుకొక ఉదాహరణ. (ప్రైవేట్ ఆస్తికి ఈ నిర్వచనాన్నే తరువాత బ్రిసాట్ నుండి ప్రుధాన్ అరువు తీసుకొన్నారు.) ఇలాంటి నిర్వచనమిచ్చిన బ్రిసాట్ తరువాత కాలంలో బూర్జువా ధోరణులకు బాకా ఊదారు. ప్రాచీన కాలపు సమానత్వాన్ని సమర్థిస్తూ, ప్రైవేట్ ఆస్తిపై జరిగిన ఫ్రాన్స్‌లోని మాటల దాడులలో వివిధ రకాల చారిత్రక ఆస్తులపై ఎలాంటి విశ్లేషణ లేదు. గత శతాబ్ద కాలంగా ఇలాంటి విశ్లేషణ జరిగిన రచనలలో ప్రగతిశీల ఫ్రాన్స్ రచయితలందరూ, ఒక రూసో తప్ప, బూర్జువా ఆస్తి సంబంధాలనే సమర్థించారు." (చూడండి. జార్జి ప్లెహనొవ్, **సెలక్టెడ్ ఫిలాసఫికల్ వర్క్స్**, సంపుటం 2, ప్రొగ్రెస్ పబ్లిషర్స్, మాస్కో, 1976, పేజ 190) దీనిని మరింతగా వివరించనవసరం లేదు.

4) ప్రైవేట్ ఆస్తిని రద్దు చేయడం ద్వారా సమాజ సంక్షేమానికి దుఃఖాన్ని రూపుమాపడం అవసరం.

ఈ విషయంలోను మార్క్స్‌కు బుద్ధుడ్ని, బుద్ధుడి ఆలోచననే అంబేద్కర్ ప్రత్యామ్నాయం చేశారు. ఇక్కడ అంబేద్కర్ అవగాహన ఏ విధంగా తర్కానికి నిలబడదో దేవీప్రసాద్ ఛటోపాధ్యాయ మాటల్లో చూద్దాం: "బౌద్ధంలోని నాలుగో ఆర్యసూత్రం విషయం చూద్దాం వర్గ పూర్వ సమాజం నుండి స్ఫూర్తిని పొందిన గౌతముడు, నూతన సమాజం సృష్టించిన దుఃఖ కారణమైన విలువల నుండి బయటపడటానికి గాను, ప్రాచీన ఔన్నత్య పునరుద్ధరణనే మార్గంగా భావించారు. సమ్యక్ దృష్టి, సమ్యక్ దీక్ష, సమ్యక్ వాక్కు, సమ్యక్ సంయమనం - ఇవి జాతక కథల ద్వారా మనకు తెలిసే విలువలు. ఈ విలువలనే నూతన వర్గ సమాజం నిర్దాక్షిణ్యంగా అణచివేసింది. చారిత్రకంగా ఇది అనివార్యం. ప్రాథమికమూ, ప్రాచీనమూ అయిన నైతిక ఔన్నత్యాన్ని అణచివేస్తేగాని నూతన సమాజ ఆవిర్భావం సాధ్యం కాదు. చరిత్ర గమన సూత్రాలను బుద్ధుడు సైతం వెనక్కు తిప్పజాలడు. ఆయన చేయగలిగినదల్లా, ఆదిమ కమ్యూనిస్టు సమాజ లక్షణాలైన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాల పునరుద్ధరణ భ్రమ కలిగించడం. బౌద్ధ సంఘాలలో జీవితం ఆ సూత్రాలపై నడిచేది. వర్గ సమాజం అంతర్గతంగా వర్గరహిత బౌద్ధ సంఘాలు, వాటిలో భిక్షువులకు సమతా భావం వెల్లివిరిసేది. నిజ జీవితంలో నశించిన ధర్మం అక్కడ పునర్దర్శనం ఇచ్చేది. తొలి బౌద్ధం విజయం పొందటానికి బహుశా అదే కారణం. దాని ఎవైఫల్యానికి కూడా ఇదే కారణం. భ్రమతో కూడిన ఈ సమానతా భావానికి, దాని బలహీనతలు దానికున్నాయి. కనుకనే దైవభావాన్ని తిరస్కరించిన మతం కాలక్రమేణ ప్రభుత్వమతమైంది. మొదటి నుండి బౌద్ధానికి మత రూపం ధరించడాని కవసరమైన లక్షణాలన్నీ వున్నాయి." (పైన ఉటంకించిన బౌద్ధం - మార్క్సిస్టు దృక్పథం, పేజీలు 40-41)

బౌద్ధ మత పరిణామంలోని మహాయాన శాఖ, అది వున్న భూటాన్, టిబెట్ లాంటి దేశాలను మినహాయిస్తే ఆదిబౌద్ధ రూపమైన థేరవాద బౌద్ధం ప్రధాన మతంగా వున్న శ్రీలంక, థాయ్‌లాండ్, మయన్మార్ లాంటి దేశాలలో కూడా ఎందుకు ప్రైవేట్ ఆస్తి రద్దుకాకపోగా, అక్కడ పెట్టుబడిదారీ విధానం, పెట్టుబడిదారీ ఆస్తి సంబంధాలు బలపడుతున్నాయి? సమానత్వాన్ని వాస్తవీకరించేందుకు ప్రైవేట్ ఆస్తి సంబంధాల చలన సూత్రాలను అర్థం చేసుకొని, వాటిని రద్దుచేయగలిగిన స్థితిలో బౌద్ధం లేదు. ఈ మేరకు ఈ విషయంలో మార్క్స్, మార్క్సిజానికి బౌద్ధం ప్రత్యామ్నాయం అవుతుందన్న అంబేద్కర్ ఆలోచన చరిత్ర తర్కానికి నిలబడదు.

IV

మార్క్సిజంలో సజీవంగా వున్న నాలుగు అంశాలు బౌద్ధంలోనే ఉన్నాయి. కనుక బౌద్ధాన్ని కాదని మార్క్సిజాన్ని ఒక రాజకీయ సిద్ధాంతంగా అంగీకరించవలసిన అవసరం లేదనేది అంబేద్కర్ భావన. అలానే తన లక్ష్యాన్ని సాధించడానికి మార్క్సిజం హింసనే మార్గంగా యెంచుకుంటుంది. హింస ద్వారా తప్ప దోపిడీ వ్యవస్థను కూల్చలేమన్నది వారి ఆలోచన. (చూడండి. **డా॥ అంబేద్కర్ రైటింగ్స్ అండ్ స్పీచెస్**, సంపుటం 3, పేజీ 450) హింస ద్వారా సాధించే మార్పు ఎక్కువ కాలం నిలవదు. తద్వారా సాధించి మార్పులు దీర్ఘకాలం నిలవవు.

ఇందుకు భిన్నంగా బౌద్ధం మానసిక పరివర్తన ద్వారా తాను అనుకున్న మార్పు సాధించడానికి ప్రయత్నిస్తుంది. కనుక లక్ష్య సాధనలో మార్క్సిజం కంటే బౌద్ధం యెంచుకున్న మార్గం గొప్పది. తద్వారా సాధించే ఫలితాలు దీర్ఘకాలం నిలుస్తాయి.

కనుక లక్ష్యం విషయంలో బౌద్ధం కంటే మార్క్స్, మార్క్సిజం వర్తమానంలో అందించేదేమీ లేదు. వాటి సాధనకు అనుసరించే మార్గంలోను బౌద్ధమార్గం ఉన్నతమైనది, ఉదాత్తమైనది, నైతికమైనదని అంబేద్కర్ అభిప్రాయం.

మార్క్స్, మార్క్సిజం ఎక్కడా హింస ఒక్కటే లక్ష్య సాధనకు మార్గమని చెప్పలేదు. వర్గ పోరాటంలో భాగంగా శత్రు శిబిరం నుండి ఎదురయ్యే బలప్రయోగాన్ని ఎదుర్కొందుకే ప్రతి బల ప్రయోగంచేయవలసి వుంటుందని మార్క్సిజం గుర్తించింది కాని,

హింసను, హింసా మార్గాన్ని అఖండీకరించి, అదే ఏకైక మార్గమని మార్క్సిజం ఎక్కడా చెప్పలేదు. అయితే హింసా మార్గమే ప్రధాన మార్గమనుకొనే పాయలు మార్క్సిస్టు శిబిరంలో వుండవచ్చు. అది వేరే చర్చ.

అహింసా మార్గాన్ని అఖండీకరించి, ఆ మార్గంలో భారతదేశ స్వాతంత్ర్య పోరాటాన్ని నడిపారు గాంధీ. అయితే రష్యాలోని అక్టోబర్ విప్లవంలో కంటే భారతదేశ స్వాతంత్ర్య సాధనలో ఎక్కువ హింస జరిగింది. ఈ వైచిత్రిని ఎలా వివరిస్తాం.

మార్పు కోసం జరిగే ఉద్యమాలలో సాధనాలుగా బల ప్రయోగం, వికాస, చైతన్య మార్గాలకున్న పాత్రను, వాటి మధ్య వుండే గతితార్కిక సంబంధాన్ని అర్థం చేసుకోవడం అవసరం. బౌద్ధమే కాదు, మార్క్సిజం కూడా సమాజ వికాసానికి పనిచేసే ఉద్యమమే. అందుకే మార్క్సిజాన్ని వామపక్ష వికాస ఉద్యమమని ఎరిక్ హాబ్స్ పేర్కొన్నారు.

V

మార్క్స్, మార్క్సిజంపై అంబేద్కర్ అవగాహనపై ప్రస్తుత పరిశీలన చూసిన తరువాత సమానత్వం కొరకు నడిచే ఉద్యమాలకు బౌద్ధం పాత్రేది వుండదా? అన్న సందేహం కలగవచ్చు.

స్వేచ్ఛ, సమానత్వం లాంటి భావనల ఆధారంగా ప్రాచీన కాలంలో నడిచిన గణతంత్ర సమాజ (ఆదిమ కమ్యూనిస్టు సమాజ) స్ఫూర్తి పునరుద్ధరణకు బుద్ధుడు చేసిన ప్రయత్నం ఈనాటి ఉద్యమాలకు ప్రేరణగా నిలుస్తుందనడంలో సందేహం లేదు. అయితే మార్క్సిజం ఆధారంగా పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాలను తోసిపుచ్చి నిర్మించాలనుకొనే కమ్యూనిస్టు సమాజం కేవలం ప్రాచీన గణతంత్ర సమాజ పునరుద్ధరణ కాదు. ఇది దానికంటే ఉన్నత దశ. ప్రాచీన గణతంత్ర వ్యవస్థలో కొరత మధ్య సమానత్వం వుండేది. ఇప్పుడు పుష్కలత మధ్య సమానత్వాన్ని సాధించడం ఆధునిక కమ్యూనిస్టు సమాజ లక్ష్యం. అందుచేత పెట్టుబడిదారీ విధాన నేపథ్యంలో రూపుదిద్దుకొన్న మార్క్సిజంలోని అంశాలను ప్రాచీన కమ్యూనిజాన్ని ఆశించిన బౌద్ధంలోనే చూడడం ప్రాచీనతకు ఆధునిక భాష్యమౌతుంది. అలానే వర్తమాన కాలంలోని సిద్ధాంతాలకు, ఆచరణకు ప్రాచీన మూలాలేవి లేవనడం గత, వర్తమానాల మధ్య వుండే విచ్ఛిన్న, అవిచ్ఛిన్న సంబంధాన్ని చూడ తిరస్కరించినట్లౌతుంది. ఈ రెండు పద్ధతులు వస్తుగత పరిశీలనకు హానిచేస్తాయి.

భవిష్యత్‌లో నిర్మితం కాబోయే సోషలిస్టు సమాజానికి బౌద్ధ త్రిపిటకంలోని వినయ పిటక సూత్రాలు (సమానత్వ ప్రాతిపదికన మనుష్యుల మధ్య వుండవలసిన విధి విధానాలకు) ప్రాతిపదిక కావాలని భావించే శరద్ పాటిల్ లాంటి వారి సూచనలను ఈ నేపథ్యంలోనే అర్థం చేసుకోవాలి. (చూడండి. శరద్ పాటిల్, మెయిన్ స్ట్రీమ్, జూన్ 24, 1995, పేజి 16).

*

పీడితవర్గ సాంగత్యం

... నేను వారి (సంపన్నుల - సం.) సాంగత్యాన్నీ, విందు భోజనాల్నీ విసర్జించాను. మధ్యతరగతులు సేవించే పోర్టువైన్‌నీ, షాంపేన్నీ కాలదన్నేను. నా తీరిక సమయాన్ని యించుమించు పూర్తిగా సామాన్య కార్మికులతో సాంగత్యానికి వినియోగించాను. అలా చేసినందుకు నేను సంతోషపడ్డాను. గర్వపడ్డాను. సంతోషించడ మెందుకంటే, అవిధంగా జీవిత వాస్తవాలను తెలుసుకోవడానికి ఆనందదాయకంగా అనేక గంటలు గడపగలిగాను. లేకపోతే, ఆ సమయమంతా ఫ్యాషన్లకు సంబంధించిన సంభాషణల్లోను, నిరర్థక మర్యాదల్లోను వ్యర్థమైపోయేది. గర్వించడమెందుకంటే, ఆ విధంగా నేను పీడిత వర్గానికి, దూషిత వర్గానికి న్యాయం చేకూర్చేందుకు అవకాశం కలిగింది. ఆ వర్గంలో ఎన్ని లోపాలున్నా, ఎన్ని అననుకూల పరిస్థితుల్లో అది జీవిస్తున్నా, అది ప్రతి ఒక్కని నుంచీ - ఒక్క బ్రిటిష్ ధనాఢ్యుల నుంచి తప్ప - గౌరవం పొందుతూ వుండేది. నేను మరొకందుకు కూడా గర్వపడ్డాను. ఆ విధంగా, నానాటికీ పెచ్చరిల్లే ఛీత్కారం నుంచి ఇంగ్లీషు ప్రజల్ని కాపాడగల స్థితికి నేను వచ్చాను. అట్టి ఛీత్కారం ఆనాడు యూరపు ఖండంలో వ్యాపించియుండేది. ఇందుకు కారణం ఒక్కటే. అది, మీ పాలకవర్గమైన మధ్యతరగతి (పెట్టుబడిదారులని భావం - సం.) కార్మికుల పట్ల అవలంబిస్తున్న పాశవిక స్వార్థపూరిత విధానం, సామాన్య ప్రవర్తన.

- ఫ్రెడరిక్ ఏంగెల్స్

"గ్రేట్ బ్రిటన్‌లోని కార్మిక వర్గానికి" అనే ప్రసంగం నుంచి (1845)

గతితార్కిక చారిత్రక భౌతికవాదం

వి.వి. రెడ్డి *

మార్క్సిస్టు రాజకీయ అర్థశాస్త్రంపై ప్రముఖ మార్క్సిస్టు మేధావి, అర్థశాస్త్ర పండితులు వి.వి. రెడ్డిగారి వ్యాస పరంపరలో ఇది మొదటి భాగం.

గతితార్కిక చారిత్రక భౌతికవాదం మార్క్సిజానికి పునాది. కనుక మనం ఈ శాస్త్రాన్ని గురించి టూకీగా తెలుసుకోవాలి.

గతితర్కం (Dialectics) అంటే గ్రీకు భాషలో చర్చించుట యని అర్థం. ప్రతి సమస్యలోను పరస్పర వ్యతిరేక అంశాలుంటాయి. ఈ అంశాలను చర్చలో బహిర్గతం చేసి సత్యాన్ని కనుగొని సమస్యకు పరిష్కార మార్గాన్ని చూపాలి. ఈ పద్ధతిని జర్మన్ తత్వవేత్త హెగెల్ అనుసరించాడు. అయితే, ఇతను గతితర్కాన్ని భావ వాదనతో జోడించాడు. మార్క్స్ గతితర్కాన్ని భౌతికవాదం (Materialism) తో జోడించి, ఒక వినూత్న పద్ధతిని రూపొందించాడు. ఇదే పద్ధతిని మార్క్స్ తన రచనలలో ఉపయోగించాడు.

గతితార్కిక భౌతిక వాదం

తత్వశాస్త్రాన్ని (Philosophy) రెండు పరస్పర వ్యతిరేక భాగాలుగా విభజించవచ్చు : భావవాదం (Idealism), భౌతికవాదం (Materialism).

భావవాదం : ప్రకృతిని, మానవ సమాజాన్ని దేవుడు సృష్టించాడని నమ్ముతుంది. కనుక, విశ్వమంతా దైవలీల ప్రకారం (Divine law) నడుస్తుంది. మానవుడు దైవలీల ప్రకారం పుడతాడు, మరణిస్తాడు. సమాజాన్ని నడిపించేది, ప్రేరేపించేది దేవుడు మాత్రమే. కనుక మానవుడు అసహాయుడు, నిమిత్తమాత్రుడు.

భౌతికవాదం : భావవాదానికి విరుద్ధం. ప్రకృతికి, సమాజానికి పదార్థమే మూలం. పదార్థం నాశనమవదు. పరిణామ క్రమంలో రూపాంతరం మాత్రమే చెందుతుంది. (ఉ : వాయువు, వేడి, నీరు) మానవుని మెదడు పదార్థ ఉన్నత రూపం. మానవుడు తన అనుభవంతో, ఆలోచనా శక్తితో ప్రకృతి, సమాజ ప్రగతి నియమాలు కనుగొని, వాటి నియమాల ననుసరించి ప్రవర్తించాడు. చలి, ఎండ, వాన బారినుంచి తప్పించుకోటానికి ఇల్లు కట్టుకుంటాడు. వరదల నుండి కాపాడుకోటానికి నదులకు ఆనకట్టలు కడతాడు. వరద నీటిని తాగు, సాగుకు ఉపయోగిస్తాడు. అందుకే మార్క్స్ అంటాడు: మానవుడు ప్రకృతిలో భాగం. ప్రకృతిలో లభించే ముడిపదార్థాలను తన శ్రమశక్తితో తన వినిమయ సరుకులుగా మార్చుతాడు. విలియం పెట్టి అంటాడు : భూమి తల్లి, శ్రమశక్తి తండ్రి. కనుక, తల్లిని కాపాడుకుంటేనే సంతానం, ప్రగతిపథంలో పయనిస్తుంది. అందుకే మన పూర్వీకులు "మాతృదేవోభవ" అన్నారు.

మానవుడే దేవుణ్ని తన రూపంలోనే ప్రతిష్టించాడు. మనకు ప్రకృతి నియమాలు అర్థం కానపుడు, వానదేవుడు, అగ్నిదేవుళ్ళు పుట్టుకొచ్చారు. వారు మానవ రూపంలోనే వుంటారు. కిరీటం, ఆయుధాలు ధరిస్తారు. మన దేవతలు - లక్ష్మి, పార్వతి, సరస్వతి నగలు పెట్టుకుని, పట్టుచీరలతో దర్శనమిస్తారు. అలాగే గ్రీకు దేవతలు, దేవుళ్ళు వారి వారి కట్టూ బొట్టులో వుంటారు.

దోపిడీదారులు దేవుళ్ళతో సొమ్ము చేసుకుంటారు. మతాన్ని స్వప్రయోజనానికి వాడుకుంటారు. ప్రజలను మతం మత్తులో పడేసి, ప్రపంచాన్ని తమ ఇష్టారాజ్యంగా పాలిస్తారు. శాస్త్ర సాంకేతిక విజ్ఞానం మూఢనమ్మకాలకు చాలావరకు అడ్డుకట్ట వేసింది. అయితే, మతపిచ్చి నుండి ప్రజలింకా పూర్తిగా బయటపడలేదు. ఆ మత్తు ఎప్పుడో ఒకప్పుడు వదలకమానదు.

గతితార్కిక నియమాలు (Laws of Dialectics)

ఈ నియమాలు మూడు.

1. వైరంలో ఐక్యత (Unity in Struggle)
2. పరిణామం గుణంగా మార్పు (Quantity to Quality)
3. అభావం అభావం చెందుట (Negation of Negation)

మొదటిది మార్పుకు చోదకశక్తి, రెండవది మార్పు క్రమాన్ని, మూడవది పై రెంటి ఫలాన్ని తెలియజేస్తుంది.

1. ప్రకృతిలోను, సమాజంలోను, ప్రతి విషయంలోను రెండు వ్యతిరేక అంశాలుంటాయి. ఇవి నిరంతర పోరులో వుంటాయి. ఉ॥ అణువులో న్యూట్రాన్సు, ప్రోటాన్సు వుంటాయి. అవి ఎదురెదురుగా పరిభ్రమిస్తూ, ఒకదాన్ని మరొకటి తరిమే ప్రయత్నం చేస్తాయి. అయితే, అణువే వాటి నిలయం. ఈ రెండూ లేకపోతే అణువే వుండదు. ఈ పోరులో అణువు విచ్ఛిత్తై ఒక కొత్త పదార్థం వెలువడుతుంది. అదే, కొన్ని మిలియన్ డిగ్రీల వేడి. ఈ వేడితో మనం అణు విద్యుత్తును ఉత్పత్తి చేయగలుగుతాము.

పెట్టుబడిదారీ సమాజంలో రెండు వ్యతిరేక వర్గాలుంటాయి. కార్మికులు, పెట్టుబడిదారులు. వాటి ధ్యేయాలు భిన్నం కనుక అవి నిరంతర పోరులో వుంటాయి - వర్గపోరాటం. అయినా ఈ రెండు వర్గాల సామాజిక కలయికయే పెట్టుబడిదారీ వ్యవస్థకు మూలం. అణువు విచ్ఛిత్తి ఐనట్లే వర్గ పోరాటంలో పెట్టుబడిదారీ వ్యవస్థ పోయి సోషలిస్టు సమాజ మవతరిస్తుంది. కొత్త సమాజం ఒక నూతన యుగానికి నాంది పలుకుతుంది. సమాజాభివృద్ధికి

* విశ్రాంత ఆర్థిక శాస్త్ర ఆచార్యులు, నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, వరంగల్

వర్గ పోరాటమే చోదకశక్తి. ఇది చరిత్ర ఋజువు చేసిన సత్యం.

2. మార్పు మొదట పరిమాణంగా వుంటుంది. అంటే పొడవు, వైశాల్యం, బరువు మొదలగునవి. ఉ॥ మొలక చెట్టుగా, చెట్టు వృక్షంగా మారటం. ఏకకణం రెండుగా మారటం. పరిణామ మార్పు చాలాకాలం పడుతుంది. కొన్నిటి విషయంలో వందల వేల సంవత్స రాలు పడుతుంది. ఉ॥ కోతి (Ape) మానవుడుగా మారటానికి. పరిణామం ఒకానొక మెట్టుకొచ్చాక, ఒక్కసారిగా (sudden) గుణాత్మక మార్పు చెందుతుంది. ఉ॥ బాల బాలికలు యుక్త వయస్సు వచ్చాక, భౌతిక మానసిక మార్పులకు లోనౌతారు. ఆడపిల్లలు సిగ్గుపడతారు. వారి బుగ్గలు ఎర్రబడతాయి. వారి మాట లకు అర్థాలు వేరుగా వుంటాయి. ఇక మగపిల్లలకు మీసాలొస్తాయి. వారి గొంతు మారుతుంది. ఇక ఇద్దరూ ఆడ, మొగ తారతమ్యాలను తెలుసుకుంటారు.

అలాగే, పెట్టుబడిదారీ వ్యవస్థ పెరిగి పెద్దదైనపుడు సమాజం రెండు వ్యతిరేక వర్గాలుగా విడిపోతుంది. వర్గ చైతన్యం పెరుగు తుంది. వర్గ పోరాటం మొదలౌతుంది. అప్పుడు సైద్ధాంతిక రాజకీయ పరిణామాలు జరుగుతాయి. కార్మిక రాజకీయ సమీకరణలు మొదలౌతాయి రాజ్యాంగ ఆధిపత్యం కొరకు (State power) దీన్ని గుణాత్మక మార్పుగా భావించవచ్చు. ఈ పరిణామంలో 'మధ్యతరగతి'కి డోలాయమాన పరిస్థితి - అటా? ఇటా? ఇక, ఈ తరగతి గోడమీద పిల్లి కాదు.

3. అభివృద్ధి క్రమంలో ఒక వస్తువు (Object) మరొకదాన్ని అభావం చేస్తుంది. ఇది ప్రకృతి, సమాజంలోనే కాకుండా భావ ప్రపంచం (Human thought) లో కూడా జరుగుతుంది.

ఉ॥ ఒక విత్తనాన్ని అనుకూల పరిస్థితుల్లో నాటితే అది మొలిసి మొక్కవుతుంది. అది వరి మొక్క అనుకుంటే పెద్దదై కంకులేస్తుంది. ఒక్క గింజకు బదులు వందలాది గింజలొస్తాయి. ఇదే అభావం అభావం చెందుట. కొత్త గింజలలో కొంత గుణాత్మక మార్పు కూడా వుంటుంది.

పెట్టుబడిదారీ వ్యవస్థను సోషలిజం అభావం చేస్తే, కొత్త సమాజం మునుపటి దానికంటే ఎన్నో రెట్లు అభివృద్ధిని సాధిస్తుంది. అభావమంటే మునుపున్న ఉత్పత్తి శక్తులను నాశనం చేయటం కాదు. వారసత్వంగా లభించిన ఉత్పత్తి శక్తులను పునాదిగా చేసు కొని, వాటిని ప్రణాళికాబద్ధంగాను, వేగంగాను అభివృద్ధిపరస్తుంది. అభావం అభావం చెందినపుడు అభివృద్ధి, అలల మాదిరిగా విస్తరించి (Spirals) ఒడ్డును (goal) తాకుతుంది.

పై గతితార్కిక నియమాలను వేరు వేరుగా చూడరాదు. ఈ నియమాలకు ఒకదానితో మరొకదానికి సంబంధం వుంది. పోరాటం లోనే పరిణామం వృద్ధిచెంది, గుణాత్మకంగా మారుతుంది. గుణాత్మక వృద్ధిని అభావం నిరూపిస్తుంది. కనుక మనం ఒక విషయాన్ని పరిశీలిస్తున్నప్పుడు ఈ మూడు నియమాలను దృష్టిలో పెట్టుకోవాలి.

మరో విషయం. మనం విశ్వాన్ని చూస్తున్నప్పుడు దాని అంశాలు విడివిడిగా వున్నట్లు కనిపిస్తాయి. నిశితంగా పరిశీలించి నపుడు, ఆ అంశాలకు విడదీయరాని సంబంధం కనిపిస్తుంది. ఆ సంబంధాలను అర్థం చేసుకున్నప్పుడే మన జ్ఞాన కేంద్రం పూర్తిగా తెరుచుకుంటుంది.

చారిత్రక భౌతికవాదం

గతితార్కిక భౌతికవాదాన్ని చరిత్రకు అన్వయిస్తే అది చారిత్రక భౌతికవాద మవుతుంది. చారిత్రక భౌతికవాదం సమాజ అభివృద్ధి క్రమాన్ని తెలియజేస్తుంది. సమాజ పరిణామం తానంతట అదే జరగదు. పరిణామ క్రమం నియమబద్ధంగా జరుగుతుందని మార్క్స్ నిరూపించాడు.

మార్క్స్ ఇంతవరకు జరిగిన సమాజ చరిత్రను పైకిపోతున్న నాలుగు మెట్లుగా (stages) విభజించాడు. అన్ని క్రమానుసారంగా, ఆదిమ కమ్యూనిస్టు, బానిస, భూస్వామ్య, పెట్టుబడిదారీ సమాజాలు. ఈ సమాజాలు రావటం, పోవటానికి కారణం : అభావం అభావం చెందటంవల్లే. కనుక కొత్త సమాజం పూర్వం దానికంటే అభ్యుదయమైనది. ఈ మార్పుకు చోదక శక్తి వర్గ పోరాటమే. వర్గ పోరాట బీజాలు ఉత్పత్తి సంబంధాలలో నాటబడి, మొలకెత్తుతాయి.

1. ఆదిమ కమ్యూనిస్టు సమాజం : ఇది మొదటి మానవ సమాజం. ప్రైవేటు ఆస్తి లేదు. భూమిని సామూహికంగా సాగుచేసే వారు. ఫలసాయాన్ని సమానంగా పంచుకునేవారు.

వ్యవసాయంతోపాటు చేతివృత్తులూ చేపట్టేవారు. ముఖ్యంగా నేత, వడ్రంగం, కుమ్మరి పనులు. ఉత్పాదికత చాలా తక్కువగా వుండేది. దీనికి ముఖ్య కారణం, ఉత్పత్తి సాధనాలు ఆదిమ దశలో వుండటం. రాతి గొడ్డళ్ళు, కర్ర బరిశలు, అందువల్ల మిగులు ఉత్పత్తి లేదు. ఉన్నది బతకటానికి బొటాబొటీగా సరిపోయేది. కనుక వర్గాలు లేవు, ప్రభుత్వం కూడా లేదు. ఆచారాలు కట్టుబాట్లే శాసనాలు.

కాలక్రమేణా పశుపోషణ, నాగలిలో దున్నటం నేర్చుకున్నారు. రకరకాల పంటలను పండించటం మొదలుపెట్టారు. మిగులు ఉత్పత్తి సాధ్యమయింది. ఈ మిగులు కొందరి చేతుల్లో పడి, క్రమేణా సొంత ఆస్తిగా మారింది. సొంత ఆస్తి వచ్చాక అది పెరుగు తూనే వుంటుంది. దీనితో చాలామందికి ఆస్తులు వుండవు. లేని వారు వున్నవారికి బానిసలుగా మారారు.

2. బానిస సమాజం : ఇది మొట్టమొదటి వర్గ సమాజం. వర్గాలు : బానిసలు బానిస యజమానులు. బానిసలు తిండి, గుడ్డ కోసం వెట్టిచాకిరి చేసేవాళ్ళు. మిగులు ఉత్పత్తంతా యజమానులకు చెందేది. బానిసలకు జంతువుకు భేదం లేదు. వారిని అమ్మవచ్చు, చంపవచ్చు కూడా.

ఉత్పత్తి సాధనాలు మెరుగుపడ్డాయి. చెక్ డ్యామ్‌లు కట్టి నీటిని నిలవ చేసేవారు. లోహాలతో పనిముట్లు చేసేవారు. బానిస శ్రమతో పెద్ద పెద్ద కట్టడాలను, రాజభవనాలను నిర్మించారు. (ఈజిప్టులో పిరమిడ్లు, రోములో బలంపియా మొదలగునవి)

బానిసల బతుకు హీనాతిహీనంగా వుండేది. భౌతికంగా హింసించబడేవారు. అయినా బానిసలు అక్కడక్కడ తిరగబడేవారు. తిరుగుబాటును అణచటానికి వెట్టిచాకిరి చేయించటానికి ఒక హింసాత్మక యంత్రాంగ మవసరమైనది. అదే రాజ్యం (State). దీనితో ప్రైవేటు ఆస్తి, ఆస్తిదారుల ప్రయోజనాలను రాజ్యం కాపాడుతూ వచ్చింది.

ఈ పరిస్థితుల్లో క్రైస్తవ మతం పుట్టింది. ఈ మతం మానవులందరూ దేవుని బిడ్డలని, వారందరూ సోదర సోదరీమణులని బోధించింది. కనుక బానిస విధానాన్ని వ్యతిరేకించింది. ఈ బోధనలు బానిసలకు కొంత ఊరటనిచ్చాయి. ఏసుక్రీస్తు బానిసలను రాత్రివేళల్లో కలిసి దేవుడు మిమ్ములను విముక్తి చేస్తాడని ఉత్తేజపరిచేవాడు. ఇలా క్రైస్తవ మతం బానిసలకు బాసటగా నిలిచింది. బానిసలందరూ క్రైస్తవ మతానికి చేరువయ్యారు. తిరుగుబాట్లు ప్రారంభించారు. బానిస నాయకుడు స్పార్టకస్ (Spartcus) రోమన్ పాలనకు వ్యతిరేకంగా పెద్ద తిరుగుబాటు చేశాడు. రాజ్యం అతలాకుతలమైంది. చిన్న చిన్న రాజ్యాలు రోమన్ సామ్రాజ్యాన్నించి విడిపోసాగాయి. క్రీస్తును శిలువ వేయటంతో బానిస విధానం క్రమంగా భూస్వామ్య వ్యవస్థకు మారింది. (మార్క్స్ స్పార్టకస్‌ను తన హీరోగా వర్ణించాడు.)

3. భూస్వామ్య సమాజం : బానిసలు వెట్టిచాకిరి రైతులయ్యారు (Serfs). భూస్వాములు తమ భూములలో కొంత భాగాన్ని చిన్న చిన్న ముక్కలుగా చేసి రైతులకిచ్చేవారు. దీనికి బదులుగా రైతులు భూస్వామి ఎస్టేటులో వారంలో కొన్ని రోజులు ఊరికే చాకిరి చేసేవారు. ఇది బానిస విధానం మీద మెరుగైన పద్ధతి. రైతు తన కమతంలో పండించిన పంటంతా తనకే దక్కుతుంది. భూస్వామికి కూడా లాభమే. రైతులు చాకిరి చేసి పండించి ఇస్తారు.

ఈ విధానంలో వ్యవసాయం, చేతివృత్తులు అభివృద్ధి చెందాయి. కొత్తగా పట్టణాలు పెరిగాయి. గ్రామాలు - పట్టణాల మధ్య వ్యాపార సంబంధాలు పెరిగాయి. సరుకు (Commodity) ఉత్పత్తి ప్రారంభమైంది. వస్తు మార్పిడికి బదులు డబ్బు (Money) చలామణిలోకొచ్చింది. ఈ మార్పులు రాబోవు పెట్టుబడిదారీ వ్యవస్థకు బాటవేశాయి.

సెర్ఫ్లు (Serfs) క్రమేపి కౌలుదారులుగా మారారు. పంటలో సగభాగం కౌలు చెల్లించేవారు. పైగా భూస్వాముల జన్మదినాలకు, పెళ్ళిళ్ళకు, పెటాకుల ఖర్చులకూ కౌలుదారులు చెల్లించేవారు. ఇంక వారికి మిగిలేదేమున్నది. పైగా వారి కౌలుభూమి భూస్వామి దయాదాక్షిణ్యాల మీద ఆధారపడింది. కౌలు కట్టలేనివారు, తొలగించబడినవారు బతుకుతెరువు కోసం పట్టణాలకు వలస పోయేవారు. (ఈ వలసదారులే తరువాతి పెట్టుబడిదారీ వ్యవస్థలో వేతన కార్మికులయ్యారు) దీనితో వ్యవసాయం కుంటుబడింది. దానితోబాటు చేతివృత్తులు కూడా మందగమనంలో పడ్డాయి. ఉత్పత్తి శక్తుల అభివృద్ధికి ఉత్పత్తి సంబంధాలు అడ్డుగోడలుగా నిలిచాయి.

ఈ సంధ్యకాలంలో భూస్వాముల ఆదాయం తగ్గి, ఖర్చులను నియంత్రించలేక వడ్డీ వ్యాపారుల చేతులకు చిక్కారు. చాలామంది తమ భూములను పోగొట్టుకున్నారు. ఈ వడ్డీ వ్యాపారులే క్రమేణా సరుకు వ్యాపారులుగా మారారు (Merchants). వీరు సరుకు తయారుచేసేవారికి ముడిపదార్థాలు సప్లయ్ చేసి, డబ్బు పెట్టుబడి పెట్టి వ్యాపార పెట్టుబడిదారులైనారు (Merchant Capital). ఈ పద్ధతిలో సరుకు ఉత్పత్తిని పుటింగ్ ఔట్ అంటారు (Putting out system). ఈ పెట్టుబడిదారులను ఆ కాలంలో మధ్యతరగతి అనేవారు (ఫ్రెంచి భాషలో బూర్జువా). ఈ వర్గం ఆర్థికంగా మొదటి స్థానాన్ని ఆక్రమించింది. ఇక రాజ్యాధికారాన్ని చేపట్టాలి. ఇంగ్లండులో గ్లోరియస్ విప్లవం (1688), ఫ్రెంచి విప్లవం (1789) బూర్జువా వర్గానికి రాజ్యాధికారాన్ని కట్టబెట్టాయి.

4. బూర్జువా సమాజం : ఈ సమాజాన్ని ఆధునిక సమాజంగా పేర్కొనవచ్చు. ఈ సమాజ నాయకులు బూర్జువా వర్గం. ఈ వర్గానికి వెనుకచూపు లేదు. ఎప్పుడూ ముందుకు పోవటమే దాని లక్ష్యం. బూర్జువావర్గం గురించి కమ్యూనిస్టు ప్రణాళిక ఇలా చెప్పింది.

"బూర్జువా వర్గం తన 100 ఏళ్ళ (అప్పటికి 1848) పాలనలో ఉత్పత్తి శక్తులను ముందు తరాల వారికంటే ఎన్నో రెట్లు అభివృద్ధి చేసింది. సరుకులను చవకగా, నాణ్యతగా తయారు చేసింది. ఈ సరుకు చైనా గోడలను కూడా బద్దలుకొట్టింది." పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రధాన గుణం : శ్రమ విభజన, యాంత్రీకరణ, కార్మికుల చేత మిగులు విలువను ఉత్పత్తి చేయించుట. ఆ విలువను పెట్టుబడిగా మార్చటం.

లాభాపేక్షతో పెట్టుబడులను పెంచి, ఉత్పత్తి నియంత్రీకరణ చేయటం వల్ల, తక్కువ కార్మికులతో ఎక్కువ ఉత్పత్తి చేయవచ్చు. అందుచేత నిరుద్యోగం, పేదరికం ఈ సమాజంలో సర్వసాధారణం. పేదరికంవల్ల ప్రజలలో కొనుగోలు శక్తి క్షీణిస్తుంది. ఇది ఆర్థిక మాంద్యాలకు దారితీస్తుంది. ఈ ఆర్థిక మాంద్యాలను అధిగమించటానికి పెట్టుబడిదారీ వ్యవస్థ సామ్రాజ్యవాదంగా మారింది. సామ్రాజ్యవాదులు ఖండాంతర దేశాలలో వలసలను స్థాపించి విదేశీ మార్కెట్లను తమ గుప్పెటలో పెట్టుకొన్నారు. ఈ సామ్రాజ్యవాదమే రెండు ప్రపంచ యుద్ధాలకు దారితీసింది. కనుక సామ్రాజ్యవాదం ప్రపంచ శాంతి సౌఖ్యాలకు పరమ శత్రువు.

కార్మికుల జీవిత స్థితిగతులే వారికి వర్గ చైతన్యం కలిగిస్తుంది. సంఘటితంగా దోపిడీకి వ్యతిరేకంగా పోరడతారు. మధ్యతరగతి, కర్షకులు కూడా కార్మికులకు సంఘీభావం తెలుపుతారు. పెట్టుబడిదారీ వ్యవస్థకు మృత్యుఘడియలు సమీపిస్తాయి. కనుకనే, కమ్యూనిస్టు మానిఫెస్టో ఒక చారిత్రక పిలుపునిచ్చింది.

"ప్రపంచ కార్మికులారా ఏకంకండి!
మీకు పోయేది లేదు. మీ సంకెళ్ళు మాత్రమే.
మీరు కొత్త ప్రపంచాన్ని జయించబోతున్నారు."

*

మార్పు సాధించేందుకు ఇది సమయం

ప్రభాత్ పట్నాయక్ *

నయా ఉదారవాదం భారతదేశంలో ఒకవైపు దుర్భర దారిద్ర్యం, మరోవైపు సంపద పోగుపడే ఆర్థిక వ్యవస్థ నమూనాను అభివృద్ధి చేస్తున్నది. అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఆధిపత్యాన్ని రాజ్యం వదిలించుకుంటేనే దాన్ని ఓడించటం సాధ్యం. నయా ఉదారవాదం తిరోగమనంలో వుంది. దాన్ని సమాధి చేయటానికి 2009 ఎన్నికలు అవకాశం కల్పిస్తున్నాయి. ప్రత్యామ్నాయ అభివృద్ధి వ్యూహాన్ని ఎంచుకోండి!

భారతదేశంలో నయా ఉదారవాద విజయం పరిపూర్ణం కాలేదు. జాతీయం చేయబడిన బ్యాంకులు ప్రభుత్వస్వామ్యంలో కొనసాగుతున్నాయి; కీలకమైన ప్రభుత్వరంగ కంపెనీలు ప్రైవేటీక రించబడలేదు; పెన్షన్ నిధులు సట్టావ్యాపార ద్రవ్యపెట్టుబడికి అప్పగించబడలేదు; కరెన్సీని పూర్తిగా స్వేచ్ఛా మార్పిడిలోకి తేలేదు; ద్రవ్యరంగం అజమాయిషీలోని విదేశీ ఆస్తులు - రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్.బి.ఐ.) వద్ద వున్న మారక ద్రవ్య నిల్వలు మినహా - నామమాత్రం. క్లుప్తంగా చెప్పాలంటే, నయా ఉదారవాదా నికి ఆధారభూతంగా వుండే రెండు అంతర్ సంధాన, పరస్పర శక్తి ప్రదాత క్రమాలు - ప్రభుత్వ రంగాన్ని ధ్వంసం చేయటం, ప్రపంచ ద్రవ్యంతో విలీనం కావటం నిలిచిపోయి వుంది.

నయా ఉదారవాద సమర్థకుల ప్రయత్నలోపం వల్ల ఈ పరిస్థితి నెలకొనలేదు. ఉదాహరణకు, బీమారంగం ప్రైవేటీకరణను తీసుకున్నట్లయితే సక్రమ అక్రమ మార్గాలతో సహా సర్వ విధాల ప్రయత్నించారు. చివరి రోజుల్లో వున్న ప్రభుత్వం, నిజానికి మైనారిటీలో పడిపోయిన ప్రభుత్వం సత్వర చర్యలకు కూడా ప్రయత్నించింది. అయితే ట్రేడ్‌యూనియన్‌ల నుండి, ముఖ్యంగా ద్రవ్య రంగంలోని యూనియన్‌ల నుండి, రాజకీయ వామపక్షం నుండి, ప్రగతిశీల మేధావుల నుండి వచ్చిన తీవ్రమైన ప్రతిఘటన వల్ల ఆ ప్రయత్నాలు నిలిచిపోయాయి. నయా ఉదారవాద పాలక వర్గం వామపక్షం - యు.పి.ఎ. మధ్య సంబంధం తెగిపోవటాన్ని సంతోషంతో స్వాగతించిన తీరు, ఈ దూరం తదుపరి నయా ఉదారవాద ఎజెండాను శీఘ్రంగా అమలుచేయాలని వారు వ్యక్తం చేసిన ఆత్రుత నయా ఉదారవాదానికి వామపక్షం ప్రతిఘటన ప్రాముఖ్యతను నొక్కిచెబుతున్నది. ఆ ప్రతిఘటన ఒక్కటే సరిపోదు. నయా ఉదారవాదం నగం విజయవంతమైనా, భారతీయ సమాజంలో అంతరాన్ని విస్తృతం చేయటానికి, ఆధునిక భారతీయ సమాజం పునాదులను కుదిపివేయటానికి అది చాలు.

అసంఖ్యాకమైన కుల, వర్గ, లింగ, ఇతర దోపిడీ రూపాలతో పీడనకు గురవుతున్న, అసాధారణంగా పొంతనరహితమైన ప్రజల నుండి ఆధునిక భారత జాతి రూపుదిద్దుకోవటం మన కాలపు అద్భుతాల్లో ఒకటి. వలసవాదులకు వ్యతిరేకంగా దీర్ఘకాలం సాగిన పోరాటం ద్వారా అది సాధ్యమైంది. ఆ పోరాటానికి భూమికలో అంతర్లీనంగా కనిపించేది 'సామాజిక ఒడంబడిక'. అంతకుముందు, అప్పుడప్పుడూ, ముఖ్యంగా 1931 కరాచీ కాంగ్రెస్ తీర్మానంలో వెలిబుచ్చిన ఈ 'సామాజిక ఒడంబడిక'ను రిపబ్లిక్ రాజ్యాంగంలో వ్యక్తీకరించే ప్రయత్నం జరిగింది. అందులో ప్రధానమైనది : సార్వజనీన వయోజన ఓటింగ్ ప్రాతిపదికపై ఎన్నికలపై ఆధారపడిన ప్రజాస్వామ్యం, లౌకికత, పౌర స్వేచ్ఛలు, కుల, లింగ పీడనను అంతం చేయటం, సమసమాజ నిర్మాణం. ఒకవైపు, ప్రపంచంలోని అగ్రశ్రేణి బిలియనీర్లలో కొందర్ని తయారుచేయటం, రెండోవైపున, వేలాదిమంది రైతుల ఆత్మహత్యలు అటువంటి 'సామాజిక ఒడంబడిక'కు ఉల్లంఘన. అది ఆధునిక భారత జాతి పునాదికి ముప్పు తెస్తుంది. నయా ఉదారవాదం అటువంటి ఉల్లంఘనే. ఎందుకంటే అది అనేక ఇతర విషయాలతోపాటు రైతులకు, చిన్న తరహా ఉత్పత్తిదారులకు రాజ్యం తోడ్పాటును ఉపసంహరిస్తున్నది.

రాజ్యం క్రియాశీల జోక్యం వల్లనే రైతాంగం, చిరు ఉత్పత్తి దారులు పెట్టుబడిదారీ దాడిని తట్టుకు నిలబడగలుగుతారు. మనవంటి సమాజంలో అటువంటి రక్షణ కల్పించాలి. క్షీణిస్తున్న చిరు ఉత్పత్తి ఆర్థిక వ్యవస్థ నుండి ప్రాదుర్భావ పెట్టుబడిదారీ వ్యవస్థలోకి పరివర్తన క్రమంలో ప్రజల కష్టాలు దుర్భరంగా వుంటాయి. "ఉపాధుల మధ్య" ఎంపిక కష్టమైనప్పుడు ఇది మరీ దుర్భరం. అందువల్ల క్షీణతను సరైన పద్ధతిలో పెట్టాల్సి వుంటుంది. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో అటువంటి పరివర్తన అసాధ్యం. ఉపాధి కల్పించటంలో అటువంటి పెట్టుబడిదారీ అభివృద్ధి సామర్థ్యం బహు తక్కువ స్థాయిలో వుంది. ఉపాధి కోల్పోయే రైతులు, చిరు ఉత్పత్తిదారులకు రక్షణ కల్పించే స్థితిలో అది లేదు. అటువంటి పెట్టుబడిదారీ వ్యవస్థ నిరుద్యోగ సైన్యాన్ని, అరకొర ఉపాధితో ఈతిబాధలనుభవించే దరిద్రులను మాత్రమే సృష్టిస్తుంది. అంటే దుర్భర దారిద్ర్యం ఒకవైపు, సంపద వృద్ధి మరోవైపు వుండే సమాజాన్ని సృష్టిస్తుంది.

పెట్టుబడిదారీ రంగం వృద్ధిరేటు ఎంత హెచ్చుగా వుంటే సంపూర్ణ దారిద్ర్య స్థాయి అంత ఎక్కువగా వుంటుంది. ఎందుకంటే హెచ్చు వృద్ధి మరింత బలంగా చిరు ఉత్పత్తిని దెబ్బతీస్తుంది.

---

* కేరళ ప్రణాళికా బోర్డు ఉపాధ్యక్షులు

అందువల్ల నెలకొనివున్న, తీవ్రతరమవుతున్న దారిద్ర్యం సమస్యకు పరిష్కారం హెచ్చు ఆర్థికాభివృద్ధి రేటులోనే వుందన్న అభిప్రాయం తప్పు. హెచ్చు వృద్ధిరేటు దారిద్ర్యాన్ని పెంచుతుంది.

దారిద్ర్యాన్ని నివృత్తి చేయాలంటే పెట్టుబడిదారీ అభివృద్ధి ద్వారా చిరు ఉత్పత్తిని రూపుమాపటాన్ని నిరోధించే రాజ్యం కావాలి. అది శ్రామిక ప్రజలందరికీ సంక్షేమ సదుపాయాలు అందించేందుకు గణనీయంగా వ్యయం చేయాలి. పెట్టుబడి, పెట్టుబడియేతర రంగాలు రెండింటిలోనూ సాంఘిక వేతనాన్ని పెంపొందించాలి. నయా ఉదార రాజ్యం దాని స్వభావం రీత్యానే ఆ పని చేయలేదు. నిజానికది తద్విరుద్ధం చేస్తుంది.

"నయా ఉదార రాజ్యం" అనే పదం ఆశ్చర్యం కలిగించవచ్చు. నెహ్రూ తరహా ప్రభుత్వం (ఆర్థిక, సాంఘిక విషయాలలో ప్రభుత్వ నిర్దేశం, అజమాయిషీ వుండే విధానం), నయా ఉదారవాదం ఒకే రాజ్యానికి అందుబాటులో వున్న రెండు ప్రత్యామ్నాయ సాధనాలుగా తరచూ చూడబడుతున్నాయి. అంటే రెండింటిలో ఏ విధానాన్నయినా అమలుచేయగల సమర్థత అదే రాజ్యానికి వుందని భావించటం. అది తప్పు. ఒక విధానం నుండి మరోదానికి పరివర్తన జరగాలంటే, రాజ్యానికి ఆధారభూతంగా వున్న వర్గ కూర్పులో మార్పు రావాలి, దానిపై ఆధిపత్యం వహిస్తున్న వర్గాల స్వభావం, పొందికలో మార్పు రావాలి. అంటే రాజ్య స్వభావంలో కూడా మార్పు రావాలి. ఉదాహరణకు, 1930వ దశకంలో లాటిన్ అమెరికాలో అప్పటివరకు వున్న ఎగుమతి ఆధార అభివృద్ధి వ్యూహం స్థానంలో దిగుమతి ప్రత్యామ్నాయ పారిశ్రామికీకరణను చేబట్టినపుడు, ఈ మలుపుతోపాటు పెద్దయెత్తున రాజకీయ తిరుగుబాట్లు సంభవించాయి. అది కేవలం ఒక విధానం నుండి మరో విధానంలోకి మారటం కాదు. ఆ మలుపు ఒక తరహా రాజ్యం నుండి మరో తరహా రాజ్యంలోకి మారటంలో భాగం. భారతదేశంలో నెహ్రూ తరహా ప్రభుత్వం నుండి నయా ఉదారవాదంలోకి మారటం ప్రపంచవ్యాప్తంగా సంక్షేమ రాజ్య భావన నుండి నయా ఉదారవాద ఆర్థిక వ్యవస్థలోకి వచ్చిన మార్పులో భాగం. అభివృద్ధి చెందిన దేశాల్లో ఈ మార్పు కీనీసియన్ డిమాండ్ మేనేజిమెంట్ విధానానికి స్వస్తి పలికిన రూపంలో వచ్చింది. "పెట్టుబడి ప్రపంచీకరణ" క్రమం ఫలితంగా ప్రపంచ వ్యాప్తంగా ఈ మార్పు వచ్చింది. ఇది అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడిని అస్థిత్వంలోకి తెచ్చింది.

సంక్షేమ విధానాలు అనుసరిస్తున్న దేశ - రాజ్యాలు ద్రవ్యం తరలిపోవటాన్ని నిరోధించేందుకు అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి చలచిత్తానికి తలొగ్గవలసి వచ్చింది. (ప్రపంచీకరణ పొందిన ద్రవ్య వ్యవస్థతో ఏమాత్రం సంబంధం కూడదన్న రాజకీయ సంకల్పం వుంటే తప్ప దూరంగా వుండటం సాధ్యం కాదు. బూర్జువా రాజ్యాలకు అటువంటి సంకల్పం వుండదు.) నయా ఉదారవాద లక్షణాలు ఇలా వుంటాయి : "ద్రవ్య సవ్యత" (మహా అయితే నిర్దేశించిన కొద్దిపాటి ద్రవ్యలోటు వుండవచ్చు), వాణిజ్యం, ద్రవ్య రంగాల సరళీకరణ, జోక్యం చేసుకునే పాత్ర నుండి (ద్రవ్య పెట్టుబడి ప్రయోజనాల కొరకు మినహా) రాజ్యాన్ని వెనక్కు మళ్ళించటం, ప్రభుత్వరంగ యూనిట్లను ప్రైవేటీకరించటం, అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ప్రయోజనాలు, దృక్పథానికి ప్రాతినిధ్యం వహించే ఇంకా అటువంటి చర్యలు.

ఈ విధానాలను అమలుజరపటానికి రాజ్యం లక్షణంలో మార్పు అవసరం. అంటే వర్గాలకు అతీతంగా నిలబడే, వాటి మధ్య మధ్యవర్తిత్వం నెరిపే రాజ్యం నుండి (అది బూర్జువావర్గ రాజ్యమైనప్పటికీ) అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడితో కలిసిపోయిన బూర్జువా వర్గంలోని ఉన్నత శ్రేణుల ప్రయోజనాల కొరకు ప్రధానంగా పనిచేసే రాజ్యంలోకి మారాలి. అటువంటి రాజ్యం చిరు ఉత్పత్తిని సమర్థిస్తుందని, కాపాడుతుందని, సంక్షేమం కొరకు వ్యయం చేస్తుందని, సామాజిక వేతనాలు పెంచుతుందని ఆశించటం - అంటే దారిద్ర్యాన్ని నిర్మూలిస్తుందని ఆశించటం సింహాన్ని మేకగా భ్రమించటమే.

అయితే భారతదేశంలో రాజ్యం పరివర్తన సంపూర్ణంగా ఎన్నడూ జరగలేదు. నయా ఉదారవాదం దిశగా ప్రయాణానికి ప్రజాస్వామిక చట్రం ఇబ్బందికరంగా వుంది. ఎందుకంటే, ఈ చట్రం లోపల నయా ఉదారవాద ఎజండా దాని సంపూర్ణ విజయానికి తగినంత తోడ్పాటును ఎన్నడూ సాధించలేదు. అయినా ఈ చట్రాన్ని వదిలించుకునే పరిస్థితీ లేదు. "అభివృద్ధిని రాజకీయాలకు అతీతంగా వుంచాల"ని - నయా ఉదారవాద ఎజండా చుట్టూ స్థూల ఏకాభిప్రాయం సాధించటానికి ఈ భాష వాడుతుంటారు - ఉద్బోధలకు కొదవ లేనప్పటికీ, అటువంటి స్థూల ఏకాభిప్రాయం కుదరటం లేదు. అయినప్పటికీ, నయా ఉదారవాదం సాధించిన ఈ అర్థవిజయం, రాజ్యం యొక్క పాక్షిక పరివర్తన గణనీయమైన నష్టం చేయటానికి చాలు. అన్నిటికీ మించి రైతులకు, చిరు ఉత్పత్తిదారులకు తోడ్పాటు అందించటాన్నుండి రాజ్యం ఉపసంహరించుకుని తీరని నష్టం చేసింది.

సబ్సిడీలో కోత పెట్టటం రైతాంగ వ్యవసాయ పెట్టుబడుల ఖర్చులు పెంచింది. సామాజిక బ్యాంకింగ్ లక్ష్యం నుండి ఉపసంహరించుకోవటం వ్యవసాయానికి వ్యవస్థాగత పరపతిని తగ్గించింది; దానితో రుణాల కొరకు విపరీతమైన అధిక వడ్డీలు గుంజే వడ్డీ వ్యాపారుల దయాదాక్షిణ్యంలోకి రైతుల్ని మళ్ళీ త్రోసింది. విస్తరణ సేవలను రద్దుచేయటం వల్ల రైతులకు బహుళజాతి కంపెనీలతో ప్రత్యక్ష సంబంధాన్ని, వాటిపై ఆధారపడటాన్ని పెంచింది. వాణిజ్య సరళీకరణ వల్ల ప్రపంచ మార్కెట్ ధరల ఒడిదుడుకులకు రైతులు లోనైనారు. దేశీయ ధాన్య సేకరణ యంత్రాంగాన్ని క్రమంగా రద్దు చేయటం వల్ల వ్యవసాయ ఖర్చులు - ధరల కమిషన్ కిందకు వచ్చే పంటలకు లభించే రక్షణ సైతం తొలగించబడింది. అన్నిటికీ మించి గ్రామీణ ప్రాంతంలో ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించటంతో గ్రామీణ కొనుగోలు శక్తి గణనీయంగా తగ్గిపోయింది.

1990వ దశకం ప్రారంభం నాటినుండి వ్యవసాయరంగంలో స్తబ్దత ఏర్పడటం, తలసరి ఆహారోత్పత్తి తగ్గటం ఒక్కటే దీని పర్యవ

సానం కాదు. తలసరి ఆహార వినిమయం కూడా తగ్గింది. ఇది ఉత్పత్తిలో క్షీణతకన్నా హెచ్చుగా వుంది. గ్రామీణ ప్రాంతంలో కొనుగోలు శక్తి స్తంభించిపోయిన ప్రభావం ఎంత తీవ్రంగా వుందంటే, తలసరి ఉత్పత్తి క్షీణించటంతో నిమిత్తం లేకుండా, ధాన్య సేకరణ కార్యకలాపాలు చేపట్టినపుడల్లా ఆహార ధాన్యాల నిల్వలు పెరిగిపోయాయి. రైతుల విషయంలో ఏది వాస్తవమో ఇతర చిరు ఉత్పత్తిదారుల విషయంలోను అదే వాస్తవం. ఒకవైపు, చౌక దిగుమతులు, మరోవైపున ఉపకరణాల ఖర్చులు పెరుగుదల మధ్య వారు నలిగిపోయారు. పర్యవసానంగా వారు గణనీయంగా సంపూర్ణ దారిద్ర్యం అనుభవించారు. అది ఎంతగా వుందంటే వారి రోజువారీ శ్రమ ఆదాయం అతి తక్కువ కనీస వేతనంకన్నా దిగువకు పడిపోయింది.

విషాదమేమంటే, ఆర్థిక వ్యవస్థ ఉరికినప్పుడు (బూమ్) దారిద్ర్యానికి గురైన జనాలే ప్రస్తుతం మనపై వున్న సంక్షోభ కాలంలో మరింతగా దరిద్రులవుతారు. ఇది నయా ఉదారవాద విజయం ప్రపంచ వ్యాప్తంగా తెచ్చిపెట్టిన సంక్షోభం. బూమ్ కాలంలో అసంఖ్యాక ప్రజానీకాన్ని పీల్చి పిప్పిచేసిన నయా ఉదారవాద వ్యవస్థయే ఇప్పుడు సంక్షోభాన్ని తీవ్రం చేసింది. ఇది కొనసాగినంత కాలం పేదల్ని పిండటం ముమ్మరమవుతుంది.

అయితే ఈ సంక్షోభం నయా ఉదారవాదానికి అంతం పలుకుతుంది. విశ్వ సంక్షోభం నుండి బయటపడే ఏకైక మార్గం ప్రభుత్వ వ్యయాలను పెంచే ద్రవ్య ఉద్దీపన చర్యలేనన్నది స్పష్టం. అవి సమర్థవంతంగా పనిచేయాలంటే దేశాల మధ్య సమన్వయం అవసరం; రాజకీయంగా ఆమోదయోగ్యం కావాలంటే ఆ వ్యయాలను ప్రజలవైపు నిర్దేశించాలి. అటువంటి సమన్వయ పూర్వక ఉద్దీపన 'ద్రవ్య సవ్యత' సూత్రాలను ఉల్లంఘిస్తుంది; ప్రజల పక్షాన రాజ్యం క్రియాశీలతను పునఃస్థాపిస్తుంది. అది అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి సిద్ధాంతానికి తిరస్కారం. అందుకే అది దీన్ని ప్రతిఘటిస్తోంది. అయితే ఈ ప్రతిఘటన సంక్షోభాన్ని పొడిగించటం మాత్రమే చేస్తుంది. ప్రస్తుత సంక్షోభానికి, అది కొనసాగటానికి హేతువైన నయా ఉదారవాద సిద్ధాంత తిరస్కరణకు బలం చేకూర్చుతుంది. నయా ఉదారవాదం స్పష్టంగా దాని సంకెల అంచుకు చేరింది.

భారతదేశంలో దాన్ని కాపాడటానికి ఒక వినూత్న ప్రయత్నం జరుగుతున్నది. డిమాండ్‌ను పునరుద్ధరించటానికి ద్రవ్య విధాన చర్యలేవీ ఫలించనందున ఆర్థిక వ్యవస్థను సంక్షోభం నుండి గట్టెక్కించటానికి ద్రవ్య ఉద్దీపన ఇవ్వాల్సిన అవసరాన్ని ప్రభుత్వం అంగీకరిస్తున్నది. ఈ ద్రవ్య ఉద్దీపన స్వభావాన్ని చర్చించేటపుడు మౌలిక వసతుల రంగంలో పబ్లిక్ - ప్రైవేట్ భాగస్వామ్యం (పి.పి.పి.) ప్రాజెక్టులకు "వయబిలిటీ గ్యాప్ ఫండింగ్" (నిధుల లభ్యతలో వ్యత్యాసాన్ని పూడ్చటం) గూర్చి వక్కాణిస్తున్నది. మరో విధంగా చెప్పాలంటే, ప్రభుత్వం పెద్దయెత్తున వెచ్చించే ధనం మౌలిక వసతుల అభివృద్ధి పేరుతో ప్రైవేటు పెట్టుబడిదారులకు అందజేయబడుతుంది. ప్రభుత్వం నిధులు సమకూర్చటంతో అమలుజరిగే పి.పి.పి. నిజానికి నయా ఉదారవాద ఎజెండాలో భాగం. ఇది పెద్దయెత్తున ద్రవ్యలోటుతో కీనీసియన్ దిశలో ప్రయాణిస్తున్నట్లు, నయా ఉదారవాదం నుండి వెనక్కు తగ్గుతున్నట్లు కనిపిస్తూనే దాన్ని ముందుకు తీసుకెళ్ళటమే.

ఈ వ్యూహం ప్రస్తుత సందర్భంలో నిరర్థకమైనదేగాక రెండు అర్థాల్లో అప్రజాస్వామికం కూడా. పెట్టుబడి పెట్టేందుకు ఆకర్షణ అతి తక్కువగా వుండగా ప్రభుత్వం పెద్దయెత్తున నిధులిచ్చినప్పటికీ అది ప్రైవేటు పెట్టుబడిని పెద్దయెత్తున ఆకర్షించే అవకాశం తక్కువ. ఒకటి, మౌలిక వసతుల అభివృద్ధి అనేది వేగంగా శ్రుతి మారే రాగం లాంటి భావన. మౌలిక వసతులను అభివృద్ధిపరచటమంటే అది గ్రామంలో రహదారి నుండి ఐదు నక్షత్రాల హోటల్ వరకు ఏదైనా కావచ్చు. "మౌలిక వసతుల" అభివృద్ధి పేరుతో ప్రమోట్ చేసే ప్రాజెక్టులు సహజంగా రెండవ శ్రేణికి చెందినవే అయివుంటాయి. దీనివల్ల ప్రజావసరాల ప్రాధాన్యతలు విస్మరించబడుతున్నాయి. రెండు, ప్రజల డబ్బును ప్రైవేటు పెట్టుబడిదారులకు బదిలీ చేయటంకన్నా ప్రజలకు జవాబుదారీ అయిన ప్రభుత్వమే నేరుగా ఖర్చుచేయటం మంచిది. ప్రజల ధనం ప్రైవేటువారికివ్వవలసిన అవసరం నిరూపణ కాలేదు, దాని వినియోగంపై పర్యవేక్షణ ఎన్నడూ లేదు.

ఆరోగ్యం, విద్య, పారిశుద్ధ్యం, త్రాగునీరు, గ్రామీణ మౌలిక వసతులు, వ్యవసాయాభివృద్ధి, ఆహార భద్రత, రైతులు, చిరు ఉత్పత్తిదారులకు మద్దతు ధర వంటివాటిపై పెద్దయెత్తున ప్రభుత్వ వ్యయం రూపంలో అనువైన ద్రవ్య ఉద్దీపన అవసరం. ఈ ఉద్దీపన నిమిత్తం, పెట్టుబడులు తరలిపోకుండా దేశాల మధ్య ద్రవ్య ప్రయాణంపై అజమాయిషీ అవసరం. ప్రపంచ మార్కెట్లలో ధరలు పడిపోయిన సందర్భాల్లో వాటి ప్రభావం నుండి రైతులు, ఇతర ప్రాథమిక వస్తూత్పత్తిదారులను ఆదుకునేందుకు, చౌక దిగుమతుల నుండి చిరు ఉత్పత్తిదారులను కాపాడేందుకు అనువైన రక్షణ వ్యవస్థ అవసరం. స్థూలంగా, "నా పొరుగువాడు బిచ్చగాడు" అనే ఇతర దేశాల విధానాలకు వ్యతిరేకంగా, ఉద్దీపన చర్యల ప్రభావం కింద చేతివాటాలు అతి తక్కువగా వుండేటట్లు చూడటానికీ ఈ వ్యవస్థ అవసరం.

ఇవన్నీ అమలుజరగాలంటే నయా ఉదారవాదం నుండి వెనక్కు రావాలి. ఈ వెనకడుగును తాత్కాలికమైనదిగా చూడరాదు. సంక్షోభ అధిగమనాన్ని ప్రత్యామ్నాయ అభివృద్ధి మార్గంతో సంధానించాలి. అది రైతు వ్యవసాయం ప్రాధాన్యం వహించే వృద్ధిగా వుండాలి. ఇందుకుగాను నయా ఉదారవాదానికి పూర్తిగా భిన్నమైన ఆర్థిక నిర్వహణా వ్యవస్థ అవసరం. మరో విధంగా చెప్పాలంటే, నయా ఉదారవాద వ్యవస్థను శాశ్వతంగా సమాధి చేయాలి. అంతర్జాతీయ ద్రవ్యపెట్టుబడి ఆధిపత్యాన్ని వదిలించుకుంటేనే ఇది సాధ్యం. నయా ఉదారవాదానికి వ్యతిరేకంగా పోరాటం దాని విజయాన్ని సగానికి పరిమితం చేసింది. దాన్ని పూర్తిగా వెనక్కు కొట్టటానికి పోరాటాన్ని ఇప్పుడు ఉధృతం చేయాల్సి వుంది. ✻

భారతదేశంలో ఉన్నత విద్యారంగం - ఓ పరిశీలన

చేకూరి నరసింహారావు *

స్వాతంత్ర్యానంతరం మన దేశంలో ఉన్నత విద్యారంగం క్రమేపీ అభివృద్ధిచెందుతూ వచ్చిందనడంలో సందేహంలేదు. అయితే అది ఏ మేరకు అభివృద్ధి చెందింది, ఏ వర్గాల అభ్యున్నతికి తోడ్పడింది, ఉన్నత విద్యలో నాణ్యత ప్రమాణాలకు సంబంధించి, దాని శాస్త్రీయత గురించి, చర్చ జరుగుతూనే వుంది. మరోవైపున పాలకవర్గాలు సరళీకరణ, ప్రైవేటీకరణ విధానాల నాచరిస్తున్న పర్యవసానంగా ఉన్నత విద్యారంగంలో ప్రైవేటీకరణ, వాణిజ్యీకరణ ధోరణులు ప్రబలంగా చోటుచేసుకోవడంపై కూడా వాడిగా చర్చ జరుగుతుంది. స్థూలంగా మనదేశంలో ఉన్నత విద్యారంగంలో చోటుచేసుకుంటున్న వివిధ పరిణామాలను పరిశీలిద్దాం.

1950-51వ సంవత్సరంలో మనదేశంలో ఇరవై ఎనిమిది విశ్వ విద్యాలయాలుండగా 2004-05 నాటికి వాటి సంఖ్య మూడు వందల నలభై ఎనిమిదికి పెరిగింది. 2006 నాటికి ఇరవై కేంద్ర విశ్వవిద్యాలయాలు, రెండు వందల పదిహేడు రాష్ట్ర విశ్వ విద్యాలయాల మరో రెండు డీమ్డ్ విశ్వవిద్యాలయాలు ఏర్పాటు చేయబడ్డాయి. ఒక్క పదో పంచవర్ష ప్రణాళికలోని మొదటి నాలుగు సంవత్సరాలలో మన దేశంలో రెండు కేంద్రీయ విశ్వవిద్యాల యాలు, ముప్పయి తొమ్మిది స్టేట్ విశ్వవిద్యాలయాలు, యాభై డీమ్డ్ యూనివర్శిటీలు కాక మరో పది ప్రైవేటు విశ్వవిద్యాలయాలు ప్రారంభించబడ్డాయి. స్టేట్ యూనివర్శిటీల పెరుగుదల రేటు 22% వుండగా, డీమ్డ్ యూనివర్శిటీల పెరుగుదల నూరు శాతంగా వున్నది. కళాశాలల సంఖ్య పదిహేడు శాతం మాత్రమే పెరిగింది. పదవ పంచవర్ష ప్రణాళికలో డీమ్డ్ యూనివర్శిటీలు, ప్రైవేటు యూనివర్శిటీలు గణనీయంగా పెరగడం చూచిస్తున్న దేమంటే ఉన్నత విద్యారంగంలో ప్రైవేటీకరణ ధోరణులు మరింతగా ప్రభలుతున్నాయి. ఉన్నత విద్యారంగంలో మార్కెట్ ఆధిపత్యం మరింతగా వేళ్ళూనుకున్నది. ఉన్నత విద్యారంగంలో ప్రైవేటీకరణ, వాణిజ్యీకరణ ధోరణులు పెరుగుతున్న కొద్దీ అది అభివృద్ధికి ప్రతిబంధకంగా మారుతున్నది. అందువలన ప్రభుత్వం పదకొండవ పంచవర్ష ప్రణాళికలోనైనా ఉన్నత విద్యారంగ అభివృద్ధికి సంబంధించి సమతుల్యతను పాటించవలసిన అవసరం ఎంతైనా వున్నది.

2005-06 నాటికి మన దేశంలో ఉన్నత విద్యారంగంలోనున్న విద్యార్థినీ విద్యార్థుల సంఖ్య 13.6 మిలియన్లుకాగా అందులో పరిశోధనారంగంలోనున్న విద్యార్థినీ విద్యార్థుల సంఖ్య కేవలం 36,519 మాత్రమే. పి.జి. విద్యనభ్యసిస్తున్న వారి సంఖ్య 8,64,862. రాశిరీత్యా చూసినట్లయితే పరిశోధనా రంగంలో చేరుతున్న వారి సంఖ్య మొత్తం పి.జి. విద్యార్థులతో పోల్చినట్లయితే అతి తక్కువ. ఉన్నత విద్యారంగంలో చోటుచేసుకున్న మరో కీలకమైన మార్పేమంటే 2000-01 నుండి 2005-06 మధ్యకాలంలో సాధారణ గ్రాడ్యుయేట్ విద్య దాదాపు స్తబ్ధతతోనున్నది. కాని ఇదే కాలంలో సాంకేతిక విద్య 2.7 రెట్లు పెరగడం గమనార్హం. 2005-06 సంవత్సరానికి మనదేశంలో 21.8 లక్షల మంది సాంకేతిక విద్యాసంస్థలలో చేరగా, సాధారణ విద్యలో 76.42 లక్షల మంది ప్రవేశించారు. దీనికి తోడు వివిధ డిప్లమోలలో విద్యనభ్యసిస్తున్న 6.9 లక్షల మందికి తోడుగా మరో 7.7 లక్షల మంది సార్వత్రిక విశ్వవిద్యాలయాలలో విద్యనభ్యసిస్తున్నారు. ఈ గణాంకాలు మనకు తెలియచెపుతున్నదేమంటే ఉన్నత విద్యారంగంలో పరిశోధనకు మరింత ప్రాధాన్యతనివ్వవలసి వుంది. సాంకేతిక విద్యారంగానికి సంబంధించి గణనీయమైన పురోగతి ఆహ్వానించ దగిన పరిణామమే అయినప్పటికి సామాజిక, మానవీయ శాస్త్రాలలో చోటుచేసుకుంటున్న స్తబ్ధత కొంతమేరకు ఆందోళన కరమైన పరిణామమే. అలాగే ఇటీవల సంవత్సరాలలో, కళాశాలలో చేరు తున్న సైన్స్ గ్రాడ్యుయేట్స్ సంఖ్య కూడా గణనీయంగా పడిపో యింది. సాంకేతిక విద్యారంగంతో పోల్చినపుడు వారి సంఖ్య చాలా తక్కువగా వుంది. ఇది ఆందోళనకర పరిణామం. ఉన్నత విద్యా రంగంలో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా వున్నప్పటికి ఉపాధ్యాయ శిక్షణా సంస్థలలో చేరుతున్న వారి సంఖ్య మొత్తం గ్రాడ్యుయేట్ విద్యాసంస్థలలో చేరుతున్నవారి సంఖ్యలో కేవలం రెండు శాతం మాత్రమే వుండడం అభిలషణీయంగా లేదు.

దేశ విద్యారంగంలో వివిధ సామాజికవర్గాల యొక్క స్థానం ఏమిటనేది కూడా కీలకమైన అంశం. 1999-2000 సంవత్సరంలో యన్.యస్.యస్. అంచనాల ప్రకారం, విద్యారంగంలో వివిధ స్థాయిలలో సామాజిక వర్గాల మధ్య వ్యత్యాసం చాలా హెచ్చుగా వుంది. ప్రాథమిక విద్యకు సంబంధించి ప్రభుత్వం ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేదు. ఉన్నత విద్యారంగంలో చేరుతున్న షెడ్యూలు కులాల విద్యార్థుల సంఖ్య 4.8%. షెడ్యూలు తెగలవారి సంఖ్య 5.2% మాత్రమే. వెనుకబడిన కులాల విద్యార్థుల సంఖ్యను తీసుకొన్నప్పటికి అది 6.3% దాటలేదు. ఉన్నత విద్యారంగంలో ప్రవేశిస్తున్న వెనుకబడిన తరగతుల విద్యార్థుల సంఖ్య కూడా

* ఆచార్యులు, శాస్త్రీయ సామ్యవాద అధ్యయన కేంద్రం
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

షెడ్యూలు కులాలు/తెగల విద్యార్థుల సంఖ్యకు కొద్ది తేడాలతో సమానంగానే వున్నది. అదే సమయంలో ఉన్నత విద్యారంగంలో అగ్రకుల విద్యార్థుల సంఖ్య 14.6%. అంటే వివిధ సామాజిక వర్గాల మధ్య ఉన్నత విద్యలో అసమానతలు అపారంగా పెరిగాయి.

మన దేశంలో వివిధ సామాజికవర్గాలు, అలానే విభిన్న మతాల మధ్య ఉన్నత విద్యారంగంలో వారి స్థానం పైన కూడా పలు అధ్యయనాలు జరిగాయి. గ్రామీణ భారతదేశంలో ఇరువది సంవత్సరాలు, ఆపైబడిన షెడ్యూలు కులాలు, తెగలు, ముస్లిం యువకులలో కేవలం ఒక్కశాతం కన్నా కొద్దిగా హెచ్చుగా మాత్రమే కళాశాల విద్యను పూర్తిచేశారు. మరోవైపున హిందూ అగ్రకులాలలో, గ్రామీణ ప్రాంతాలలో డిగ్రీ విద్యను పూర్తిచేసిన వారి సంఖ్య నాలుగు నుంచి అయిదు శాతం వరకు వున్నది. పట్టణ ప్రాంతాలలో ఈ వ్యత్యాసం మరింతగా పెరిగింది. ప్రత్యేకించి షెడ్యూలు కులాలు, తెగలు, వెనుకబడిన వర్గాలు, ముస్లిం జనాభాలో అగ్రకులాల కన్నా ఎంతో వెనుకబడివున్నారు. అగ్రకులాలు జనాభాలో 25 శాతం వరకు పట్టణ ప్రాంతాలలో డిగ్రీ విద్యను పూర్తి చేశారు. ముస్లింల ఎన్‌రోల్‌మెంట్ నిష్పత్తి 6.30%. హిందువులు శాతం 9%గా వుంది. అలానే ఉన్నత విద్యారంగంలో అసమానతలు గ్రామీణ పేదలు పట్టణ ప్రాంతాల లోని పేదలు కాని వారికి మధ్య అఘాతాన్ని సృష్టిస్తున్నాయి. గ్రామీణ పేదల జనరల్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో 1.3% కాగా, పట్టణ ప్రాంతాలలో పేదలు కాని వారి శాతం 27.15%గా వున్నది. అలాగే ఉన్నత విద్యారంగంలో జెండర్ అసమానతలు కూడా హెచ్చుగానే వున్నాయి. మనదేశ ఉన్నత విద్యారంగంలో వివిధ వర్గాల మధ్య ఈరకమైన అసమానతలు తమ ప్రత్యేకతలను కలిగివున్నాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య ఉన్నత విద్యా రంగంలోనున్న అసమానతలు ఏమాత్రం తక్కువ కావు. యన్.యస్.యస్. అందిస్తున్న గణాంకాల ప్రకారం 2004 సం.లో జి.ఇ.ఆర్. గ్రామీణ ప్రాంతాలలో 7% కాగా, పట్టణ ప్రాంతాలలో 27% వున్నది. ఈ గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్యనున్న అసమానతలను తగ్గించాలంటే గ్రామీణ ప్రాంతాలలో మరిన్ని కళాశాలలను, విశ్వవిద్యాలయాలను ప్రారంభించడం ద్వారా సమతుల్యతను కాపాడవలసివున్నది.

మన దేశంలో ఉన్నత విద్యారంగానికి సంబంధించి ఆ రంగంలోనున్న మహిళల అభిరుచులలో, ఆలోచనలలో పెక్కు మార్పులు చోటు చేసుకుంటున్నాయి. సహజంగా బోధనారంగం మహిళలు ప్రధాన వృత్తిగా వుండేది. 1950-51 నుండి 2002-03 సంవత్సరాల మధ్య బోధనారంగంలో మహిళల సంఖ్య 3.1% నుండి 1.8% పడిపోయింది. అలానే వైద్యరంగంలో కూడా వీరి శాతం 5.8% నుండి 3.6% పడిపోయింది. వాణిజ్య శాస్త్ర అధ్యయనంలో వారి అభిరుచి గణనీయంగా పెరిగింది. 1950-51 నుండి 2002-03 సంవత్సరాల మధ్య 0.4% నుండి 16.5% పెరగడం నూతన మలుపు. అలానే సాంకేతిక విద్యారంగంలో ఇదేకాలంలో ఒక్కశాతం కన్నా తక్కువగావున్న వీరు 4.2% పెరిగారు. అలానే న్యాయవిద్యలో వీరి శాతం 0.7% నుండి 1.7% పెరిగింది. ఉన్నత విద్యారంగంలో యువతీ యువకులిద్దరూ కూడా సైన్స్ విద్య నుంచి బయటకు వెళ్ళడం వెనుకగల కారణాలను అన్వేషించవలసి వున్నది.

మనదేశంలో ఉన్నత విద్యారంగంపై వ్యయం 1951 నుండి 1980 వరకు హెచ్చుగా నుండగా 1980 నుంచి 2004 మధ్యలో ఉన్నత విద్యపై వ్యయం తగ్గింది. ప్రణాళిక, ప్రణాళికేతర వ్యయం సాంవత్సరిక వృద్ధి రేటు మొదటిదశలో 17% కాగా రెండోదశలో అది 10% పడిపోయింది. అలానే రాష్ట్రాల ప్రణాళిక, ప్రణాళికేతర వ్యయం మొదటి దశలో 15% కాగా రెండోదశలో 11%గా వున్నవి. ఉన్నత విద్యపై కేంద్ర ప్రభుత్వ వ్యయం తగ్గుదల రాష్ట్ర ప్రభుత్వాల వ్యయం తగ్గుదలకన్నా హెచ్చుగా వున్నది. దేశంలో ఉన్నత విద్యపై చేసిన వ్యయాన్ని మన జి.డి.పి. వృద్ధిరేటుతో పోల్చి చూసినట్లయితే మొదటి దశలో మన జి.డి.పి. 3.35% వుండగా ఉన్నత విద్యపై హెచ్చు వ్యయాన్ని చేయగా రెండోదశలో జి.డి.పి. 5.42% పెరిగినపుడు ఉన్నత విద్యపై ప్రభుత్వ వ్యయం తగ్గింది. అందువలన రెండోదశను ఉన్నత విద్యపై ప్రభుత్వ వ్యయం తగ్గింపు దిశగా పరిగణించవలసివుంది. 1993-94 సం॥ నుంచి 2003-04 సం. మధ్య ఉన్నత విద్యలో ప్రతి విద్యార్థిపై ప్రభుత్వం చేస్తున్న వ్యయం 21% తగ్గింది. 2003లో ఐక్య ప్రగతిశీల కూటమి తన కనీస ఉమ్మడి కార్యక్రమంలో విద్యారంగానికి జి.డి.పి.లో ఆరుశాతాన్ని వెచ్చిస్తామని వాగ్దానం చేసింది. 2001-02లో జి.యన్.పి.లో నాలుగు శాతాన్ని విద్యా రంగంపై వెచ్చించింది. 2005లో 'కేబ్' (Central Advisory Board on Education) కమిటీలో కనీసం జి.యన్.పి.లో 6% అయినా విద్యారంగంపై వెచ్చించాలని చూచింది. 2008-09 సంవత్సరాలనాటికి 2,38,835 కోట్ల రూపాయలను వెచ్చించవలసి వుందని అంచనా వేసింది. 11వ పంచవర్ష ప్రణాళికలో ఇటీవల ప్రభుత్వం ఉన్నత విద్య, సాంకేతిక విద్య కొరకు 84,943 కోట్ల రూపాయలను కేటాయించింది. ఇది యు.పి.ఎ. నిర్దేశించుకున్న జి.యన్.పి.లో ఆరు శాతానికి సరిపోతుందా అనేది ప్రశ్నగానే మిగిలింది.

నాణ్యతతో కూడిన సార్వత్రిక ప్రాథమిక విద్య అందించాలనే లక్ష్యంతో సి.యం.పి. విద్యారంగానికి నిధుల సమీకరణ ద్వారా కేంద్ర పన్నులపై రెండు శాతం లెవీని విధించాలని ప్రతిపాదించగా యు.పి.ఎ. ప్రభుత్వం తన మొదటి బడ్జెట్‌లో లెవీని ప్రవేశపెట్టి 5000 కోట్ల రూపాయలను అదనంగా పొందాలనుకొన్నది. ఆ తదుపరి తన మూడవ బడ్జెట్‌లో ఉన్నత విద్యారంగానికి నిధులను సమకూర్చాలనే ఆలోచనతో మరో శాతం లెవీని అదనంగా కేంద్ర

పన్నులపై విధించింది.

పేదరికం కారణంగా ఎవరికీ వృత్తివిద్య దూరం కాకూడదని సి.యం.పి. కార్యక్రమంలో పేర్కొన్నారు. ఉన్నత విద్యారంగంలో పేద విద్యార్థులకు అవకాశం కల్పించబడాలని భావించారు. తదనుగుణంగా పేద విద్యార్థులకు బ్యాంకుల నుంచి రుణాల నందించే అవకాశం, అలాగే స్కాలర్‌షిప్‌లను అందచేయాలని భావించారు. 11వ పంచవర్ష ప్రణాళికలో మొత్తం విద్యార్థులలో రెండు శాతానికి స్కాలర్‌షిప్పుల నందించడానికి 1000 కోట్ల రూపాయలను కేటాయించారు. అలాగే వడ్డీరాయితీలతో కూడిన మరో 4000 కోట్ల రూపాయలను విద్యారుణాలుగా అందించేం దుకు కేటాయించారు. అంతేకాక మరో 2300 కోట్ల రూపాయలను పరిశోధనారంగంలో నున్న వారికి ప్రత్యేకించి జాతీయస్థాయిలో ప్రవేశపరీక్షలో ఉత్తీర్ణులయిన పరిశోధకులకు, అలానే పి.హెచ్.డి. ప్రవేశానికి అర్హత పొందిన పరిశోధకులకు స్కాలర్‌షిప్‌ల నందించ డానికి నిధులు కేటాయించబడ్డాయి.

మైనారిటీలకు, వెనుకబడిన కులాల విద్యార్థుల ప్రయోజనా లను కాపాడడానికి ప్రత్యేక కమిషన్లు వేయబడ్డాయి. సచార్ కమిటీ వివిధ సూచనలు చేసింది. అలానే రాజ్యాంగ 93 సవరణ ద్వారా వెనుకబడిన కులాలకు సంబంధించిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వ విద్యాసంస్థలలో 27% రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పించారు.

ప్రైవేటు వృత్తి విద్యా కళాశాలలలో ఫీజులు, అడ్మిషన్‌లకు సంబంధించి తీవ్రమైన భిన్నాభిప్రాయాలున్నాయి. కేంద్ర ప్రభుత్వం దీనికి సంబంధించి ఏరకమైన సానుకూల చర్యలను చేపట్టడం లేదు. న్యాయస్థానాలు మాత్రం ప్రైవేటు వృత్తి విద్యా కళాశాలలలో ఫీజులు అడ్మిషన్లకు సంబంధించి కొన్ని మార్గదర్శక సూత్రాలను సూచించింది. ప్రైవేటు విద్యా సంస్థ లనుసరిస్తున్న వాణిజ్యీకరణ విధానాలను నియంత్రించడం కష్టతరంగా వుంది. మన దేశంలో వున్న ప్రైవేటు విద్యా సంస్థలు విదేశీ విశ్వవిద్యాలయాలలో నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలను నియంత్రించడానికి ఏరకమైన చట్టాలు లేవు. మరోవైపున కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో నిమ్మకు నీరెత్తిన చందంగా వ్యవహరిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వాలు తెస్తున్న ప్రత్యేక చట్టాల ద్వారా ప్రైవేటు విశ్వవిద్యాలయాల సంఖ్య పెరుగుతూ వస్తున్నది. 2008 నాటికి మన దేశంలో 23 ప్రైవేటు విశ్వవిద్యాలయాలుండగా, వీటి సంఖ్య రాబోయే కాలంలో ఇబ్బడి ముబ్బడిగా పెరిగే అవకాశమున్నది. ప్రైవేటు విశ్వవిద్యాలయాల కార్యకలాపాలపై సరిపడినంత సమాచారం లేకపోగా మరోవైపున వారు యు.జి.సి. నియమ నిబంధనలను ధిక్కరిస్తున్నారు. విస్తృత ప్రజాభిప్రాయాన్ని కూడగట్టడం ద్వారా విద్యార్థి సంఘాలు చొరవ తీసుకొని ఈ ధోరణిని ప్రతిఘటించనట్లయితే భవిష్యత్‌లో ఉన్నత విద్యారంగం పెను సంక్షోభాన్నెదుర్కొనవలసి వస్తుంది. రెండోవైపున ప్రభుత్వం చొరవ తీసుకొని ప్రైవేటు విశ్వవిద్యాలయాలను నియంత్రించడం ద్వారా ఉన్నత విద్యారంగంలో వాణిజ్యీకరణ ధోరణులను అరికట్టడంతోబాటు నాణ్యతతో కూడిన విద్య నందిం చేందుకు అవసరమైన మార్గదర్శక సూత్రాలను రూపొందించి వాటిని కఠినంగా అమలుజరపవలసిన అవసరం ఎంతైనా వుంది. అందుకొరకు ఉన్నత విద్యారంగంలో వున్న అధ్యాపకులు, ఇతర మేధావులు తక్షణం స్పందించడం ద్వారా వారి జోక్యాన్ని మరింతగా పెంచుకోవాలి. ఉదాసీనత వలన ఉన్నత విద్యారంగ ప్రమాణాలు నిర్వీర్యం చేయబడి జాతి తాను నిర్దేశించుకున్న లక్ష్యాల నుండి వైదొలగవలసిన పరిస్థితులేర్పడతాయి. ఇందుకు విద్యార్థి, అధ్యాపక, మేధావి వర్గాల ఐక్య కార్యాచరణ మాత్రమే ఉన్నత విద్యారంగంలో ప్రబలుతున్న ఈ ధోరణులను అరికట్టగలుగుతుంది.

ఉన్నత విద్యారంగంపై జాతీయ నాలెడ్జి కమిషన్ నివేదిక ప్రభుత్వ యంత్రాంగంలోనే అసంతృప్తికి గురయినది. మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ నాలెడ్జి కమిషన్ ప్రతిపాదనలను వ్యతిరేకించింది. నాలెడ్జి కమిషన్ ప్రతిపాదించిన నయా ఉదారవాద విధానాల పర్యవసానంగా ఉన్నత విద్యపై ప్రభుత్వ నియంత్రణ కుదించబడనున్నది. ఉన్నత విద్య కొరకు స్వతంత్ర నియంత్ర ణాధికారం కలిగిన వ్యవస్థ వలన విద్యా సంస్థలకే డిగ్రీలను ప్రదానం చేసే అవకాశం ఇచ్చినట్లయితే ఉన్నత విద్యారంగంలో ప్రైవేటు రంగం విస్తరించడానికి అవధులుండవు. యు.జి.సి.ని కేవలం నిధులను సమకూర్చే స్థాయికి దిగజార్చాలనే జాతీయ నాలెడ్జి కమిషన్ ఆలోచన ఉన్నత విద్యారంగానికి క్షేమకరం కాదు. ఉన్నత విద్యారంగాన్ని మార్కెట్ శక్తుల దయాదాక్షిణ్యాలకు అప్పగించడం అత్యంత ప్రమాదకరం. ఉన్నత విద్యారంగంపై వెచ్చిస్తున్న నిధులు పరిమితంగా వున్నందున అది అందరికి అందు బాటులో లేకపోగా నాణ్యతా ప్రమాణాలు కూడా పడిపోతున్నాయి. అందువలన ఉన్నత విద్యలో ప్రమాణాల పెంపుకు అందరికి ఉన్నత విద్యావకాశాల కల్పనకు ప్రణాళికా వ్యయాన్ని జి.డి.పి.లో 1.5% పెంచవలసి వుంది.

11వ పంచవర్ష ప్రణాళికలో విద్యారంగానికి కేంద్ర ప్రభుత్వం వెచ్చిస్తున్న నిధులు 2,75,000 కోట్లు కాగా పదవ పంచవర్ష ప్రణాళికలో కేవలం 62,238 కోట్ల రూపాయలు మాత్రమే వెచ్చించింది. 11వ పంచవర్ష ప్రణాళికలో ఉన్నత, సాంకేతిక విద్యకు ప్రాధాన్యత కల్పించారు. 11వ పంచవర్ష ప్రణాళికలో ఉన్నత విద్యారంగానికి 84,943 కోట్లు కేటాయించబడగా పదవ పంచవర్ష ప్రణాళికలో కేటాయించబడింది 9,500 కోట్లు కాగా అందులో 8,000 కోట్ల రూపాయలు మాత్రమే ఖర్చు చేయబడింది. భారత ప్రధాని తన స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో దేశంలోని ప్రతి బ్లాకులో ఉన్నత ప్రమాణాలు కలిగిన పాఠశాలలను స్థాపిస్తా మని, వాటి సంఖ్య ఆరు వేల వరకు వుంటుందని ప్రకటించారు. అలానే

వివిధ జిల్లాలలో 370 కళాశాలలు, 1600 నూతన పారిశ్రామిక శిక్షణా సంస్థలను, పాలిటెక్నిక్ కళాశాలలను ప్రారంభిస్తామన్నారు. అదికాక మరో 10,000 ఒకేషనల్ పాఠశాలలను, 50,000 నైపుణ్యతను అభివృద్ధిచేసే కేంద్రాలను ప్రారంభిస్తామన్నారు. దేశంలో మరో 30 కేంద్ర విశ్వవిద్యాలయాల స్థాపనకు ప్రభుత్వం ప్రణాళికలను రూపొందిస్తున్నది. సైన్స్ విద్య, పరిశోధన కొరకు అయిదు విద్యా సంస్థలు, 8 ఐ.ఐ.టి. లను, 7 ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మానేజ్‌మెంట్ సంస్థలు, ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీకి సంబంధించి మరో 20 సంస్థలను స్థాపిస్తా మని వారి ప్రసంగంలో చెప్పారు. ప్రాంతీయ అసమానతల తగ్గింపుకు ప్రాధాన్యత, ఉన్నత విద్యా ప్రమాణాల పెంపుదల, ప్రతిభావంతమైన విద్యా సంస్థల అభివృద్ధికి ప్రాధాన్యతనివ్వాలని 11వ పంచవర్ష ప్రణాళికలో వ్యూహాన్ని రూపొందించుకొన్నారు.

గత రెండు మూడు దశాబ్దాలుగా ఉన్నత విద్యారంగంలో కొన్ని కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. ఉన్నత విద్యారంగంలో చోటుచేసుకున్న ప్రైవేటీకరణ విధానాల పర్యవసానంగా ప్రైవేటు వృత్తి విద్యా కళాశాలలు పెరగడం, అలానే డీమ్డ్, ప్రైవేటు విశ్వవిద్యాలయాల సంఖ్య క్రమేపీ పెరిగింది. గుర్తింపు లేని కొన్ని ప్రైవేటు విద్యా సంస్థలు విదేశీ విశ్వవిద్యాలయాలతో సంబంధ బాంధవ్యాలను కలిగి వున్నాయి. మన ఉన్నత విద్యారంగంలోకి ప్రైవేటు విదేశీ పెట్టుబడుల రాక చోటుచేసుకుంటున్నది. నూరు శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు మన ఉన్నత విద్యారంగంలో ఇప్పటికే అనుమతించబడ్డాయి. ప్రధానంగా ఈ విద్యా సంస్థలలో అధిక మొత్తంలో ఫీజుల వసూళ్ళు వలన ఉన్నత విద్యారంగం వాణిజ్యీకరణకు దారితీసింది. పెక్కు ప్రైవేటు విద్యా సంస్థలలో నాణ్యతా ప్రమాణాలు ప్రశ్నార్థకం అయ్యాయి. ప్రైవేటు విద్యా సంస్థలు ఉపాధి అవకాశాల పేరుతొ ప్రారంభించిన కోర్సులు జాబ్ మార్కెట్‌కు అవసరమైన మానవ వనరులను మాత్రమే సరఫరా చేసే స్థితిలో వున్నాయి. ఉన్నత విద్యారంగంలో విదేశీ ప్రైవేటు పెట్టుబడులు పలు విపత్కర పరిణామాలకు దారితీయనున్నాయి.

ప్రభుత్వ చట్టాల ద్వారా ప్రైవేటు విశ్వవిద్యాలయాల స్థాపనకు అంగీకరించడం మరొక నూతన మలుపు. ప్రైవేటు విశ్వవిద్యాలయాలను అదుపులో వుంచడానికి ప్రభుత్వాలకు ఏ విధమైన యంత్రాంగం లేదు. ఉన్నత విద్యారంగంలో ప్రమాణాలను కాపాడవలసిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే. అందువలన ప్రైవేటు విశ్వవిద్యాలయాల స్థాపనకు సంబంధించి యు.జి.సి. నిర్ణయాత్మక పాత్రను కలిగి వుండాలి. 'నాక్' లాంటి సంస్థల ద్వారా ఉన్నత విద్యారంగంలో నాణ్యతా ప్రమాణాలు కాపాడుకోబడాలి. ప్రైవేటు విశ్వవిద్యాలయాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం కొన్ని మార్గదర్శక సూత్రాలను ఏర్పాటుచేయాలి. వాటిని రాష్ట్ర ప్రభుత్వాలు విధిగా అమలుజరపాలి. ఈ మార్గదర్శక సూత్రాలు ప్రధానంగా ఉన్నత విద్యారంగంలో వాణిజ్యీకరణను నియంత్రించడం, నాణ్యతా ప్రమాణాలను పాటించడం లాంటి అంశాలపై దృష్టిని కేంద్రీకరించాలి. యు.జి.సి., ప్రైవేటు డీమ్డ్ విశ్వవిద్యాలయాలపై కూడా సరైన నియంత్రణను కలిగి లేదు.

ఉన్నత విద్యారంగంలో ప్రైవేటీకరణ, వాణిజ్యీకరణ ధోరణులు పర్యవసానంగా ఈ రంగంలో అనేక ప్రతికూల పరిణామాలు చోటుచేసుకొంటున్నాయి. ప్రణాళికాబద్ధత లేనందున ఉన్నత విద్యనభ్యసిస్తున్న విద్యార్థినీ విద్యార్థులు పలు ఆటుపోట్లకు గురవుతున్నారు. దేశంలో ప్రతి సంవత్సరం ఆరు లక్షల ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు తయారవుతుండగా వారిలో కేవలం ఒక లక్షమంది మాత్రమే క్యాంపస్ ఇంటర్వ్యూలలో ఉద్యోగాలను పొందుతున్నారు. మరో 2 లక్షల యాభై వేలమంది కొంతకాలం గడచిన తరువాత మాత్రమే ఉద్యోగ అవకాశాలను పొందుతున్నారు. మిగిలిన వారు నిరుద్యోగులుగా మిగులుతున్నారు. లేదా తమ విద్యతో నిమిత్తంలేని ఇతర ఉద్యోగాలను చేస్తున్నారు. పుట్టగొడుగుల్లా పెరుగుతున్న ప్రైవేటు వృత్తి విద్యా కళాశాలలు నాణ్యతా ప్రమాణాలను పాటించనందువలన కూడా ఈ పరిస్థితి ఉత్పన్నం అవుతున్నది. నాణ్యతా ప్రమాణాలను పాటించడంలో ప్రభుత్వ, ఎయిడెడ్ విద్యా సంస్థలు మినహాయింపేమీ కాదు. మన దేశంలోని మొత్తం విశ్వవిద్యాలయాలలో 1/3 వంతు, కళాశాలలలో కేవలం 10% మాత్రమే నాణ్యతతో కూడిన విద్య నందిస్తున్నాయని గణాంకాలు తెలియజేస్తున్నాయి.

ఉన్నత విద్యలో ప్రతిభా పాటవాలు కలిగిన వారు బోధనా రంగంలోకి ఆకర్షింపబడడం లేదు. వారిలో హెచ్చుమంది విదేశాలకు తరలి వెళుతున్నారు. లేదా పారిశ్రామిక రంగంవైపు మరలుతున్నారు. ప్రపంచీకరణ పర్యవసానంగా ప్రభుత్వ ప్రైవేటు రంగాల వేతనాలలో భారీ వ్యత్యాసం వున్నందున విశ్వవిద్యాల యాలు, కళాశాలలలో వేతనాలు ఆకర్షణీయంగా లేనందున ప్రతిభ కలిగిన వారెవరూ ఉన్నత విద్యారంగంవైపు ఆకర్షింపబడడం లేదు. పర్యవసానంగా ప్రతిభ కలిగిన అధ్యాపకుల సంఖ్య ఉన్నత విద్యారంగంలో క్రమేపీ క్షీణిస్తున్నది. అంతేకాక సుదీర్ఘ కాలం అంకితభావంతో పనిచేసినప్పటికీ ఉన్నత విద్యారంగంలో వున్న అధ్యాపకులకు పదోన్నతి మరి ఇతర సౌకర్యాలు పరిమితంగా వుండడం కూడా ప్రతిభ కలిగిన వారు ఈ రంగంవైపు రాకపోవడానికి మరో కారణంగా చెప్పవచ్చు.

మన దేశంలో ఉన్నత విద్యకు డిమాండ్ పెరుగుతున్నది. దీనికి కొన్ని ప్రధాన కారణాలున్నాయి. అవి పెద్ద సంఖ్యలో పాఠశాల విద్యను పూర్తిచేసిన వారుండడం. మన దేశంలో నిరంతరంగా పెరుగుతున్న మధ్యతరగతి జనాభా. వ్యవసాయంపై ఆధారపడిన ఆర్థిక వ్యవస్థ క్రమేపీ క్షీణించడం. ఉన్నత విద్య ఆర్థికాభివృద్ధికి. జీవనోపాధుల పరిరక్షణకు ఉపయోగ పడనున్నదనే భావన కలిగి

వుండడం వలన ఉన్నత విద్యకు డిమాండ్ పెరుగుతూ వచ్చింది. కాని ఉన్నత విద్యారంగంపై ప్రభుత్వం సరిపడినంత నిధులను వెచ్చించనందున ఉన్నత విద్యాభ్యాసం చేయాలనే అభిలాష కలిగిన విద్యార్థినీ విద్యార్థులకు ప్రవేశం లభించడం కష్టంగా వుంది. లభ్యమవుతున్న సీట్లకు, పోటీపడుతున్న విద్యార్థుల నిష్పత్తి గమనించినట్లయితే ఆ సంక్లిష్టత మనకు అర్థం అవుతున్నది. మన దేశంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ తీసికొన్నట్లయితే ప్రతి ఒక్క సీటుకు 55 మంది పోటీపడుతున్నారు. ఢిల్లీ విశ్వ విద్యాలయం లాంటిచోట్ల 90% మార్కులు పొందిన విద్యార్థినీ విద్యార్థులకు కూడా సీటు లభ్యం అవడం లేదు. మరోవైపున పెద్ద సంఖ్యలో విద్యార్థినీ విద్యార్థులు ఉన్నత విద్య కొరకు విదేశీ విశ్వవిద్యాలయాల కెళుతున్నారు. 2001లో అమెరికాకు వెళ్ళిన వారి సంఖ్య 47,401 కాగా 2002-2003 నాటికి వారి సంఖ్య 74,603 పెరిగింది. ప్రతి సంవత్సరం మన దేశం నుంచి లక్షమంది విద్యార్థినీ విద్యార్థులు ఉన్నత విద్యాభ్యాసం కొరకు విదేశాలకు వెళుతున్నారు.

ఉన్నత విద్యలో గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో మన దేశంలో 9% వుండగా, చైనాలో 15%, బ్రెజిల్, మెక్సికో, చిలీ, మలేషియాలలో 20% పైగా వుంది. అభివృద్ధిచెందిన దేశాలలో అది 40% నుండి 50% వరకు వున్నది.

మన దేశంలో ఉన్నత విద్యకు పెరుగుతున్న డిమాండ్‌కు తగ్గట్లుగా అవకాశాలు లభించడం లేదు. ప్రభుత్వాలు అనేక కుంటిసాకులు చెప్పడం ద్వారా క్రమేపీ ఉన్నత విద్యారంగం నుంచి తప్పుకొంటున్నారు. 11వ పంచవర్ష ప్రణాళికలో కొంత మేరకు నిధులను ఉన్నత విద్యారంగానికి కేటాయించినప్పటికీ అవి ఉన్నత విద్యారంగ అవసరాలను తీర్చగలిగేవిగా లేవు. నయా - ఉదారవాద ఆర్థిక విధానాల ఆలోచనల ప్రభావం ఉన్నత విద్యా రంగంపై వుండడం ఏమాత్రం అభిలషణీయం కాదు. ✳

మార్క్స్ విశ్వాసాలు (1865)

మీ కతి ప్రియమైన సద్గుణం	:	నిరాడంబరత
పురుషులలో మీ కతి ప్రియమైన సద్గుణం	:	సశక్తత
స్త్రీలలో మీ కతి ప్రియమైన సద్గుణం	:	అశక్తత
మీలో ప్రధాన లక్షణం	:	ఏకాగ్రత
సౌఖ్యమనగా మీ భావం	:	పోరాడటం
దౌర్భాగ్య స్థితి అనగా మీ భావం	:	లొంగుబాటు
మీ రన్నిటికంటే ఎక్కువగా క్షమించే దుర్గుణం	:	వంచింపబడటం
మీ రన్నిటికంటే అసహ్యించుకునే దుర్గుణం	:	దాసత్వం
ఎవరంటే మీ కతి చీదర?	:	మార్టిన్ టప్పర్ *
మీ కతి ప్రియమైన వృత్తి	:	గ్రంథ భక్షణ
మీ కతి ప్రియమైన కవి	:	షేక్స్పియర్, ఎచిలస్, గెథె *
మీ కతి ప్రియమైన గద్య రచయిత	:	డిడెరో *
మీ కతి ప్రియమైన నాయకుడు :	:	స్పార్టకస్, కెప్లర్ *
మీ కతి ప్రియమైన నాయకురాలు	:	గ్రెషెన్ *
మీ కతి ప్రియమైన పుష్పం	:	డఫ్నె
మీ కతి ప్రియమైన రంగు	:	ఎరుపు
మీ కతి ప్రియమైన పేరు	:	లారా జెన్నీ *
మీ కతి ప్రియమైన వంటకం	:	చేప
మీ కతి ప్రియమైన సూక్తి	:	మానవ లక్షణం గలదేదీ విజాతీయం కాదు.
మీ కతి ప్రియమైన మూలసూత్రం	:	ప్రతి వ్యక్తీ ప్రతిదాన్నీ శంకించాలి.

సృష్టివాదాన్ని నిలదీసిన డార్విన్

డా॥ సోమసుందర్ మర్ల *

విశ్వం భగవంతుని సృష్టి అని, ప్రకృతిలోని అన్ని జీవుల్లోకెల్లా మనిషి అత్యున్నతుడని హిందూ, క్రైస్తవ, ఇస్లాములు ప్రబోధిస్తాయి. చార్వాకులు, గెలీలియో, కోపర్నికస్‌లతో ప్రారంభమయిన వాగ్వాదాలు మతంతో నేటికీ కొనసాగుతూనే వున్నాయి. సరిగ్గా 150 సం॥ల క్రితం చార్లెస్ డార్విన్ ప్రతిపాదించిన "జీవుల పరిణామ సిద్ధాంతం" అనేక సాక్ష్యాలతో ఈ మత విశ్వాసాలను నిలదీసింది. ప్రకృతిలో ప్రాణం (Life) ఎలా ప్రారంభమయింది. పురాతన సముద్రపు లోతుల్లో సంభవించిన వివిధ భౌతిక, రసాయన ప్రక్రియలు ప్రాణం ప్రారంభమవటానికి ఏవిధంగా తోడ్పడి వుండవచ్చు, తద్వారా జనించిన జీవులు (మొక్కలు, జంతువులు వగైరా) కాలక్రమేణా పలు రకాల జీవులుగా ఎలా రూపాంతరం చెందాయో తను ప్రచురించిన "జీవుల పుట్టుక" (Origin of Species) అనే గ్రంథంలో సవివరంగా పేర్కొన్నాడు డార్విన్.

మనిషిని భగవంతుడు సర్వజీవుల కంటే అత్యున్నతుడిగా సృష్టింపబడలేదని, అతడు ఇతర జంతువుల వంటివాడేనని, తన ఉనికికి మేలు చేసే శారీరక మార్పులను చేజిక్కించుకుంటూ నేటి స్థాయికి ఎలా చేరుకున్నాడో మరొక గ్రంథం "మానవుని పుట్టుక" (The Descent of man)లో సవివరంగా వివరిస్తాడు. డార్విన్ ప్రతిపాదించిన సిద్ధాంతం ఆనాటి లండన్‌లో (150 సం॥ క్రితం) తీవ్రస్థాయి శాస్త్రీయ చర్చలకు, నిరూపణకు జరిపిన అనేక పరిశోధనలు చివరకు నేటి బయోటెక్నాలజీ, నూతన మొక్కల, ఔషధాల ఆవిష్కరణకు కారణమైందనటంలో అతిశయోక్తి లేదు.

19వ దశాబ్దపు మధ్యనాటికి విశ్వం పుట్టుక, జీవ ప్రారంభం (Origin of Life), జీవుల పరిణామంపై చర్చలు ఊపందుకొన్నాయి. అదే సమయంలో జిన్ లామార్క్ అనే ప్రసిద్ధ శాస్త్రవేత్త "మేలైన జీవులదే స్థానం" (Survival of the fittest) అనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. అడవుల్లో ఎత్తయిన చెట్లపై మేతను అందుకునేం దుకు జిరాఫీల మెడ పొడవుగా ఎలా రూపాంతరం చెందిందో లామార్క్ వివరిస్తాడు. వివిధ వృక్ష, జంతు సంపదతో క్లిష్టమైన ప్రకృతి రూపాంతరం చెందినది కాజాలదని, కేవలం భగవంతుని తెలివైన సృష్టి (Intelligent design)తోనే ఇది సాధ్యమనే బలమైన థార్మిక వాదనలను లామార్క్, ఆల్ఫ్రెడ్ రస్సెల్, ఓవెన్ వంటి ఆనాటి ప్రముఖ శాస్త్రవేత్తలు ఎదుర్కొనలేకపోయారు.

సరిగ్గా ఆ సమయంలో డార్విన్ జంతువులు, మొక్కలు ఒక జాతి నుండి మరొక జాతికి ఎలా రూపాంతరం చెందుతాయో వివరించే ప్రక్రియ అయిన "ప్రాకృతిక ఎంపిక" (Natural Selection) ను తగు సాక్ష్యాలతో ప్రతిపాదించాడు.

14 నుండి 18వ శతాబ్దం వరకు ఐరోపా దేశస్తులు సుదీర్ఘ సముద్ర యానాలు చేసి కొత్త దేశాలను, ఖండాలను కనుగొన్నారు. ఈ కొత్త ప్రాంతాలలో ప్రజలను ఓడించి వలసలను ఏర్పరచుకుని, సంపదను కొల్లగొట్టి ఇంగ్లాండు, ఫ్రాన్స్, జర్మనీ, డచ్, పోర్చుగీసులకు తెచ్చి వివిధ పరిశ్రమలను స్థాపించారు. నూతన పరిశ్రమల స్థాపనకు, అధిక వస్తూత్పత్తికి, వర్తక, వాణిజ్యాలకు మేలైన ఉత్పత్తి శక్తులు అవసరమయ్యాయి. వీటికై శాస్త్ర పరిశోధనలు విరివిగా ప్రారంభమయ్యాయి. 1831వ సం॥లో నౌకా దళపు హెచ్.ఎం.ఎస్. బీగిల్ అనే నౌకలో భూగర్భ శాస్త్రవేత్తల, ప్రకృతి శాస్త్రవేత్తల బృందం పయనమయింది. అప్పుడే విశ్వవిద్యాలయ విద్య పూర్తిచేసిన చార్లెస్ డార్విన్ ఈ బృందంలో చేరాడు. 1831-36 సం॥ల మధ్య ఈ నౌక ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలను, కొత్త కొత్త ద్వీపాలను సందర్శించింది. ప్రస్తుత ఆస్ట్రేలియాకు సమీపంలోని "గెలాపిగో" ద్వీపంలో డార్విన్ వివిధ పక్షి, జంతు జాతుల వైవిధ్యంపై జరిపిన పరిశోధనలు, సేకరించిన నమూనాలు, పెన్సిల్ చిత్రాలు (నేటికి కేంబ్రిడ్జి, బ్రిటిష్ మ్యూజియంలలో చాలావరకు భద్రపరచి వున్నాయి) అమూల్యమైనవి. నేను గత వేసవిలో బ్రిటిషు శాస్త్రవేత్తలతో పరిశోధనా చర్చలకై వెళ్ళినప్పుడు, ఒక రోజు వీలు చూసుకొని బ్రిటిషు మ్యూజియం సందర్శించాను. ప్రపంచంలోని వివిధ వృక్ష, పక్షి, జంతు సంపద నమూనాల ప్రదర్శనకే నాలుగయిదు హాళ్ళు ప్రత్యేకించబడ్డాయి. వాటిలో డార్విన్ సేకరించిన నమూనాలు కూడా వున్నాయి. ఉదాహరణకు దున్నపోతు సైజులో వుండే పూర్వపు ఎలుక జాతి జంతు కళేబరం, నాలుగు మీటర్ల పొడవుండే బల్లి జాతి జంతువులు, వివిధ రకాల పక్షులు, మొక్కల నమూనాలు సంభ్రమాశ్చర్యాలను కలిగిస్తాయి.

గెలపిగో ద్వీపంలోని పక్షులను, తాబేళ్ళను పరిసర ద్వీపాల్లో జాతులతో పోల్చి, విపత్కర పరిస్థితుల్లో బ్రతకటానికి వాటి శరీర భాగాలు ఎలా మార్పు చెందాయో (ఈనాడు వాటిని మనం జన్యు మ్యూటేషన్స్‌గా పిలుస్తున్నాము), లాభసాటి మార్పులను తమ సంతతికి చేరవేస్తూ కొత్త జంతువులుగా ఎలా పరిణామం చెందాయో వివరిస్తాడు డార్విన్. ఈ ప్రక్రియను "మేలైన ఎంపిక" (Natural Selection)గా పేర్కొంటూ, ఈ లాభసాటి మార్పులను గైకొన్న జంతు, వృక్ష జాతులు, జనాభా (Population)లో ఈ

* గోవింద వల్లభ్ పంత్ కేంద్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పంత్‌నగర్


మార్పులకు లోనవలేని జంతుజాతులపై ఆధిక్యతను ఎలా ప్రదర్శిస్తాయో వివరిస్తాడు. అన్ని సూక్ష్మజీవుల, వృక్ష, జంతు జాతులకు మూలం ఒకటేనని, మిలియన్ల సంవత్సరాల పయనంలో వైవిధ్యంతో కూడిన వివిధ జాతులుగా ఎలా రూపాంతరం చెందాయో "జీవన వృక్షం" (Tree of Life) సహాయంతో వివరిస్తాడు డార్విన్ (Comman descent yet variable). ఉదాహరణకు సరళమైన బాక్టీరియాలోను, మొక్కలలోను, జంతు కణాల్లోని డి.ఎన్.ఏ. జన్యు నిర్మాణం, పిండి పదార్థాలను ఛేదించి శక్తి పరమాణువులైన ఎ.టి.పీల తయారీ, వివిధ జంతువుల గర్భంలోని పిండం పెరుగుదలలోని పోలికలు ఈ ఏకత్వాన్ని ప్రతిబింబిస్తాయి. కాగా నేడు వినియోగించే ఏంటీబయాటిక్ ఔషధాలు వివిధ రోగాలకు కారకమయిన రకరకాల సూక్ష్మజీవుల్లో ఉమ్మడిగా వున్న కణపు క్రియలను నిరోధించటానికి ఉపయోగ పడుతున్నాయి. అదే విధంగా వివిధ జాతుల మధ్య వైవిధ్యం అనేకం. ఉదాహరణకు వివిధ వరి రకాలను, పొలాల్లోను, డి.ఎన్.ఏ. స్థాయిలోను పోల్చి, కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ సహాయంతో పరిశోధించి (ఫైలోజెనిట్ ట్రీలు నిర్మించి) నేటి శాస్త్రవేత్తలు సహజ తెగుళ్ళ నిరోధక శక్తి కలిగిన వంగడాలను సృష్టించగలుగుతున్నారు. క్లిష్టమైన వైవిధ్యం ఉన్నా ప్రకృతిలో శత్రువుల నుండి ప్రమాదాలు ఎదురయ్యే సమయంలో అడవిలోని జంతువులన్నీ కలిసికట్టుగా ఎలా ప్రవర్తిస్తాయన్నది గతితార్కిక వాదనకు ప్రతీక.

డార్విన్ 1865వ సం॥లో ప్రచురించిన "మానవుని పుట్టుక"కు (The Descent of Man) అనే గ్రంథంలో పూర్వపు నాలుగు కాళ్ళ జంతువుల నుండి నేటి మానవుడు ఎలా రూపాం తరం చెందాడో పేర్కొంటాడు. నేటికీ మన శరీరంలో వున్న అపెండిసైటిస్, చర్మంపై వెంట్రుకలు, గోళ్ళు కోతిలోని తోకకు, ఇతర శరీర భాగాల అవశేషాలే కారల్ మార్క్స్, డార్విన్ సమకాలీనులు కావటంతో వీరిమధ్య చర్చలు, ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగేవి. డార్విన్‌కు వ్రాసిన ఒక లేఖలో మార్క్స్ వైవిధ్యం కలిగిన ప్రకృతిలో వివిధ జంతు జాతులు తమ ఉనికికి ఎలా సహకరించు కొంటాయో "ఐక్యత పోరాటం (Unity and Struggle)తో తనదైన గతితార్కిక శైలిలో వివరిస్తాడు. మరొక తత్వవేత్త ఏంగెల్స్ వ్రాసిన "వానరం నుండి నరుని పరిణామం" (Transformation of Ape to Man), యాంటీడ్యూరింగ్ అనే గ్రంథాన్ని పేర్కొనక తప్పదు.

దేవుని సృష్టిలో మనిషి స్థానం అత్యున్నతమని వాదించే ధార్మిక సిద్ధాంత పునాదులను డార్విన్ ప్రతిపాదించిన మానవ పరిణామ సిద్ధాంతం కుదిపివేసింది.

డార్విన్ సిద్ధాంతాలు మౌలిక ప్రశ్నలకు సమాధానాన్నిచ్చి సైన్సు పరిశోధనల దిశను, గమ్యాన్ని మార్చివేసినా, నేటికీ కొందరు ఈ సిద్ధాంతాలను వక్రీకరించడం చూస్తూనే వున్నాము. మానవజాతిలో వైవిధ్యం ఉన్నది కాబట్టే వివిధ జాతులు, కులాల మధ్య భేదాలు సహజమని, ఆర్థికంగా వనరులున్నవారు అవి లేని కష్టజీవులను దోచుకోవటం (లైసెన్స్ ఫర్ క్యాపిటలిజం) డార్విన్ ప్రతిపాదించిన "మేలైనవారికే బ్రతికే హక్కు" (Survival of the Fittest) సూత్రాన్ని సమర్థించేవారు తక్కువేమీ కాదు. 1950వ దశకంలో డి.ఎన్.ఏ. నిర్మాణాన్ని కనుగొన్న వాట్సన్ (Watson) అనే సుప్రసిద్ధ శాస్త్రవేత్త సైతం జాతుల మధ్య అంతరాలున్నాయి కాబట్టే నల్లజాతి వారు తగినంత సమర్థతతో పనిచేయలేకపోతున్నారని ప్రకటించి గత సంవత్సరం సంచలనం సృష్టించాడు. కాగా మనుషుల మధ్య అంతరాలు వైవిధ్యాన్ని ప్రతిబింబిస్తాయి తప్ప, ఒకొక్క సమర్థత విషయంలో ప్రతి రేస్‌కు తమవైన ప్రత్యేక లక్షణాలుంటాయని, వీరందరి కలయికే మానవజాతి అభివృద్ధికి కారణం అని చెబుతూ డార్విన్ ఈ కుహనా వక్రీకరణలను తిప్పికొట్టాడు. ప్రస్తుతం మనిషి జీనోమ్ (Human Genome)లోని అన్ని జన్యువులు విశ్లేషింపబడ్డాయి. డయాబెటిస్‌కు, మనిషి ఎత్తుకు ఎన్ని జన్యువులు కారణం, వాటి లక్షణాలు పరిశోధించబడ్డాయి. ప్రస్తుతం అమెరికాలో కొన్ని లక్షల డాలర్ల ఖర్చుతో వివిధ జాతుల, వ్యక్తుల నుండి సేకరించిన మేలైన జన్యువులను ప్రోగుచేసి "డిజైనర్ బేబీ"లను తయారుచేయ గల్గుతున్నారంటే ఈ వాదనలలోని వక్రీకరణలను అర్థం చేసుకోవచ్చును.

*


Tree of Life

మార్క్సిజం : శాస్త్రమా లేక విప్లవమా?

లూషియో కొలెట్టి *

మార్క్సిజం శాస్త్రమా లేక విప్లవమా అన్న మీమాంస (ప్రత్యామ్నాయం) నేటిదికాదు. దీన్ని పరిష్కరించడం అనుకొన్నంత సులభం కాదు. మార్క్సిజం ఒక శాస్త్రమా అన్న మొదటి పార్శ్వంతో చర్చను ప్రారంభిద్దాం. ఈ వాదపు స్థూల చిత్రణను ఈ క్రింది విధంగా చెప్పవచ్చు. మానవ సమాజ నియమాల సిద్ధాంతం మార్క్సిజం. మార్క్స్ తన 'పెట్టుబడి' గ్రంథంలో పెట్టుబడిదారీ ఉత్పత్తి అభివృద్ధిని నియంత్రించే నియమాలను అధ్యయనం చేసి, విశ్లేషణ చేశాడు. పెట్టుబడిదారీ యంత్రాంగాన్ని మార్క్స్ ఛేదించి వర్ణించాడు. ఒక శాస్త్రీయ సిద్ధాంతంగా మార్క్సిజం - ప్రధానంగా వస్తుగత కార్యాచరణ సంబంధాలను ఆవిష్కరించింది. వ్యవస్థను నడిపే నియమాలను, దానిని అంతర్గతంగా బలహీన పరచి ఆ వ్యవస్థ భవిష్యత్తును నిర్దేశించే వైరుధ్యాలను మార్క్సిజం కనుగొని, విశ్లేషణ చేస్తుంది. భావజాలపు (Ideology) పార్శ్వాన్ని పక్కకుపెట్టి, శాస్త్రీయ పార్శ్వాన్ని మాత్రమే పరిగణనలోనికి తీసుకున్న మేరకు విలువలకు సంబంధించిన తీర్పులను గాని లేక స్వీయ మానసిక ఇష్టాలకు గాని 'పెట్టుబడి' గ్రంథం విశ్లేషణలో స్థానం కల్పించబడలేదు. దీనికి బదులు వాస్తవానికి సంబంధించిన తీర్పులను, వస్తుగత తీర్పులను మాత్రమే 'పెట్టుబడి' గ్రంథంలో ఇవ్వడం జరిగింది. అంతిమ విశ్లేషణలో సార్వత్రికంగా నిలిచే తీర్పులను స్థిరపరచింది. శాస్త్రీయ ప్రతిపాదనలు సూచన దిశగా వుంటాయి. 'ఇష్టాలను' గాని లేక అంతిమ నిర్ణయాలను గాని ఇవి ముందుకు తీసుకురావు. వస్తుగతమైన, నిష్పాక్షికమైన శాస్త్రీయ ప్రకటనల నుండి విధాయకమైన (imperatives) సూత్రాలను రాబట్టడం అసాధ్యం. 'ఫైనాన్స్ కాపిటల్' పుస్తకానికి రాసిన ముందుమాటలో హిల్ఫర్డింగ్ ఈ వాదాన్ని అభివృద్ధి చేశాడు. (ఇది దాదాపు ద్వితీయ ఇంటర్నేషన్‌కు చెందిన సాంప్రదాయ మార్క్సిజం అభివృద్ధి చేసిన వాదమే) సమాజాభివృద్ధి నియమాలను వివరించే సిద్ధాంతమే మార్క్సిజం. మార్క్సిస్టు చారిత్రక దృక్పథంలో ఈ నియమాలను మార్క్సిస్టు అర్థశాస్త్రం ప్రతిపాదించబడిన సరకు ఉత్పత్తి దశకు అన్వయించింది. వస్తుగత స్వభావం కలిగిన శాస్త్రీయ తర్కబద్ధత, మార్క్సిజం విలువలకు సంబంధించిన తీర్పులకు కట్టుబడదు. శాస్త్రంగా మార్క్సిజం లక్ష్య మేమంటే "కార్యాచరణ సంబంధాలను వివరించండం. సోషలిజం, మార్క్సిజం ఒకటే అని నిరంతరం గందరగోళపరచబడుతున్నప్పటికీ, నిజానికి అవి రెండు ఒకటి కాదు.

సోషలిజం ఒక లక్ష్యం, గమ్యం. ఇది రాజకీయ సంకల్పం, కార్యాచరణ ఆశయం. మరోపక్క మార్క్సిజం ఒక శాస్త్రంగా వస్తుగతమైన నిష్పాక్షిక జ్ఞానం. లక్ష్యాన్ని అంగీకరించకుండా శాస్త్రాన్ని ఒప్పుకోవడం సాధ్యమే. "మార్క్సిజం విలువను గుర్తించడమంటే విలువలకు సంబంధించిన తీర్పులను ఇవ్వడమనో, కార్యాచరణ మార్గాలను చూపించడమో కానేకాదు. ఆవశ్యకతను గుర్తించడం ఒక యెత్తు. ఆ ఆవశ్యకతను పూర్తి చేయడానికి పూనుకోవడం మరొక యెత్తని" హిల్ఫర్టింగ్ చెప్పాడు.

ఈ అభిప్రాయం ప్రకారం శాస్త్రానికి, వర్గ చైతన్యానికి; శాస్త్రానికి, భావజాలానికి మధ్య ఎలాంటి సంబంధానికి తావులేదు. అలాంటప్పుడు శాస్త్రానికి పక్షపాతం వుందనే సమస్య తలెత్తలేదు. సామాజిక - ఆర్థికాభివృద్ధి క్రమాన్ని నక్షత్ర చలనంతో పోల్చదగినదిగా భావించారు. ఆర్థిక నియమాలు వస్తుగతమైనవి. ప్రకృతి నియమాల మాదిరి ఆర్థిక నియమాలు వర్గాలతోను, సంకల్పంతోను నిమిత్తం లేకుండా స్వతంత్రంగా పనిచేస్తాయి (స్టాలిన్ రాసిన "సోవియట్ యూనియన్‌లోని సోషలిజం. ఆర్థిక సమస్యలు" చూడండి). గురుత్వాకర్షణ నియమం లాంటిదే 'విలువ నియమం'. ఈ సిద్ధాంతంలో ఒక విధమైన 'విచ్ఛేదన వాదాన్ని' (Theory of Break Down) పొందుపరచారు. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికి సంబంధించిన నియమాలు తప్పనిసరిగా ఆ వ్యవస్థ పతనానికి దారితీస్తాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ అంతరించడం అనివార్యం. పెట్టుబడిదారీ వ్యవస్థ నియమాలను వివరించడం ద్వారా దాని పతనం గుడ్డిగా, దాదాపు దానంతట అదే జరుగుతుందని చెప్పారు. స్వల్ప తేడాలు తప్పించి మూడవ ఇంటర్నేషనల్ కాలంలో కూడా మార్క్సిజానికి సంబంధించి ఈ అభిప్రాయమే వుంది. ఈ అభిప్రాయానికి, స్టాలిన్ హయాంలో 'పక్షపాత' ప్రాతిపదికను జతచేశారు. (అయితే ఈ 'పాక్షికత' లెనిన్‌లో అప్పటికే గుప్తంగా వుంది.) ఈ అభిప్రాయాన్ని గుడ్డిగాను, మొరటుగాను ప్రతిపాదించిన తీరును అలా వుంచితే, స్వభావిక వస్తుగత వాదానికి (Naturalistic Objectivism) పాక్షికత అనే ప్రాతిపదిక జతచేశారు. వీటి మధ్య సంశ్లేషణకు ప్రయత్నం జరగలేదు.

అనేక సున్నితమైన పద్ధతులలో ఈ 'భౌతికవాద' (Physicalist) వైఖరి ఇప్పటికి తరువాత తరానికి చెందిన మార్క్సిస్టు ఆర్థికవేత్తలలో ప్రబలంగా వుంది. ఆస్కార్ లాంగ్‌ని ఈ విషయంలో మంచి ఉదాహరణగా చెప్పవచ్చు. మారిస్ డాబ్ మరీను (మామూలుగా డాబ్ మంచి పరిశోధకుడు). వ్యవస్థ గమనాన్ని, ప్రధాన నిర్మాణాలన్నింటిని విశదీకరించేందుకు, దానిని పునర్ని ర్మించి,

---

* ఒకప్పటి ఇటాలియన్ మార్క్సిస్టు మేధావి;
ఫ్రమ్ రూసో టు లెనిన్ రచయిత, అనువాదం : అంజయ్య

ఐక్యపరచి క్రమంలో వుంచేందుకు అవకాశం కల్పించే నియమంగా విలువ నియమాన్ని డాబ్ పరిగణిస్తాడు. కేవలం ఆడం స్మిత్ పరిశోధన వలన, రికార్డో దానిని మరింత క్రమబద్ధీకరించడం వలన రాజకీయ అర్థశాస్త్రం ఐక్యపరిచే పరిణామాత్మక సిద్ధాంతాన్ని ఏర్పరచుకొంది. దీనివలన సర్వసాధారణ ఆర్థిక వ్యవస్థ సమతుల్యతకు సంబంధించిన సూత్రీకరణలను రాజకీయ అర్థశాస్త్రం చేసుకోగలుగుతుంది. అలానే ఆర్థిక వ్యవస్థలోని ప్రధాన అంశాల మధ్య వుండే సంబంధాల మీద రాజకీయ ఆర్థిక శాస్త్రం నిర్ణయాత్మకమైన వ్యాఖ్యానాలు చేసుకోగలుగుతుంది. రాజకీయ అర్థశాస్త్రంలో ఈ ఐక్యతా సూత్రం లేక పరిణామాత్మక రూపంలోని సాధారణ వ్యాఖ్యానాల సముచ్చయమే విలువ సిద్ధాంతమౌతుంది.

విలువ నియమపు అంతిమ సామాజిక తటస్థతను ఈ పేరా ప్రత్యేకించి నొక్కిచెబుతుంది. ఆర్థిక వ్యవస్థలోని అత్యంత ముఖ్యమైన పరిణామాత్మక అంశాల మధ్య సంబంధాన్ని కలిపి వుంచడాన్ని విలువ నియమం సాధ్యం చేస్తుంది. గురుత్వాకర్షణ సిద్ధాంతం చెబుతున్న విధంగా - వివిధ అంశాల మధ్య ఒక విధమైన పరిణామ సంబంధమైన బంధుత్వాన్ని నెలకొల్పడాన్ని విలువ నియమం సాధ్యం చేస్తుంది. (ఇది డాబ్ ఇచ్చిన ఉదాహరణే) విలువ నియమం కలిపి వుంచే వివిధ పరిణామాత్మక అంశాల సంకేతారాధన లేక అన్యధీకరణ స్వభావం ప్రత్యేకించి ఇక్కడ బయటకు రాలేదు. మార్క్స్ ప్రకారం వస్తువులు, పెట్టుబడి ఎల్లవేళలా మనలేవు. అంతకుమించి వాటి మనుగడ ముగింపుకు రావలసిందే. ఆర్థిక వ్యవస్థలో వుండే సంబంధాలనే కాకుండా మార్క్స్ వ్యవస్థనే విశ్లేషించి, విమర్శించాడు. శ్రమ ఉత్పత్తి 'వస్తువు' రూపం ఎందుకు తీసుకుంటుందో; మానవ శ్రమకు 'వస్తువుల' 'విలువ' ఎందుకు ప్రాతినిధ్యం వహిస్తుందో; (ఏ పరిస్థితులలో) ఎందుకు పెట్టుబడి, తనని తానే పునరుత్పత్తి చేసుకుంటుందో మార్క్స్ చర్చించాడు. శ్రమ ఉత్పాదిత 'సహజమైన', అనివార్య రూపాలే వస్తువులని, నిరంతరం వుండే వ్యవస్థే 'మార్కెట'ని భావించిన స్మిత్, రికార్డోల మాదిరే దాదాపు డాబ్ వాదించాడు. అలానే విలువ నియమాన్ని శాశ్వత పరిమాణాత్మక లేక అంశాల నియమం వలె అందించిన స్మిత్, రికార్డోల మాదిరిగానే డాబ్ పరిగణించాడు (తరచూ విలువను 'కొలిచే' సమస్యతో విలువ నియమాన్ని గందరగోళపరచారు).

ఈ అంశంమీద ఇక్కడ చర్చించడంలో సహేతుకత లేదు. మార్క్స్ ప్రకారం విలువ నియమం ఒక భౌతిక నియమమని, చైతన్యం నుండి స్వతంత్రంగా పనిచేసే నియమమని, ప్రత్యేకించి మానవుల 'వెనుక' నుండి పనిచేసే నియమమని పేర్కొంటే సరిపోతుంది. ఒక ప్రత్యేక తరహా భౌతికత ఇమిడి వుందని భావిస్తే సరిపోతుంది. చెప్పవలసివస్తే, ఇది తప్పుడు భౌతికత. దీనిని రద్దు చేయాలి. మార్కెట్ నియమాలు మానవుల 'సహజ అవశ్యమని' మార్క్స్ రాశాడు. భూకంపాలు ఎంత అనూహ్యామో మార్కెట్ గమనం అంతే అనూహ్యం. కాని మార్కెట్ 'సహజమైన' దృగ్విషయం కావడం దీనికి కారణం కాదు. ఇక్కడ వస్తువులు, వాటి మధ్య పరస్పర సంబంధం వలన ఏర్పడిన భౌతిక రూపం మనుషుల మధ్య పరస్పరం ఏర్పడిన సామాజిక సంబంధాలు తప్ప మరొకటి కావు. "మానవులు ఒక సామాజిక దశకు చెందినవారు. వారిమీద ఈ సూత్రీకరణల ప్రభావం ఖచ్చితంగా వుంటుంది. ఈ సమాజంలో ఉత్పత్తి విధానాన్ని మానవుడు నియంత్రణ చేయడానికి బదులు ఉత్పత్తి భావమే అతనిపై యాజమాన్యం కలిగి వుంటుంది. దీనికి కొంచెం ముందే మార్క్స్ ఇలా పేర్కొన్నాడు. "సంపద ఉత్పత్తిని స్వేచ్ఛాబద్ధమైన మానవులు సాగించే ఉత్పత్తిగా భావించనంతవరకు ఒక నిర్దిష్టమైన ప్రణాళిక ప్రకారం వారి ఉత్పత్తిని చైతన్యవంతంగా క్రమబద్ధం చేయనంతవరకు దానిపై ఆధారపడి వున్న సామాజిక జీవన క్రమం తనపై వున్న మార్మిక ఆచ్ఛాదనను (మునుగును) తొలగించుకోలేదు". ఇది విప్లవం ద్వారానే వస్తుందనేది స్పష్టం.

అప్పుడు, రికార్డో భాష్యం ప్రకారం, విలువ నియమం సహజాకృతం వైపు మొగ్గి సామాజికంగా తటస్థ నియమంగా కనిపిస్తుంది. ప్రకృతి నియమానికి వర్గ స్వభావం వుండదు. అలానే వస్తూత్పత్తి, మార్కెట్ మనుగడకు కూడా వర్గ స్వభావం వుండదు. అందుకే ఊకదంపుడు ఉపన్యాసాలు 'మార్కెట్', 'లాభాన్ని' పరివర్తన శీలమైన సోషలిస్టు సమాజపు తొలి దశలో వుండే బూర్జువా సంస్థల అనివార్యమైన అవశేషాలుగా చూడక, ఎల్లవేళలా వుండే 'సహేతుక ప్రాతిపదిక' లేక 'ఆర్థిక కార్యాచరణ కొలమానం'గా చూడడం జరిగింది. అందుకే 'సోషలిస్టు' మార్కెట్ వుంటుంది. 'సోషలిస్టు' లాభం వుంటుంది. లాభాన్ని రద్దు చేయడానికి అంటే దోపిడీని రద్దుచేయడానికి విప్లవాన్ని తీసుకురారు. కవాతు చేసి సంతృప్తి పడడానికే విప్లవాన్ని చేస్తారు.

మొదటి వక్రీకరణకు అతి సన్నిహితంగా వుంటే మరో మౌలికమైన వక్రీకరణ ఏమంటే మార్క్స్ పరిశోధన స్వభావాన్ని, అర్థాన్ని తప్పుగా వ్యాఖ్యానించడం. మార్క్స్ ప్రకారం వస్తూత్పత్తి విస్తృత పరచడం, సర్వ సాధారణీకరించడంతోనే రాజకీయ అర్థశాస్త్రం జనించింది. పెట్టుబడిదారీ విధానంతోనే రాజకీయ అర్థశాస్త్రం పుట్టింది. దానితోనే మరణిస్తుంది. (అంటే పరివర్తన సమాజంలోని అవశేషాలు క్రమేపి అంతరించిపోతాయి.) మార్క్స్ ప్రధాన గ్రంథాలన్నింటికి 'రాజకీయ అర్థశాస్త్ర విమర్శ' అనే శీర్షిక లేక ఉపశీర్షికలు ఎందుకు వుంటాయో ఇది వివరిస్తుంది. ఇందుకు పూర్తిగా విరుద్ధమైనదే నేడు అనేకమంది మార్క్సిస్టులకు వాస్తవం. ఎల్లవేళలా న్యాయశాస్త్రం, రాజ్యం వున్నట్లే ఎప్పుడూ రాజకీయ అర్థశాస్త్రం వుంటుంది. (సోవియట్ యూనియన్ శాస్త్రాల అకాడమీ ముద్రించిన రాజకీయ అర్థశాస్త్ర గ్రంథాన్ని చూడండి.)

ఈ సమస్యను మరొక విధంగా భిన్నమైన దృక్కోణంలో చూచేందుకు ఇప్పటివరకు అభివృద్ధిచేసిన వాదనను ఆపుతాను. వాస్తవానికి ముఖ్యమైన మార్క్స్ మొదటి రచన 'హెగెల్ హక్కు తాత్వికత విమర్శన'ను చూడండి. ఈ గ్రంథ నిర్మాణం ఎంతో విశేషమైనది. ఈ గ్రంథం రాజ్యానికి సంబంధించి హెగెల్ తాత్వికతను విమర్శించడంతోనే ప్రారంభంకాక ఎంతో లోతుగా రాజ్య విమర్శనవైపుకు మళ్ళింది. రెండు విషయాలలోను - అంటే హెగెల్ ఏ విధంగా రాజ్యాన్ని చూచాడు, అలానే రాజ్యానికి సంబంధించిన సమస్య మీద - ఒకే నమూనాను వినియోగించి విమర్శను అభివృద్ధి చేయడం జరిగింది. రాజ్యానికి సంబంధించిన వాస్తవాన్ని 'తల్లక్రిందులుగా' చేసి హెగెల్ ఎలా ప్రతిబింబించాడో చెప్పడమే కాక, రాజ్యం జనింపచేసే వాస్తవికతే అంతని మార్క్స్ చెప్పాడు. "విమర్శనారహితమైన భావన, మార్మిక వాదమే ఆధునిక రాజ్యాంగపు చిక్కుసమస్యని, అలాంటిదే హెగెలియన్ తత్వశాస్త్రపు మార్మికతని" మార్క్స్ రాశాడు. "ఈ దృక్పథం నిర్ద్వంద్వంగా అమూర్త మైనది. కాని హెగెల్ తనంతటతానే అభివృద్ధి చేసినట్టు రాజకీయ రాజ్యాన్ని అమూర్తీకరించడమే ఇది. ఇది కణ నిర్మితమైనది కూడా. కాని ఇది సమాజానికి సంబంధించిన అణువాదం. దృక్పథ లక్ష్యం అమూర్తమైనప్పుడు దృక్పథం స్పష్టంగా వుండదు. సర్వసాధారణంగా ఒక గ్రంథకర్త వేరొక గ్రంథకర్త వర్ణించినట్టుగా విషయం లేదని చూపించడం ద్వారా విమర్శిస్తాడు. వాస్తవికత పేరుతోటి, వాస్తవికత ఆధారంగా ఒక గ్రంథకర్త మరో గ్రంథకర్తని విమర్శిస్తాడు. కాని ఇక్కడ పద్ధతి ఇందుకు భిన్నమైనదిగా కనిపిస్తుంది. పాత తత్వశాస్త్రా నికి విధించిన మరణశిక్ష అదే సమయంలో దాని లక్ష్యానికి కూడా వర్తిస్తుంది. రాజ్యానికి సంబంధించి హెగెల్ తాత్విక భావనను అంతమొందించాలనేకాక, రాజ్యం వస్తువులా 'అంతరించి'పోవాలని కూడా మార్క్స్ కోరుకొన్నాడు. ఇలా అనుకొనటానికి కారణం, వాస్తవానికి సంబంధించిన తాత్విక ప్రాతినిధ్యం తప్పని, అది భౌతిక మైనదని, 'తల్లక్రిందులుగా' వుందని మార్క్స్ భావించడమే కాక అసలు వాస్తవికతే అలా వుందని ఆయన అర్థం చేసుకున్నాడు. అంటే ఆధునిక ప్రాతినిధ్య రాజ్యం లేక పార్లమెంటరీ ప్రభుత్వం రూపం తీసుకొన్న ప్రత్యేక తరహా సామాజిక ప్రభుత్వం అని అర్థం.

ఇలాంటి పరిస్థితే 'పెట్టుబడి' గ్రంథంలో వుంది. ఆర్థికవేత్తల 'తార్కిక మార్మికవాదాన్ని', వారి భూమి, పెట్టుబడి, శ్రమ అనే త్రిసూత్రాన్ని విమర్శించడానికే మార్క్స్ పరిమితమవలేదు. వాస్తవికత (fetishism) ఆధారంతో వీటి సంకేతారాధనను విశదీకరించారు. అంటే పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాన్ని. అనేక వ్యక్తీకరణలలో ఇది కనిపిస్తుంది. 'పెట్టుబడి' గ్రంథంలో ఇలాంటి మాటలు అనేకం వున్నాయి. "సరుకుల మార్మిక స్వభావం", లేక "సరుకుల యావత్ మార్మికత", శ్రమ ఉత్పాదితాలు సరుకుల రూపం తీసుకుంటూ ఇంద్రజాలం, శదల ఎరవేష్టించి వుండడం లేక అంతిమంగా "మార్మిక అచ్ఛాదన" భౌతిక ఉత్పత్తి క్రమంపై ఆధారపడివున్న జీవనక్రమాన్ని వివరించే బూర్జువా భాష్యకారుల ఆవిష్కరణ కాక వాస్తవ జీవిత క్రమానికి సంబంధించినది. అది ఎలా వుందో అలా రాజకీయ అర్థశాస్త్రం కనిపిస్తుంది.

నిజానికి వాస్తవికత తల్లక్రిందులుగా వుంది. వాస్తవికతను ఆర్థికవేత్తలు, తత్వవేత్తలు ఏ విధంగా వర్ణించారో విమర్శించడం కాదు ప్రశ్న. వాస్తవాన్ని కాళ్ళమీద నిలబెట్టడం అవసరం. 'ఇప్పటి వరకు తత్వవేత్తలు ప్రపంచాన్ని వ్యాఖ్యానించారు. దాన్ని మార్చడమే అసలు విషయం. ఇంతవరకు, మార్క్సిజాన్ని ఒక శాస్త్రంగా నేను చూశాను. మార్క్సిజం విప్లవమా అన్న విషయానికి ఇప్పుడు నేనొస్తాను.

ఆవేశపడక ఆలోచించవలసిందిగా పాఠకుణ్ణి నేను కోరుతు న్నాను. ఇప్పటివరకు నేను ముందుకు తీసికొచ్చిన వాదంలో తీవ్రమైన సందేహం, ఇంకా ప్రమాదకరమైన ఒక అంశం వుంది. వాస్తవికతను ఆధారం చేసుకుని ఒక రచయిత మరొక రచయితని విమర్శిస్తాడు. ఒక రచయిత వర్ణించినట్లుగా కాక వాస్తవకత ఎలా వుందో చూయించడం ద్వారా మరొక రచయిత మొదటి రచయితని విమర్శిస్తాడు. ఇదే సరైన పద్ధతి. కాని మార్క్స్ - అటు హెగెల్ విషయంలోకాని, ఇటు ఆర్థికవేత్తల విషయంలో గాని - ఈ పనిని చేయలేకపోయినట్లు కనిపిస్తుంది. చేయలేకపోయాడంటే వాస్తవికత - ప్రస్తావన ప్రాతిపదిక ఇదివరకే కల్పించిన ప్రమాణం. ఇదే నిజమైతే మార్క్స్ ప్రవక్త కావాలి (అలాకాదు). మనం రివిజనిస్టులం అవుతాం. ఏ ప్రాతిపదికమీద పెట్టుబడిదారీ వాస్తవికత తల్లక్రిందులుగా వుందని చెప్పగలం? బెర్న్‌స్టీన్ ప్రకారం 'నైతిక ఆదర్శ' ప్రాతిపదికగా అని చెప్పగలం. కాంట్ నైతిక శాస్త్రం ప్రకారం ప్రపంచాన్ని సరిదిద్ది సంస్కరించవచ్చని న్యాయభావన (Idea of Justice) తెలియ జేస్తుంది. విలువ, అదనపు విలువ అనేవి కేవలం మాటలే. సోషలిజమనేది అభిలషజనితమే. మానవుల మననులను మార్చండి. ఊహాజనిత సోషలిజాన్ని స్వీకరించి శాస్త్రీయ సోషలిజాన్ని పరిత్యజించండి. వాస్తవికత అంత ముఖ్యం కాదు. 'వాస్తవాలకు' లెక్కలేదు. ఆదర్శాన్ని ఆచరణ యోగ్యం చేసేందుకు వాస్తవికతను తిరస్కరించండి. వివేచనే విప్లవం. మార్క్యూస్ పెటీబూర్జువా అరాచక వాదం, దాన్ని అనుసరించేవారికి వామపక్షాన సమకాలీన బెర్న్‌స్టీన్ ఉన్నట్టు కనిపిస్తుంది.

వాదనలో కొంత క్రమాన్ని తీసుకొచ్చేందుకు నేను ఇక్కడో క్షణం ఆగాలి. వాస్తవికత తప్పనిసరిగా తల్లక్రిందులుగా వుంటుంది - లేకపోతే విప్లవం అవసరంలేదు. మరొకపక్క మార్క్సిజం కూడా శాస్త్రం కాదలచుకుంది. అలా కాకపోతే శాస్త్రీయ సోషలిజం వుండదు. కేవలం మెస్సయ్య ఆశలు, మత ఆకాంక్షలే మిగులుతాయి. క్లుప్తంగా చెప్పాలంటే, మార్క్స్ శాస్త్రవేత్త అయితే తన భావాలను, ఇతరుల భావాలను వాస్తవాల దృష్ట్యా ఆయన

కొలవవలసి వుంటుంది. వాస్తవికత దృష్ట్యా పరికల్పనను (hypothesis) ప్రయోగాత్మకంగా పరీక్షించవలసి వుంటుంది. ఇంకా చెప్పాలంటే హెగెల్‌ను, ఇతర అర్థికవేత్తలను పెట్టుబడిదారీ విధానపు వాస్తవికతను మార్క్స్ విమర్శిస్తున్నప్పుడు ఆ పనిని వాస్తవికత పేరుతోను, వాస్తవికత ప్రాతిపదికగాను చేయవలసి వుంటుంది. మార్క్స్ విమర్శన ప్రాతిపదిక 'ఆదర్శం' కాకూడదు. వాస్తవికత నుండి ఆ ప్రాతిపదిక తీసుకోవాలి. వాస్తవికతలో ఆ ప్రాతిపదిక వేరూనికొని వుండాలి. దీనిని క్లుప్తంగా చెప్పదలిస్తే, పెట్టుబడిదారీ విధానంలో రెండు వాస్తవికతలు ఉన్నాయని చెప్పాలి. మార్క్స్ వ్యక్తం చేసిన వాస్తవికత, మార్క్స్‌ను విమర్శించిన రచయితలు వ్యక్తపరచిన వాస్తవికత. పెట్టుబడి, వేతన శ్రమల మధ్య గల సంబంధాన్ని పరిశీలించడం ద్వారా ఈ విషయాన్ని వీలైనంత సరళంగాను, త్వరగాను చెప్పడానికి నేను ప్రయత్నిస్తా.

పెట్టుబడిదారుని దృష్టిలో ఈ సంబంధం ఎలా వుందో చెప్పడంతో నేను ప్రారంభిస్తాను. వడికే యంత్రం, పత్తి, శ్రమను కొనుగోలు చేయడానికి పెట్టుబడిదారుడు తన ధనాన్ని మదుపు పెడతాడు. ఈ వస్తువులనే ఆతను మార్కెట్‌లో 'సరుకులు'గా చూస్తాడు. అందరూ ఒక కొరడానో, గుర్రాన్నో, బండినో కొనుగోలు చేసినట్లు పెట్టుబడిదారుడు వీటిని కొనుగోలు చేస్తాడు. ఈ కొనుగోలు చేసిన తరువాత (పెట్టుబడిదారుడు వాటి అసలు ధరకంటే ఎక్కువ డబ్బిచ్చి కొనలేదనుకొందాం) పెట్టుబడిదారుడు పత్తి నుండి దారాన్ని తీసేందుకు వడికే యంత్రం వద్ద కార్మికుడ్ని పనిలో పెడతాడు. "పెట్టుబడిదారుడు కొనుగోలు చేసే వస్తువులు, అతని సొంత ఆస్తి అయ్యే వస్తువుల మధ్య వుండే క్రమాన్ని శ్రమ క్రమమని" మార్క్స్ చెప్పాడు. "పెట్టుబడిదారుని ప్రయోగశాల గదిలో పులుపు ప్రక్రియ ద్వారా ఉత్పత్తయ్యే సారా ఎలా అతనిదవుతుందో శ్రమ క్రమానికి సంబంధించిన ఉత్పత్తి అతనిదే అవుతుంది.

మొత్తం క్రమాన్ని ఒకటిగా చూడటానికి అలవాటుపడిన పెట్టుబడిదారుడు అతను కొన్న వివిధ వస్తువులను వేరు వేరుగా చూడటానికి ఇష్టపడతాడు. పెట్టుబడిదారుని దృష్టిలో, పెట్టుబడిలో భాగమే వేతన శ్రమ. అలానే యంత్రాంగం, ముడిసరుకు. ఉత్పత్తి సాధనాలు కొనుగోలు మొత్తంతో సంబంధం లేకుండా 'వేతన నిధి' చర పెట్టుబడిలో భాగమౌతుంది. తనకిచ్చే వేతనాన్ని ఉత్పత్తి చేయడంతోపాటు కార్మికుడు అదనపు విలువను ఉత్పత్తి చేస్తాడు. ఇది పెట్టుబడిదారునికి చాల సంతోషకరమైన పరిస్థితి. దీనివలన ఆతనికి ఎలాంటి సైద్ధాంతిక సమస్య తలెత్తదు. తన సొంత పెట్టుబడి ప్రత్యక్ష ఉత్పాదితంగానే ఈ శ్రమ ఫలితం పెట్టుబడిదారునికి కనిపిస్తుంది. కొనుగోలు వస్తువులలో ఒకటైన శ్రమ, పెట్టుబడిలో ఒక భాగమే. ఇది మార్క్సేతర ఆర్థికవేత్తల ఆర్థిక సూత్రమని మనందరికి తెలుసు. దీనినే రాజకీయ అర్థశాస్త్ర సంకేతారాధనని మార్క్స్ పిలిచాడు. శ్రమ ఒక్కటేగాక, పెట్టుబడి కూడా విలువను ఉత్పత్తి చేస్తుంది. శ్రామికులు చేసిన ఉత్పాదకతకు వేతనాలు చెల్లిస్తారు. పెట్టుబడిదారునికి లాభాలు చెల్లిస్తారు. భూమి పంటను ఉత్పత్తి చేస్తుంది; పెట్టుబడి లేక యంత్రాంగం లాభాలను సృష్టిస్తాయి. శ్రమ వేతనాలను ఉత్పత్తి చేస్తుంది. దేనికుండే పని దానికుంది. శాశ్వతంగా వీటి మధ్య సామరస్యం నెలకొంటుంది. ఆ విధంగా ఉత్పత్తి అంశాలు కలుస్తాయి.

ఇది 'యజమాని' దృక్పథమని మీరు చెప్పవచ్చు. స్వీయ దృక్పథంగా కంటే మించి ఇక్కడ విషయం వుందని అర్థం చేసుకోవడం ముఖ్యం. కొంతమేరకు వాస్తవాన్ని ఇది ప్రతిబింబిస్తున్న దృక్పథం. తమ భుక్తిని కార్మిక వర్గం పునరుత్పత్తి చేస్తుంది. అదే సమయంలో అదనపు విలువను (అంటే, లాభం, అద్దె, వడ్డీ) కార్మిక వర్గం సృష్టిస్తుంది. తన శ్రమతో సమాజంలో ఆధారితమైన వర్గాలన్నింటికి ఆదాయాన్ని కార్మికవర్గం సమకూర్చుతుంది. అలా అణిచి వుంచబడినంత కాలం - శ్రామిక వర్గం పెట్టుబడిదారీ యంత్రంలో ఒక భాగమే అవుతుంది. శ్రమ పెట్టుబడిని ఉత్పత్తి చేస్తుంది. శ్రమ కారణం, పెట్టుబడి కార్యం. మొదటిది పుట్టుకనిస్తుంది. రెండవది జనిస్తుంది. ఇంకా సంస్థ జమా, ఖర్చులలోనే కాక నిజమైన యంత్రాంగంలో శ్రామిక వర్గం చర పెట్టుబడిగాను, వేతనాల నిధిగాను కనుపిస్తుంది. 'యావత్తే' ఒక 'భాగమౌ'తుంది. ఒక భాగమే యావతౌతుంది. 'తలమీద నిలబడిన' వాస్తవమని దీనిని ఇంతకు ముందే పేర్కొన్నాం. ప్రాతిపదిక, కొలమానంగా ఈ వాస్తవికతనే మార్క్స్ తిరస్కరించడమే కాకుండా, దాన్ని తోసివేసి సక్రమంగా నిలబెట్టాలని భావించాడు.

అమెరికన్ శ్రామికవర్గాన్ని గురించి ఆలోచించండి. ఇది పెట్టుబడిలో, పెట్టుబడిదారీ యంత్రాంగంలో ఒక భాగం. గట్టిగా చెప్పాలంటే, అమెరికన్ శ్రామికవర్గం ఒక 'వర్గం' కాదు. (తానొక వర్గమన్న చైతన్యమే దానికి లేదు) 'వేర్వేరు రకాలైన' శ్రామికుల కలయిక అమెరికన్ శ్రామికవర్గం : కార్ కార్మికులు, రసాయన పరిశ్రమలలో పనిచేసే కార్మికులు, బట్టల పరిశ్రమలలో పనిచేసే కార్మికులు మొదలైనవారు. పరిస్థితికి స్పందించి ఈ కార్మికులు సమ్మెకు దిగితే సామాజిక యంత్రాంగంపై దాని ప్రభావం, మానవ శరీరంలో ఒక చిన్న ఆరోగ్య సమస్య ప్రభావం మాదిరి వుంటుంది. ఈ వికారాన్ని వదల్చుకొని యథాస్థితికి రావడానికి ఒక మాత్రకంటే ఎక్కువ అవసరం వుండదు. నిజానికి, ఈ వర్గం (శ్రామికవర్గం ఈ దశ ద్వారా పయనించి నప్పటికి, ఆ వర్గం అధికారాన్ని చేపట్టేవరకు కొంతవరకు ఈ స్థితిలో వుంటుంది.) పెట్టుబడిలో ఒక భాగం. పెట్టుబడిలో శ్రామికవర్గం ఒక భాగమన్నది నిజమైనప్పటికీ (ఇతర దేశాలలో సామ్రాజ్యవాదం సాగించే కార్మిక దోపిడీని అలా వుంచితే) తిరిగి ఆ శ్రామికులు ఉత్పత్తి చేసే విలువలో పెట్టుబడి కొంత భాగం.

మార్క్స్ అనుసరించిన దృక్పథం ఖచ్చితంగా ఈ రెండవ వాస్తవికతకు సంబంధించినది. పెట్టుబడిలో శ్రమ చర భాగము. వాస్తవానికి శ్రమలో ఒక భాగం పెట్టుబడి. (అందుచేత శ్రమే యావత్) ఇది 'సజీవమైన శ్రమ' ఉత్పాదితం. అప్పుడు బెర్న్‌స్టీన్ నైతికవాదాన్ని లేక మార్క్స్ 'ఊహాజనితాలని' పునశ్చరణ చేయకుండా, వాస్తవికతలోని ఒక అంశాన్ని వినియోగించుకోవడం ద్వారా ఆర్థికవేత్తల వాదాలను తోసిపుచ్చి పెట్టుబడిదారీ విధానాన్నే కూలగొట్టాలని మార్క్స్ సూచించాడు. అందుచేత మార్క్సిజం ఒక శాస్త్రం. పెట్టుబడిదారీ ఉత్పత్తి యంత్రాంగం ఏ విధంగా పని చేసిందో విశ్లేషణాత్మకంగా పునర్నిర్మించడమే.

శాస్త్రంగానే వుంటూ, మార్క్సిజం మరోపక్క విప్లవకరమైన భావజాలం. శ్రామికవర్గ దృక్పథం నుండి వాస్తవికతను విశ్లేషించడం. దీనర్థమేమంటే, 'పెట్టుబడి'లోని శాస్త్రీయ విశ్లేషణను సొంతం చేసుకోకుండా కార్మికవర్గం తనని తాను ఒక వర్గంగా రూపొందించుకోలేదు. ఇది లేనప్పుడు అనేక 'ధాతువుల' (Categories)గా కార్మికవర్గం కుదించివేయబడుతుంది. శ్రామికవర్గం (స్వాప్నికులారా లేవండి!) ఒక ముఖ్య అంశం కానప్పుడు, ఇది ప్రకృతిజనితం కాదు. ఇది లక్ష్యం. చారిత్రక కార్యాచరణజనితం. అంటే ఇది భౌతిక పరిస్థితుల జనితమే కాక రాజకీయ చైతన్య జనితం కూడా. క్లుప్తంగా ఆర్థిక సజ్జోనితవాదానికి అవలికి వెళ్ళి, తమనే కాక యావత్ సమాజాన్ని విముక్తి చేయదలచుకొన్న విప్లవ సిద్ధాంతవేత్తగా తనని తాను చైతన్యపరచుకొన్నప్పుడు ఒక వర్గం ఒక వర్గమౌతుంది. రాజకీయ సంస్థలోని వర్గం ఏర్పరచుకొనే చైతన్యం తన మిత్రులకు అగ్రభాగాన తనకు ఉన్న స్థానం 'పెట్టుబడి' నుండి తప్ప మరెక్కడ నుండో పొందలేదు. ఈ అర్థంలోనే, పార్టీ నిర్మాణానికి కూడా 'బయటనుండి' ఏదో అవసరమౌతుందని లెనిన్ చెప్పి వుంటాడని నేను భావిస్తున్నాను.

*

ఆజన్మ విప్లవకారుడు

అన్నిటికంటే ముఖ్యమైన విషయమేమంటే, మార్క్స్ ఒక విప్లవకారుడు. జీవితంలో ఆయన ధ్యేయం పెట్టుబడిదారీ సమాజాన్నీ, అది సృష్టించిన రాజ్యాంగ సంస్థల్నీ ఏదో ఒక విధంగా కూలదోయడం; ఆధునిక కార్మికవర్గ విముక్తికి దోహదం చేయడం. కార్మికవర్గం తన స్థానాన్నీ, తన అవసరాల్నీ, తన విమోచన కవసరమైన పరిస్థితుల్నీ అర్థం చేసుకొనేటట్లు చేసిన మొట్టమొదటి వ్యక్తి ఆయనే. పోరాటం ఆయన ప్రాణం. దాన్ని మరెవ్వరూ సాగించనంతటి ఉద్వేగంతో, దీక్షతో విజయవంతంగా ఆయన సాగించారు.

ఫలితమేమంటే, ఆయన కాలంలో అందరికంటే ఎక్కువగా ద్వేషించబడిన వ్యక్తీ దూషించబడిన వ్యక్తీ మార్క్సే మాత్రమే. వివిధ ప్రభుత్వాలు - నిరంకుశ రాచరికాలు, రిపబ్లికన్ ప్రభుత్వాలు కూడ - ఆయనను తమ దేశాల నుంచి వెళ్ళగొట్టాయి. పెట్టుబడిదారీ వర్గాలు - యధాతథ స్వభావం గలవి, అత్యంత ప్రజాస్వామ్యయుతమైనవి - ఆయన మీద అపవాదులు కురిపించడంలో ఒకదానితో ఒకటి పోటీపడ్డాయి. వీటన్నిటినీ ఆయన బూజు దులుపుకున్నట్లు దులిపివేసుకున్నారు. వీటినాయన లక్ష్యపెట్టలేదు. తప్పనిసరి అయితేనే వీటికాయన జవాబులు చెప్పేవారు. సైబీరియా గనులు లగాయతు కాలిఫోర్నియా వరకు, యూరపు అమెరికాల్లోని అన్ని ప్రాంతాల్లో నివసించే లక్షలాది తోటి విప్లవ కార్మికులచే ఆయన ప్రేమింపబడ్డారు; గౌరవింపబడ్డారు. చివరకు వారందరినీ దుఃఖసముద్రంలో ముంచి వెళ్ళిపోయారు. ఆయనకు వ్యతిరేకులనేకమంది వుండవచ్చు; కాని వ్యక్తిగత శత్రువు లెవరూ ఆయనకు లేరని ధైర్యంగా నేను చెప్పగలను. ఆయన పేరు యుగయుగాల్లో నిలిచిపోతుంది; ఆయన కృషి కూడా అలాంటిదే!

- ఫ్రెడరిక్ ఏంగెల్స్

కారల్ మార్క్స్ సమాధి వద్ద యిచ్చిన ఉపన్యాసం నుంచి (1883)

ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ ఉపాధి హామీ కార్యక్రమం – ఒక పరిశీలన

కె. సోమశేఖర్ *

భారతదేశం స్వతంత్ర దేశంగా ఆవిర్భవించి 63 సంవత్సరాలు పూర్తయ్యాయి. స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత జాతిపిత మహాత్మ గాంధీ ఆలోచన మేర గత పంచవర్ష ప్రణాళికలలో గ్రామీణాభివృద్ధికి పెద్దపీట వేశారు. భారతదేశ అభివృద్ధి వ్యూహంలో గ్రామీణాభివృద్ధి ప్రధాన అంశంగా ప్రణాళికా కాల ప్రారంభం నుండి వుంటూనే వుంది. గ్రామీణ ప్రాంతాలలో ఉన్న పేదరికాన్ని తగ్గించుట, నిరక్షరాస్యతను, నిరుద్యోగాన్ని తగ్గించుట గ్రామీణ ప్రజల కొనుగోలు శక్తిని తద్వారా గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించుట గ్రామీణాభివృద్ధి యొక్క ప్రధాన లక్ష్యం. దేశ జనాభాలో రమారమి 75 శాతం మంది గ్రామీణ ప్రాంతాలలో నివశిస్తున్నారు. అందువలన గ్రామీణాభివృద్ధి కొరకై ప్రభుత్వం 1951 సంవత్సరం నుండి అనేక అభివృద్ధి పథకాలను అమలుచేస్తుంది. సమాజాభివృద్ధి పథకం నుండి స్వర్ణజయంతి గ్రామ స్వరోజ్‌గార్ యోజన వరకు అనేక అభివృద్ధి, ఉపాధి పథకములను కోట్లాది రూపాయలు వెచ్చించి అమలుచేస్తున్నారు. అయినా దారిద్ర్యరేఖకు దిగువున ఉన్నవారిని ఆర్థికంగా అభివృద్ధి పరచడంలోను, బడుగు వర్గాలను అభివృద్ధిపరచడంలోను కొంతమేర అభివృద్ధిని సాధించ గలిగినా పూర్తిగా పేదరికాన్ని నిర్మూలించలేకపోయారు. తాజా గణాంక వివరాల ప్రకారం దేశ జనాభాలో సుమారు 27.5 శాతం మంది ప్రజలు దారిద్ర్య రేఖ దిగువన వున్నట్లుగా తెలియచేస్తున్నది. అంటే దేశ జనాభాలో ప్రతి నలుగురిలో ఒక్కరు పేదవారే అన్నమాట. దీనికి ప్రధాన కారణాన్ని అన్వేషిస్తే ఇంతవరకు ప్రవేశ పెట్టిన గ్రామీణ అభివృద్ధి పథకాల వల్ల జీవనోపాధి కొద్ది శాతం మంది పేదలకు మాత్రమే చేకూరింది. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాలలో ప్రతి గ్రామీణ కుటుంబం ఒక ఆర్థిక సంవత్సరంలో కనీసం 100 రోజులకు తక్కువ కాకుండా పనిని పొందే హక్కు చట్టరీత్యా కల్పించే పథకాన్ని "జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం" పేరిట 2006లో ప్రారంభించారు.

ఈ పథకాన్ని ప్రప్రథమంగా మన రాష్ట్రంలోని అనంతపురం జిల్లా బండ్లపల్లి గ్రామంలో 2 ఫిబ్రవరి, 2006న భారత ప్రధాని గౌ॥ డాక్టర్ మన్మోహన్‌సింగ్, యు.పి.ఎ. ఛైర్‌పర్సన్ శ్రీమతి సోనియా గాంధీ ప్రారంభించారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టం ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో నైపుణ్యం అవసరంలేని, పని కోరుకుని చేయడానికి సిద్ధంగా వున్న కుటుంబానికి సంవత్సరంలో 100 రోజుల పనిని ప్రభుత్వం కల్పించాలి. మొదట ఈ పథకాన్ని దేశంలోని 200 జిల్లాలలో అమలుచేశారు. రెండవ దశలో 2007-08లో అదనంగా మరో 130 జిల్లాలలో ఈ పథకాన్ని పొడిగించారు. మిగతా అన్ని జిల్లాలలో 2008 ఏప్రిల్ ఒకటో తేది నుండి అమలుజరుగుతున్నది.

గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రాముఖ్యం

అణగారిన వర్గాలకు ఇతర ఉపాధి ప్రత్యామ్నాయాలు లేనప్పుడు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ఉపాధి వనరుగా వుంటుంది. పనిచేసే వారికి సామాజిక భద్రతా కవచాన్ని ఏర్పాటుచేస్తుంది. వారు నిశ్చింతగా జీవించేందుకు దారిచూపుతుంది. పనివారికి పని కోరే హక్కును కల్పించి నిర్ణీత కాల వ్యవధిలో వారికి ఉపాధి అందచేయ టంలో ప్రభుత్వాన్ని జవాబుదారీగా నిలుపుతుంది. సహజ వనరుల యాజమాన్యానికి ప్రాధాన్యం యిచ్చి మన్నిక గల ఆస్తుల కల్పన పట్ల ప్రత్యేక శ్రద్ధతో వ్యవసాయాధారిత ఆర్థిక వ్యవస్థ సుస్థిరాభివృద్ధికి సమర్థమైన వృద్ధి వాహకంగా పనిచేస్తుంది. పటిష్టమైన వికేంద్రీకరణ వ్యవస్థతో స్థానిక సమాజానికి జవాబుదారీగా వుండి ఒక నూతన ఒరవడితో పని సాగించే ఎన్.ఆర్.ఇ.జి.ఎ. పారదర్శకత అట్టడుగు స్థాయి ప్రజాస్వామ్య సిద్ధాంతాలపై రూపొందిన పాలనా సంస్కరణకు ప్రతీకగా నిలుస్తుంది. విస్తృత పరిధితో కనీస వేతన భద్రత కల్పన నుండి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పునరుత్తేజపరిచి ప్రజాస్వామ్య సాధికార ప్రక్రియగా మలచే శక్తి గల పథకం.

హక్కు ఆధారంగా పని కల్పించే ఏర్పాటు

1. గ్రామీణ కుటుంబానికి చెందిన వయోజనులైన సభ్యులు నైపుణ్యంలేని శారీరక శ్రమతో కూడిన పనికి సుముఖంగా వుండేవారు స్థానిక గ్రామ పంచాయతీలో తమ పేరును నమోదు చేసుకోవాలి.
2. తగిన ధృవీకరణ చేసుకున్న తర్వాత గ్రామ పంచాయతీ వారికి ఉద్యోగ కార్డును జారీచేస్తుంది. ఈ కార్డులో కుటుంబానికి చెందిన వయోజన సభ్యులు అందరి ఫోటోలు వుంటాయి. వీటిని ఉచితంగా ఇస్తారు.
3. ఉద్యోగ కార్డు వున్న కుటుంబం ఉపాధి కావాలని కోరుతూ గ్రామ పంచాయతీకి దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందులో ఏ

* అసిస్టెంట్ ప్రొఫెసర్, గ్రామీణాభివృద్ధి శాఖ, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు

సమయానికి ఎంతకాలంపాటు ఏ పనికోసం అనే అంశాలు తెలపాలి.

నిర్ణీత కాల వ్యవధితో కూడిన హామీ

1. ఉపాధి కోసం చేసుకున్న దరఖాస్తు అందుకున్న వెంటనే గ్రామ పంచాయతీ రశీదు జారీచేస్తుంది. దీనిపై దరఖాస్తు అందిన తేదీ వుంటుంది. దీనివల్ల 15 రోజుల్లోగా ఉపాధి కల్పించాలనే హామీ అమల్లోకి వస్తుంది. 15 రోజులలోగా ఉపాధి కల్పించని పక్షంలో నగదు రూపంలో రోజువారి నిరుద్యోగ భృతి చెల్లించవలసి వుంటుంది.

2. సాధారణంగా గ్రామానికి 5 కి.మీ. దూరంలోపు పని కల్పించాలి లేని పక్షంలో అదనంగా 10% వేతనాల చెల్లింపు జరగాలి.

3. వేతనాలను కనీస వేతనాల ప్రకారం చెల్లించాలి. వారానికి ఒకసారి లేదా 15 రోజులు దాటకుండా వేతనాల పంపిణీ వుండాలి.

మహిళా సాధికారత

పని కేటాయించిన వ్యక్తులలో కనీసం మూడో వంతు మహిళలు వుండాలి.

వికేంద్రీకృత ప్రణాళిక రూపకల్పన

ఏ ఏ ప్రాజెక్టులు చేపట్టాలనేది గ్రామసభలు తయారు చేయాలి. ప్రణాళిక రూపకల్పన, అమలులో పంచాయతీరాజ్ సంస్థలు ప్రధాన పాత్ర పోషిస్తాయి. 60 : 40 వేతన సామగ్రి నిష్పత్తి నిర్వహణ అవసరం. కాంట్రాక్టర్లకు పనులు అప్పగించడం - కార్మికులను తొలగించే యంత్ర సామగ్రి వాడకం - నిషేధం.

ప్రజలకు జవాబుదారీతనం

సామాజిక తనిఖీని గ్రామసభలు జరపాలి. అమలు ప్రక్రియలో సమస్యలపట్ల స్పందన వుండే విధంగా ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగాలను ఏర్పాటు చేయాలి.

పారదర్శకత

పథకానికి సంబంధించి అన్ని ఖాతాలు, రికార్డులను సిద్ధంగా ఉంచి ఆ రికార్డుల నమూనాను డిమాండుపై లేదా నిర్దేశించిన రుసుము చెల్లింపుపై వాటిని పొందగోరే వ్యక్తులకు అందుబాటులో వుండాలి.

గ్రామీణ ఉపాధి హామీ కార్యక్రమం - ఆంధ్రప్రదేశ్

కేంద్ర ప్రభుత్వం 2005లో జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని అమలులోనికి తెచ్చిన వెనువెంటనే ఇందుకు అనుగుణంగా "ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని" రూపొందించింది. ఈ పథకం 2006 ఫిబ్రవరి 2వ తేదీ నుండి మన రాష్ట్రంలో అమలులోనికి వచ్చింది. మొదట గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అదిలాబాద్, అనంతపురం, చిత్తూరు, కడప, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, మెదక్, నల్లగొండ, నిజామాబాద్, రంగారెడ్డి, విజయనగరం, వరంగల్లు జిల్లాలలో అమలుపరిచారు. 2007 మే నుండి ఈ కార్యక్రమాన్ని తూర్పు గోదావరి, కర్నూలు, గుంటూరు, నెల్లూరు, ప్రకాశం, శ్రీకాకుళం జిల్లాలకు విస్తరింపచేశారు. మూడవ దశలో 2008 ఏప్రిల్ ఒకటవ తేదీ నుండి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కృష్ణా, విశాఖపట్నం, పశ్చిమ గోదావరి జిల్లాలలో కూడా అమలుచేస్తున్నారు.

ఈ ఉపాధి హామీ పథకం క్రింద ముఖ్యంగా సాగునీటికి సంబంధించిన పనులకు ప్రాధాన్యత ఇస్తున్నారు. నీటి సంరక్షణ పనులు, మొక్కలు నాటడం, కాలువలు, చెరువులు తవ్వటం, భూమిని అభివృద్ధిపర్చటం, వరద కట్టలను ఏర్పాటు చేయటం లింక్ రోడ్లను అభివృద్ధి చేయటం, చెట్ల పెంపకం, అడవుల పెంపకం వంటి పనులను ఈ పథకం కింద చేపట్టారు. అంతేకాకుండా ప్రతి గ్రామ పంచాయతీల పరిధిలో కనీసం ప్రతి గ్రామానికి ఒక ఇందిరమ్మ చెరువును అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. వీటివలన గ్రామాల్లో చిన్న నీటివనరుల రక్షణకు ఈ చెరువులు ఎంతగానో ఉపయోగపడతాయి. అంతేకాక చెరువులకు కలిసి వున్న వాగులు, వంకలు పూర్తి స్థాయిలో పునరుద్ధరణకు నోచుకుంటాయి. వీటితోపాటు ఈ కార్యక్రమం ద్వారా షెడ్యూల్డు కులాల, షెడ్యూల్డు తెగల వారి భూములలో భూ సంస్కరణలలో భాగంగా భూమిని పొందిన వారి పొలాలకు దారిద్ర్య రేఖకు దిగువ ఉన్నవారి పొలాలకు సాగునీటి సదుపాయాల కల్పనకు, పండ్ల మొక్కల పెంపకానికి అవసరమైన పనులను చేపట్టడం జరుగుతుంది. ఈ పథకం అమలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 90 : 10 నిష్పత్తిలో నిధులను సమకూరుస్తాయి.

సాధించిన ప్రగతి

ఈ ఉపాధి హామీ పథకం రాష్ట్రంలోని 22 జిల్లాలోని 1,098 మండలాలలో, 20,000 గ్రామాలలో పని కావాలని వచ్చే నిపుణులుకాని కార్మికులకు సంవత్సరంలో 100 దినాలు పని కల్పించబడుతోంది. ఈ పథకం పేదప్రజల బ్రతుకులకు కొంతమేర జీవనాధారంగా మారింది. గతంలో తరచూ కరువు పీడిత ప్రాంతాలుగా గుర్తింపు పొందిన అనంతపురం, మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల నుండి మిగతా ప్రాంతాలకు పనికోసం వలస వెళ్ళేవారు. ఈ కార్యక్రమం అమలువలన చాలావరకు ఈ వలసలు నిలిచిపోయాయి. రాష్ట్రం లోని క్షామ పీడిత ప్రాంతాలలో అనేకమంది పేదవారికి ఈ పథకం క్రింద లబ్ధిపొందుతున్నారు. ఇది జీవనాధారంగా మారింది. గత మూడున్నర సంవత్సరాలలో రూ. 3,335 కోట్ల వేతనాల రూపంలో కూలీలకు చెల్లింపులు జరిగాయి. ఇంతవరకు 1.07 కోట్ల కుటుంబాలలోని 2.44 కోట్లు వయోజనులకు పని కల్పించడంలో ఈ పథకం తోడ్పడింది

ఇంతవరకు 67.67 లక్షలమంది గ్రామ పంచాయతీలలో తమ పేర్లు నమోదు చేయించుకున్నారు.

పట్టిక

జాతీయ ఉపాధి హామీ పథకం క్రింద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి

	జాబ్ కార్డులు పొందినవారి సంఖ్య 1,07,88,129		2008-09 సంవత్సరంలో	పథకం మొదలైన తేది నుండి
1.	శాఖాపరంగా మంజూరయిన పనులు	సంఖ్య	11,08,738	14,33,556
		రూ. 11 లక్షలలో మొత్తం పనుల విలువ	11,20,95,987	13,16,30,479
2.	జరుగుతున్న పనులు	సంఖ్య	4,08,116	---
		పనుల విలువ రూ. లక్షలలో	5,02,87,793	
3.	పూర్తయిన పనులు	సంఖ్య	1,09,268	4,34,108
		పనుల విలువ రూ. లక్షలలో	92,84,090	2,88,21,049
4.	మొత్తం వ్యయం	వేతనాలు రూ. 4 లక్షలలో	1,19,35,089	3,37,18,875
		సామాగ్రి మరియు స్కిల్డ్ వేతనాలు రూ. లక్షలలో	13,87,249	42,04,493
		అనిశ్చిత ఖర్చులు రూ. లక్షలలో	4,36,760	18,31,401
		మొత్తం రూ. లక్షలలో	1,37,59,107	3,97,54,769
5.	వేతనాలు పొందినవారి సంఖ్య	కుటుంబాల సంఖ్య	48,14,047	68,00,132
		వ్యక్తుల సంఖ్య	80,66,079	1,14,74,977
		పురుషుల సంఖ్య	36,82,229	52,78,646
		స్త్రీల సంఖ్య	43,83,850	61,96,331
		వికలాంగుల సంఖ్య	50,729	71,595
6.	మొత్తం మానవ దినాలు		14,26,65,195	40,82,88,699
7.	ఒక దినానికి ఒక వ్యక్తికి సగటు వేతనం		83.6	82.59
8.	100 రోజులు పనిచేసిన మొత్తం కుటుంబాల సంఖ్య		1,56,241	6,33,924

సేకరణ : కమిషనర్, గ్రామీణాభివృద్ధి శాఖ, ఆంధ్రప్రదేశ్, హైదరాబాద్

పై పట్టికనుబట్టి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో అద్వితీయమైన ప్రగతి సాధించిందని చెప్పవచ్చు. ఈ పథకం ద్వారా ప్రతి వ్యక్తి కనీసం సగటున 85 రూపాయల ఆడ, మగ అన్న తేడా లేకుండా వేతనాలు పొందుతున్నట్లు తెలుస్తున్నది. వేతనాలు చెల్లింపు విషయంలో మోసాలు జరుగకుండా వుండాలనే సదుద్దేశంతో పనిచేసిన వ్యక్తి కూలి డబ్బులను ఆ వ్యక్తికి పోస్టాఫీసు ద్వారా చెల్లించడం జరుగుతుండటం ఒక వినూత్నమైన ప్రయోగంగా పేర్కొనవచ్చు. ఈ పథకం ద్వారా లక్షలాది కుటుంబాలు ఉపాధి పొంది గ్రామీణ ప్రాంతాలలో నూతన ఆర్థిక మార్పుకు దోహదపడింది. పథకం అమలులో యంత్రాల వాడకం గాని, కంట్రాక్టర్ల ద్వారా పనులు చేయించుట, దళారి వ్యవస్థకు చోటులేకుండా అన్ని చర్యలు తీసుకున్నారు. కూలీల సంక్షేమానికి కూడా ప్రాధాన్యత ఇచ్చారు. వాటిలో భాగంగా పనిజరుగుతున్న సమయంలో దురదృష్టవశాత్తు ఎవరైనా ప్రమాదం సంభవిస్తే అటువంటి వారికి ఉచిత చికిత్సను కల్పించడం జరుగుతుంది. అటువంటి ప్రమాదాలలో ఎవరైనా మరణించినా లేదా శాశ్వత అంగవైకల్యానికి గురైనా అటువంటివారికి నష్టపరిహారం క్రింద 50,000 రూ॥లు చెల్లించే ఏర్పాటు గావించడమైనది. అంతేకాకుండా పనిచేస్తున్న కూలీలలకు పని జరిగే ప్రదేశంలో అనేక వసతులు విధిగా సంబంధిత అధికారులు కల్పించాలి. ఇందులో ప్రధానంగా త్రాగునీరును సమకూర్చటం, ఆరు సంవత్సరాల లోపు చిన్నపిల్లలు కనీసం 5 మంది వుంటే వారిని చూసుకోవడానికి ఆయాను నియమించాలి. పని ప్రదేశంలో గాయాలు తగిలినప్పుడు కట్టు కట్టడానికి అవసరమైన ప్రథమ చికిత్స పెట్టెను అందుబాటులో వుంచాలి.

ఈ విధంగా గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఇతర రాష్ట్రాలకన్నా అగ్రగామిగా వుండటమే కాకుండా ఆదర్శంగా వుంది. కాని ఈ కార్యక్రమం అమలులో అవినీతి అవకతవకలు, పొరపాట్లు, అపశ్రుతులు చోటుచేసుకున్నా యనే వార్తలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా డబ్బులు చెల్లించకుండా సిబ్బంది స్వాహా చేయడం, మృతుల పేరుతో జాబ్ కార్డులు సృష్టించి మస్టర్ రోళ్ళతో వాళ్ళు పనిచేసినట్లు కూలీ డబ్బులు కూడా తీసుకొన్నట్లు రికార్డుల్లో సృష్టించడం, ఎక్కువ పనులు కాగితాలకే పరిమితం కావడం, తక్కువ పనిచేసి ఎక్కువ పనిచేసినట్లు చూపించడం, అధిక బిల్లులు చెల్లించడం లాంటి సంఘటనలతో పాటు బ్రాంచి పోస్టు మాస్టర్లు వాస్తవంగా చెల్లించవలసిన వేతనాల కన్నా తక్కువ వేతనాలు చెల్లించడంలాంటి సంఘటనలు అక్క డక్కడ చోటుచేసుకున్నాయి. మరికొన్నిచోట్ల చేసిన పనులకు మరలా చేసినట్లు, పనుల నాణ్యతలో కూడా లోపాలున్నట్లు, గ్రామసభ ఆమోదం లేకుండా పనులు చేపట్టినట్లు సామాజిక తనిఖీ (సోషల్ ఆడిట్) ద్వారా తెలిసింది. అంతేకాకుండా వేతనాలు చెల్లింపులో జాప్యం, కనీస వేతనాల కన్నా తక్కువ చెల్లించడం లాంటి సంఘటనలు జరిగినట్లు సామాజిక తనిఖీలో బయట పడ్డాయి.

గ్రామీణ ఉపాధి హామీ పథకం పూర్తి పారదర్శకతతో అమలు కావాలని మార్గదర్శకాలు వున్న వాటిని తుంగలో తొక్కి దుర్వినియోగానికి పాల్పడటానికి ప్రజలలో అవగాహన, సంఘటితశక్తి, పథకం అమలులో భాగస్వామ్యం లేకపోవడం వంటివి కొన్ని కారణాలుగా పేర్కొనవచ్చు. ఈ లోటుపాట్లతో "ఉపాధి పొందే హక్కు" లాంటి వినూత్నమైన పథకానికి విఘాతం కలుగకుండా మరింత పకడ్బందీగా ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించి గ్రామ సంఘాలను ఏర్పాటుచేసి అమలుకు పరిశీలించి, విశ్లేషించి, లోటుపాట్లను సరిదిద్దగల చైతన్య స్ఫూర్తితో ఆ పథకాన్ని అమలు పరిచే అధికారులలో జవాబుదారీతనం పెంచగలిగితే గ్రామీణ ఉపాధి పథకపు ప్రధాన లక్ష్యం అయిన పేదరికాన్ని నిర్మూలించి గ్రామీణ ప్రాంతాలలో నూతన ఆర్థిక జవసత్వాలకు జీవం పోయవచ్చు.

*

విశ్వనరుడు కారల్ మార్క్స్

నీటిబుడగ వలె
క్షణభంగురమైనా,
క్షణమైనా సరె
వినీల విశాల గగనమున
జ్వాజ్వలోజ్వలమై వెలిగే
విద్యుల్లత వలె,
లక్షల లక్షల వర్షములై
పరిభ్రమించే
అనంత విశ్వమునే
విశదము చేసిన
అఖండ జ్ఞానం
'మానవ మేధ' అని
హర్షము తెలిపి
హారతు లెత్తెను
రవీంద్రుడు
కవీంద్రుడు
విశ్వకవీంద్రుడు
రవీంద్రుడైనా,
కవీంద్రుడైనా,
విశ్వకవీంద్రుడైనా
నరుడే కాదా!
నరులకు కలిగే
ఆవేశాలను,
ఆక్రోశాలను,
కష్టాలను,
కన్నీళ్ళను
కని కరిగాడు
ఒక నరుడు
అతడే విశ్వనరుడు
కంటికి కునుకే ఎరుగక
పఠించి, మథించి
శోధించాడొక మార్గం.
శోకించే శ్రామికులతో
అయినాడు మమేకం
మమేకమయ్యి చూపిన
మార్గం, మార్క్సిజం
కవితా గీతితొ
అందరి మనసులు
గెలిచాడు, రవీంద్రనాథ్
సమతా రీతిలొ
హృదయములందున
నిలిచాడు, కారల్ మార్క్స్
విస్తృత, వికాశ ప్రణాళికతో
కలలు, కల్లలుకాని
కమ్యూనిస్టు ప్రణాళికతో
జోతలందెను, జగత్ప్రసిద్ధుడు
కారల్ మార్క్స్
కరుణామూర్తులు
జీసస్, బుద్ధుడు,
బుద్ధి వెట్టినా
క్లేశ కారణం
కానరాకపోయె.
కనుగొన్న కారణం
కల్లగ తేలె.
కరుణామూర్తుల
పట్టికలోనే
వారు మిగిలిపోయె.
ప్రపంచ మార్గం
ప్రాణుల మార్గం
ప్రాణులలోన ప్రముఖుడు అయిన
ఈ మనుషుని తత్వం,
అచ్చెరువయ్యి
చిచ్చిరపిడుగై
చిచ్చులు రేపెను
తాత్విక మదిలో.
నిర్వచించిరి, ప్రవచించిరి
అపుడు తాత్వికులెందరొ.
నిర్వచనాలూ, ప్రవచనమ్ములూ,
మార్పులు తేవని
తెగేసి చెప్పెను
కార్మిక వీరుడు
కారల్ మార్క్స్
ప్రపంచమున్నది
తలకిందులుగా
తిన్నగ తిప్పుటె
తగునని పలికెను
తాత్వికోన్నతుడు
కారల్ మార్క్స్
అర్థ శాస్త్రమునకు
అర్థము మార్చి,
అద్దం పట్టెను
కారల్ మార్క్స్
విశ్వశాంతికై
నిత్యము తపించె
విప్లవ వీరుడు
కారల్ మార్క్స్

డా॥ డి.ఎల్. విద్య
అసిస్టెంట్ ప్రొఫెసర్, గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్, కాకినాడ

పెరుగుచున్న వ్యవసాయ కార్మికులు-తరుగుతున్న ఉపాధి అవకాశాలు

ఎం.సి. వెంకటేశ్వర్లు *

స్వాతంత్ర్యం తరువాత పారిశ్రామికాభివృద్ధి జరిగినప్పటికి, నేటికీ మన దేశ జాతీయ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయరంగం ప్రధాన పాత్రవహిస్తున్నది జాతీయాదాయం 21 శాతం మేర ఉన్నప్పటికి దేశ జనాభాలో సుమారు 60శాతం మందికి పైగా వ్యవసాయరంగం మీద ఆధారపడి జీవిస్తున్నారు. రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా లెక్కల ప్రకారం 1951లో దేశ జనాభా 36.11 కోట్లు కాగా గ్రామీణ జనాభా 29.86 కోట్లు. అందులో 7 కోట్లమంది వ్యవసాయ సాగుదార్లు, 2 కోట్ల 73 లక్షలు వ్యవసాయ కార్మికులు. 1991 నాటికి దేశ జనాభా 84.63 కోట్లకు పెరగగా గ్రామీణ జనాభా 62.87 కోట్లకు చేరింది. అదే విధంగా వ్యవసాయదారులు 11 కోట్లకు, వ్యవసాయ కూలీలు 7కోట్ల 46 లక్షలకు పెరిగారు. 2001 జనాభా లెక్కల ప్రకారం దేశ జనాభా 102.8 కోట్లు కాగా, దశాబ్ద కాలంలో వ్యవసాయ కార్మికుల సంఖ్య 7.46 కోట్ల నుండి 10.74 కోట్లకు చేరింది. ఇదే సందర్భంలో మన దేశంలో కులవ్యవస్థ పాతుకపోవడంతో దశాబ్దాలుగా సామాజిక, ఆర్థికరంగాలలో దోపిడీకి గురైతున్న షెడ్యూల్డు కులాలు, 33.4 శాతం షెడ్యూల్డు తెగలు 13.3 శాతం వ్యవసాయ కార్మికులుగ జీవనం సాగిస్తున్నారు. ఎస్.సి, ఎస్.టి.లతోపాటు మైనారిటి వర్గాలు కూడా అధిక సంఖ్యలో వుండటం గమనార్హం.

ప్రపంచీకరణ ఆర్థిక విధానాల ఫలితంగా అభివృద్ధి చెందుచున్న దేశాల ఉత్పత్తుల తాకిడికి వ్యవసాయరంగం నాశనం కావడం, గిట్టుబాటు ధరలులేక, అప్పుల బాధలు తట్టుకోలేక చిన్న, సన్నకారు రైతులతోపాటు దిగువ, మధ్యతరగతి రైతులు దివాళా తీయడంతో వ్యవసాయ కార్మికుల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతున్నది. వీరితో పాటు గుత్తపరిశ్రమల పోటీకి, ఆర్థిక మాంద్యం ఫలితంగా చిన్న పరిశ్రమలు దివాళాతీయడంతో ఉపాధి కోసం పట్టణాలకు వెళ్ళిన గ్రామీణ యువకులు తిరిగి గ్రామాలకు వచ్చి వ్యవసాయ కూలీలుగా చేరడం, గ్రామీణ పేదల ఉపాధి అవకాశాల పెంపుకు ప్రభుత్వం నిర్దిష్ట పథకాలను అమలు జరుపలేకపోవడంతో వ్యవసాయ కార్మికులు గణనీయంగా పెరిగిపోతున్నారు.

ఒకప్రక్క వ్యవసాయ కార్మికుల సంఖ్య పెరుగుచుండగా మరోప్రక్క ఉపాధి అవకాశాలు కుదించుకుపోతున్నాయి. దీనిపై నేషనల్ శాంపుల్ సర్వే ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జరిగిన 55వ రౌండ్లో 1983-1994 సంవత్సరాలలో 2.7 శాతంగా వున్న ఉపాధి అవకాశాలు 1996-2000 సంవత్సరాల నాటికి 1.07 శాతానికి దిగజారినట్లు వెల్లడైంది. గ్రామీణ పేదల ఉపాధి అవకాశాలు వ్యవసాయరంగం అభివృద్ధిపై ఆధారపడి ఉంటుదనుట జగమెరిగిన సత్యం. అయినప్పటికి వ్యవసాయ కూలీలలో సగానికిపైగా భూమిలేదు. ప్రభుత్వలెక్కల ప్రకారం 57.33శాతం కుటుంబాలకు భూమి లేక పోగా ఎస్.సిలలో 64.4 శాతం, ఎస్‌టిలలో 48.4 శాతానికి సాగు భూమిలేదు. కొద్దిపాటి భూమి కలిగిన కుటుంబాల భూమి 1987-88 లో ఒక్కొక్క కుటుంబానికి సగటున 0.32 హెక్టారు ఉండగా 1999-2000 సంవత్సరాల నాటికి 0.18 హెక్టారుకు తగ్గిపోయింది. దానితోపాటురెండు దశాబ్దాలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐటి, సర్వీస్ సెక్టారులను భుజాలకెత్తుకొని వ్యవసాయరంగాన్ని పూర్తిగ నిర్లక్ష్యం చేసారు. ప్రభుత్వ పెట్టుబడులను తగ్గించారు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే వ్యవసాయ రంగంలో మొత్తం పెట్టుబడులు జిడిపి నిష్పత్తిలో 1980-81లో 9.9శాతం ఉండగా 2003-2004 నాటికి 6 శాతానికి పడిపోయింది. మొదటి, ఐదు, ప్రణాళికల్లో ఆర్థిక కేటాయింపులు 37.22 శాతాలు కాగా 9, 10 ప్రణాళికలనాటికి 19.8, 16.5 శాతానికి దిగజారింది. దీనితో వ్యవసాయ రంగం స్తంభించడమేగాక తిరోగమనబాట పట్టింది. వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్లను ప్రైవేట్ రంగానికి పూర్తిగా వదలటంతో రైతులు నష్టాలకు గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఆహార పంటల స్థానంలో ఆహారేతర వాణిజ్య పంటలు ఆక్రమించాయి. పశువుల సేద్యం స్థానంలో పూర్తిగా కాక పోయినా ట్రాక్టర్లు, ఊడ్పులు,నూర్పిడియంత్రాలు పనిచేస్తున్నాయి. ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, సరళీకరణ ఆర్థిక విధానాల ప్రభావం వ్యవసాయ కార్మికుల ఉపాది అవకాశాల మీదకూద కూడా పడింది. దీనితో వ్యవసాయ కార్మికులను, నిరక్ష్యరాస్యత, నిరుద్యోగం, పేదరికం, అప్పుల బాధలు, పోషకాహార లోపం వెంటాడుతున్నాయి. ప్రభుత్వాలు ఎన్ని పథకాలు ప్రవేశపెట్టినా వలసలు ఏమాత్రం ఆగడం లేదు.

ప్రపంచం 21వ శతాబ్దంలోకి అడుగిడుతున్న సందర్భంగా ప్రపంచ పేదరిక నిర్మూలనపై 2000 సం॥ జులైలో జపాన్‌లోని "ఒకినావా"లో అభివృద్ధి చెందిన జి-8 దేశాల సదస్సు జరిగింది. ఆ సదస్సు "ఆర్థికంగా పేదలు ఆదాయం వనరుల నుండి దూరం చేయబడడమేగాక, ఉపాధి, ఆరోగ్యం, విద్యావకాశాల నుండి కూడా దూరం చేయబడుతున్నారన్న" అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. అదే సందర్భంలో అన్ని దేశాల ఆమోదంతో అంతర్జాతీయ అభివృద్ధి లక్ష్యాల (ఐడిజిఎస్) చార్టర్‌ను కూడా ఆమోదించారు. దాని ప్రకారం ప్రథమ లక్ష్యంగా 2015 నాటికి ప్రపంచ వ్యాపితంగా దరిద్ర నారాయణుల సంఖ్యను సగానికి తగ్గించటం, సార్వత్రిక ప్రాథమిక విద్యను సాధించటం, శిశు మరణాలు 2 వంతులు, బాలింతల మరణాలను 3 వంతులకు తగ్గించాలని నిర్దేశించారు. అయితే జి-8 దేశాలు పేదరిక నిర్మూలనకు ఏం చేశారు, చేస్తారు అన్న

---

* రాష్ట్ర కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం

విషయాన్ని ప్రక్కనబెడితే ఒకినావా సదస్సు అభిప్రాయం మాత్రం మన దేశానికి సంబంధించినంత వరకు నూటికి నూరుపాళ్ళు వాస్తవం. ప్రధానంగా మన దేశంలో అత్యంత దోపిడీకి గురవుతున్న వర్గం వ్యవసాయ కార్మికులు. ఎస్‌సి, ఎస్‌టిలు అధికంగా వుండుటతో వారిని ఆర్థికదోపిడీ చేయడమే గాక, సాంఘికంగాను అణచివేతలకు గురిచేస్తున్నారు. 1991 నాటి లెక్కల ప్రకారం వ్యవసాయ కార్మికులలో 46 శాతం ఈ రెండు వర్గాలే ఉన్నాయి. ప్రతిరోజు పత్రిక తిరగేస్తే అత్యంత శీఘ్రగతిన అభివృద్ధి చెందుతున్న దేశంగా భారత్ కనబడుతుంది. ప్రపంచ కుబేరులు మొదటి పదిమందిలో మన దేశానికి చోటు దక్కింది. 2006లో 8వ స్థానంలో ఉన్న మన దేశం 2007 నాటికి 4వ స్థానానికి ఎగబాకింది. రిలయన్స్ అధినేతల్లో ఒకరైన ముఖేష్ అంబాని ఆదాయం నిముషానికి 40 లక్షల రూపాయలంటే ఆశ్చర్యపోక తప్పదు. కాని అది పచ్చి నిజం. అదే సందర్భంలో మన దేశంలోని వ్యవసాయ కార్మికుడు రోజుకు 40 రూపాయల కూలీ పొందటానికి 60 సంవత్సరాలు పట్టిందంటే ముక్కుమీద వేలేసుకోక తప్పదు. ఈ నాటికి వ్యవసాయ కార్మికుల కుటుంబాలలో 41 శాతం కుటుంబాల నెలసరి సగటు ఖర్చు 300 రూపాయలకంటే తక్కువ. అంటే 70 శాతం వ్యవసాయ కార్మికులు పేదరికం దిగువున జీవిస్తున్నాయి. 2000-2001 లెక్కల ప్రకారం 13.9 శాతం మంది పోషకాహార లోపంతో బ్రతుకుతున్నారు. 62 సంవత్సరాల స్వాతంత్ర్యం తరువాత కూడా వ్యవసాయ కూలీలు ఎలాంటి చట్ట భద్రత లేకుండా, అభద్రతా భావంతో జీవించవలసిన పరిస్థితులు ఉండటం దురదృష్టకరం. ప్రత్యేకించి 1991 నుండి ఆర్థిక సంస్కరణల అమలుతోపాటు, వాణిజ్య పంటలు పెరగటం, వ్యవసాయంలో యాంత్రీకరణ క్రమంగా చోటుచేసుకోవడంతో చిన్న, సన్నకారు రైతాంగం, వ్యవసాయ కార్మికుల్లో ఈ అభద్రతా భావం మరింత పెరిగింది. రైతు, వ్యవసాయ కూలీల మధ్య వుండవలసిన అవినాభావ సంబంధాలు కాస్త కమర్షియల్ స్థాయికి దిగజారాయి. అదేవిధంగా కమ్యూనిస్టు పార్టీలు సుదీర్ఘ కాలం పోరాటాలు చేసి సాధించిన సంక్షేమ పథకాలు కాస్తా అధికార పార్టీల స్వార్ధ రాజకీయ ప్రయోజనాలకు, అధికార యాంత్రాంగం అవినీతికి కేంద్ర బిందువులుగా మారాయి. పంచాయతీ సర్పంచ్ మొదలు, పార్లమెంట్ సభ్యులు, మంత్రుల వరకు ప్రజలందరకు జవాబు దారులుగా ఉండవలసి ఉన్నప్పటికి అధికారవ్యామోహంతో, ఓటు బ్యాంకును పదిలం చేసుకోవటానికి ప్రభుత్వ నిధులన్నిటిని స్వంత పార్టీ అనుయాయులకు, తాబేదారులకు కట్టబెట్టడమే గాక, తమ జేబులు నింపుకోవడానికి వెనుకాడడంలేదు. అత్యంత ప్రతిష్ఠాత్మ కంగా ప్రారంభించిన గ్రామీణ ఉపాధి హామీ పథకం సైతం అవినీతి, పాలక పార్టీల స్వార్థ రాజకీయ ప్రయోజనాలకు బలికావడంతో ప్రజల్లో అనాసక్తికి దారితీసింది. పేదప్రజల అభివృద్ధికోసం ఖర్చు చేసే నిధులు నిజమైన లబ్ధిదారులకు కేవలం 20 పైసలు మాత్రమే అందుతున్నాయని, కీ.శే. మాజీ ప్రధాని రాజీవ్‌గాంధి చెప్పిన మాటలు నేటికీ అక్షరసత్యాలు. గత ఐదు సంవత్సరాలలో రాష్ట్రంలో హద్దులు మీరిన అవినీతి, ఎంపి లాడ్స్ నిధుల దుర్వినియోగం ఇందుకు నిదర్శనం.

సామాజికంగా పాతుకుపోయిన కుల విభజన పేదరిక నిర్మూలనకు జాతీయాభివృద్ధికి ఆటంకంగా ఉన్నాయనుట అవాస్తవం కాదు. ప్రత్యేకించి వ్యవసాయ కార్మికుల్లో ఎస్.సి., ఎస్.టి., ఇతర బలహీన, మైనారిటీ వర్గాలు సుమారు 80 శాతం ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయినప్పటికి ప్రభుత్వ లెక్కల ప్రకారం ఎస్.సి.లలో 64.4 శాతం, ఎస్.టిలలో 48.4 శాతానికి భూమి లేదు. ప్రజా ఉద్యమాల తాకిడికి తట్టుకోలేక, ప్రజాగ్రహం నుండి తనను తాను కాపాడుకోవడానికి ప్రభుత్వాలు భూసంస్కరణ చట్టాలు తెచ్చినా భూ పంపిణీలో సామాజిక అణచివేతలకు గురవుతున్న వర్గాలకు పంచింది స్వల్పమని చెప్పక తప్పదు. ఈనాటికి ఫ్యూడల్ భూస్వామ్య అవశేషాలు బలంగా ఉండుటతో అత్యధిక భాగం భూమి అగ్రవర్ణ ధనిక వర్గాల చేతిలోనే ఉంది. అదే విధంగా రాజకీయాధికారం, పరిశ్రమలు, వ్యాపారాలు సైతం వారి చేతిలోనే ఉండుటచే దళిత, బలహీన, మైనారిటీ వర్గాలు జాతీయాభివృద్ధి కార్యక్రమాలలో సంపూర్ణ భాగస్వాములు కాలేక పోతున్నారు. అఖిల భారత వ్య.సా.కా. సంఘం (బికెయంయు) జరిపిన సుదీర్ఘ పోరాటాల ఫలితంగా సమగ్ర వ్యవసాయ కార్మిక చట్టం ముసాయిదా బిల్లు 1980లో తయారయినప్పటికి ఇప్పటికీ బలంగా ఉన్న ఫ్యూడల్ వర్గాల ప్రతిఘటనతో నేటికీ చట్టానికి నోచుకోలేదు. 2000 సంవత్సరం జనవరి 18న జరిగిన అన్ని రాష్ట్రాల ప్రభుత్వ కార్మిక శాఖల మంత్రుల సమావేశంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావడంతో కేంద్ర ప్రభుత్వం బిల్లును ప్రక్కన పెట్టింది.

ఈ పరిస్థితుల్లో బలమైన వ్యవసాయ కార్మికోద్యమాలతో పాటు సంఘ నిర్మాణం అవసరం. సామాజిక న్యాయం, రాజ్యాధి కారం పేరుతో అనేక దళిత, బలహీనవర్గాల సంఘాల ఉద్యమాలు ముందుకు వస్తున్నాయి. అయితే వాటికి పాక్షిక ప్రయోజనాలు తప్ప ఆర్థిక, సామాజిక సమస్యలపై స్పష్టమైన వర్గ దృక్పథం లేకపోవడంతో నిలదొక్కుకోలేకపోతున్నాయి. ఈ అవకాశాలను ఉపయోగించుకోవలసిన అవసరం వామపక్ష వ్యవసాయ కార్మిక సంఘాలముందున్నది. కేవలం భూసమస్యే ప్రధాన అజెండా అయినప్పటికీ కుల వివక్షతకు వ్యతిరేకంగా, సాంఘిక సమానత్వం కోసం జరిగే ఉద్యమాలలో అగ్ర స్థానంలో ఉన్నప్పుడే దళిత వర్గాలలో విశ్వాసం ఏర్పడుతుంది. అదేవిధంగా వ్యవసాయ కార్మి కుల నిరుద్యోగ సమస్య పరిష్కారం భూసమస్యతోనే సాధ్యం కాదు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయాధారిత పరిశ్రమల స్థాపనకు ఉద్యమించవలసిన అవసరం తక్షణ సమస్యగా వ్య.సా.కా. సంఘాల ముందున్నది. ఉపాధి అవకాశాలను పెంచే ప్రభుత్వ పథకాలైన ఎంప్లాయిమెంట్ ఎస్యూరెన్స్ స్కీం, అసంఘటిత కార్మికుల సామాజిక భద్రత బిల్లు 2006, గ్రామీణ ఉపాధి హామీ పథకం తదితర పథకాలను సక్రమంగా అమలు జరిపించు కొనుటకు అన్ని వర్గాల ప్రజలను ప్రత్యేకించి యువకులను, మహిళలను సుదీర్ఘ పోరాటాలకు సమాయత్తం చేయవలసిన బాధ్యత వ్యవసాయ కార్మిక సంఘంమీద ఉన్నది. *

ఇస్లామిక్ తీవ్రవాద మూలాలు-పరిణామం

సాదియ దెహిల్వి

తీవ్రవాదాన్ని నిరసిస్తూ ముస్లిములందరూ చిత్తశుద్ధితో, సమైక్యంగా తమ స్వరం వినిపించవలసిన సమయమాసన్నమయింది.

పాకిస్తాన్‌లో శ్రీలంక క్రికెటర్లపై దాడితో తీవ్రవాద నగ్న స్వరూపం మరొకసారి బహిర్గతమయింది. ముంబయి, లాహోరు నగరాలపై దాడులు, బహిరంగ ప్రదేశాలలో ఉరితీతలు, వెయ్యి మందికిపైగా శ్వాట్ (Swat) లోయలో చంపివేయటం లాంటివి ఇస్లామిక్ రాజకీయాలతో మనుగడ సాగిస్తున్న తాలిబాన్ తరహా తీవ్రవాద గ్రూపుల భయానక భీభత్సకాండకు కొన్ని ఉదాహరణలు మాత్రమే. హింసాకాండ చట్టబద్ధమే ననిపించుకునేందుకు పవిత్ర మతగ్రంథాలకు పెడర్థాలు చెప్పుతున్న ఇస్లామిక్ రాజకీయ వాదులను ప్రపంచ వ్యాప్తంగా నున్న ముస్లిం సమాజాలు ఖండించటం నేటి తక్షణావసరం. ఈ రకమైన ఇస్లామిక్ సిద్ధాంతం మధ్యే మార్గం, ఆధ్యాత్మిక ఇస్లామిక్ సిద్ధాంతాలను (Moderate and spiritual islam) తొలగించే ప్రమాదముంది. ఆ ప్రమాదం అనేక సమాజాల నిర్మూలనకు, స్త్రీల, మైనారిటీల అణచివేతకు దారి తీస్తుంది.

తమ సమాజాల రాజకీయ, ఆర్థిక, సామాజిక పురోభివృద్ధికి కృషి చేయటం ముస్లింల నైతిక బాధ్యత. తీవ్రవాదాన్ని నిరసిస్తూ, తీవ్రవాదానికి, ఇస్లాంకు ఏ రకమైన సంబంధం లేదని ప్రకటిస్తున్న భారతీయ ముస్లిం మతపెద్దల విశిష్ట మార్గాన్ని ప్రపంచంలో మిగిలిన ముస్లిం సమాజాలు అనుకరించటం ఉత్తమం. ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్‌లలో తాలిబాన్ల దురాగతాలు, రాజకీయ నాయకులను హత్యచేయటం, అపహరించటం, కాశ్మీరులో తీవ్రవాద చర్యలు, ఇరాక్, పాకిస్తాన్లలో షియాలు, సున్నీల పరస్పర దాడులు, ఇజ్రాయిల్, పాలస్తీనాల మధ్య ఘర్షణలో ఆత్మాహుతి దళాల దాడులను బలపరుస్తూ ఫత్వాలు జారీచేయటం లాంటి చర్యల వలన అనేకమంది అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారు. అలాంటి చర్యలను చిత్తశుద్ధితో, అంతర్జాతీయంగా సమైక్యంగా నిరసించటం అత్యవసరం. మన నిరసన డానిష్ కార్టూన్‌పై నిరసనలాగా కొన్నిటికే పరిమితమైతే మనం విశ్వసనీయతను కోల్పోతాము.

దిటైమ్స్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో
అనువాదం: పి.ఆర్.ప్రకాశరావు

ఇస్లామిక్ రాజకీయ పోరాటం పీడకులపై పోరాటం అనే నినాదంతో జీవశక్తిని పొందుతోంది. కాని అదే స్వయంగా పీడించే శక్తిగా మారింది. కొన్ని ఇస్లామిక్ గ్రూపులు హింసాకాండను వ్యతిరేకిస్తున్నాయి. ప్రజాస్వామ్య సూత్రాలను అంగీకరిస్తున్నాయి. స్త్రీల, మైనారిటీల హక్కుల విషయంలో మార్పును కొంత మేరకు అంగీకరిస్తున్నాయి. అయినా అవి మొత్తం మీద సనాతనవాదన గ్రూపులుగానే మిగిలిపోతున్నాయి. జోర్డాన్లో ఇస్లామిక్ పార్టీ స్త్రీలకు విడాకుల హక్కును అంగీకరించదు. స్త్రీల ఓటు హక్కుకు వ్యతిరేకంగా కువైట్ ఇస్లామిస్టులు పోరాడుతున్నారు. ఈజిప్టులో బ్రదర్‌హుడ్ కమ్యూనిటీ (BROTHER HOOD COMMUNITY) స్త్రీలు, మైనారిటీ వర్గాలవారు దేశాధినేతలు కారాదంటుంది. అనేక ముస్లిం దేశాలలో ప్రభుత్వాల అణచివేత వలన ఏర్పడుతున్న రాజకీయ శూన్యత కారణంగా ఇస్లామిక్ తీవ్రవాద గ్రూపులు బలపడుతున్నాయి. తీవ్రవాదం ప్రధానంగా ముస్లిం సమస్య. అయినా ముస్లిములకేకాక ఇతరులకు సైతం ప్రమాదకారిగా తయారయింది. అమాయకుల ప్రాణాలు తీసినా నేరుగా స్వర్గానికి వెళతారని తీవ్రవాదులు చెపుతున్నందున ఆధ్యాత్మిక (Spiritual) సమస్య ఇందులో ఇమిడి ఉన్నదని మనం గుర్తించాలి. తీవ్రవాదానికి విదేశాల విపత్కర విధానాలు కారణమని నిందించటం ఆపివేయాలి.

నేటి ఇస్లామిక్ తీవ్రవాద గ్రూపులన్నిటికీ అరేబియా ద్వీపకల్పంలోని నెజ్డ్ (NEJD) ప్రాంతానికి చెందిన అబ్దుల్ వాహబ్ సిద్ధాంతమే ప్రాతిపదిక. ముస్లింలు ఇస్లామిక్ మార్గాన్ని వదిలివేసి దారి తప్పారని అనుకున్న వాహబ్ వారిని సుద్ధిచేయాలని (purify) ప్రయత్నించాడు. ఆ ప్రయత్నంలో వాహబ్ అనుయాయులు విగ్రహారాధనకు నిలయాలని చెప్పి అనేక పవిత్ర కట్టడాలను నాశనం చేశారు. ప్రమాదకరమైనవి, ఎందుకూ కొరగానివని చెప్పి అనేక కళాఖండాలను నాశనం చేశారు. వాహబ్ తన ఉత్తర్వులు పాటించని వారిని చంపివేయటానికి, వారి ఆస్తులను దోచుకోవటానికి, స్త్రీలపై అత్యాచారాలను అనుమతించాడు. ఆకాలంలో మక్కా, మదీనాలలో ప్రపంచం నలుమూలల నుండి వచ్చిన ఆలోచనాపరులైన సూఫీలు వుండేవారు. వారు వాహబ్‌ను మత విరోధిగా (HERITIC) పరిగణించారు.

1774-75 సంవత్సరంలో సౌద్‌లు (SAUD) అనే సంచార తెగతో తన సిద్ధాంతాలను వారు అమలు జరిపేటట్లు, వారి రాజకీయ ఆధిపత్యాన్ని తాను గుర్తించేటట్లు వాహబ్ ఒక ఒడంబడికను కుదుర్చుకున్నాడు. నేటి సౌదీఅరేబియా రాజవంశపు పూర్వీకులే నాటి సౌద్ సంచారతెగ.

నేడు సౌదీలలో అత్యధికులు వాహబ్ అనే పేరునే అంగీకరించరు. వారు ముదహుద్దీన్లమని (దేముడొక్కడే అని నమ్మేవారు) లేక మహమ్మద్ ప్రవక్తకు సన్నిహితుడు, పూజనీయుడు అయిన సలాఫి అనుచరులమని చెప్పుకుంటారు. పసికర్ల రోగికి లోకమంతా పచ్చగానే కనపడినట్లు నేటి ఇస్లామిక్ తీవ్రవాదం తలకెక్కినవారు ఏ మత సత్యాలను గుర్తించలేరు. ఈ తీవ్రవాద ఇస్లామిజానికి సూఫీలతోను, సంగీత, సాహిత్యాలతోను ప్రపంచ వ్యాప్తంగా అసంఖ్యాకంగా నున్న ముస్లిం సాంస్కృతిక, పూజా ఆచారాలతో ఏ రకమైన సంబంధమూలేదు.

సౌదీ అరేబియా ప్రాపకంతో వాహబిజం క్రమంగా బలపడింది. అబ్దుల్ మావ్‌దోది (MAWDODI) అనే జర్నలిస్టు శాస్త్రీయ రూపానికి భిన్నంగా ఖురాన్‌ను అనువదించి వాహబ్ సిద్ధాంతాన్ని ప్రచారం చేశాడు. మావ్‌దోది జమాత్-ఇ-ఇస్లామి అనే రాజకీయ పార్టీని పాకిస్తాన్లో స్థాపించాడు. ఇస్లామిక్ బోధలకు జీహాద్ (JIHAD)ను కేంద్రంగా తీసుకున్నాడు. ముస్లిమేతరులను విశ్వాసం లేనివారుగా (infidels) ప్రకటించాడు. ముస్లింలను పూర్తిగా లేక నిజమైన ముస్లింలని, పాక్షిక ముస్లింలని రెండుగా విభజించాడు. ప్రభుత్వాలను పట్టుకోవాలని, యావత్తు ప్రపంచ వ్యవస్థనే మార్చివేయాలనే వాహబ్ సిద్ధాంతాలకు ఈజిప్టులోని ముస్లిం బ్రదర్‌హుడ్ (MUSLIM BROTHER HOOD) పార్టీకి చెందిన సయద్ ఖుతూబ్ తీవ్రంగా ప్రభావితుడయ్యాడు. ఈ గ్రూపులు తమ అనుచరులను రాజకీయ తిరుగుబాట్లకు, సాంప్రదాయ పండితుల భావాలను తిరస్కరించేందుకు సిద్ధం చేశారు. ఒసామాబిన్ లాడెన్ ఉపాధ్యాయులలో సయ్యద్ కుతూబ్ సోదరుడు కూడా వున్నాడు. ఇస్లాంకు కేంద్ర స్థానాలైన మక్కా, మదీనాలలో నేడున్నది వహబ్ సిద్ధాంతమే. దానిని సౌదీలు అనేక కోట్లు వెచ్చించి తమ కార్యక్రమాల ద్వారా బలోపేతం చేశారు. ముస్లిమేతరుల యెడలనేకాక, షియాలు, సున్నీ, సూఫీలను, ఇతర ముస్లిం సాంప్రదాయాలను సైతం వీరు సహించరు. సౌదీపాలకులు శ్మశానాలను బుల్‌డోజర్లతో నాశనం చేయటాన్ని, సాంస్కృతిక, మతపరమైన వారసత్వ సంపదను నాశనం చేయటాన్ని, మదీనాలోని ప్రవక్త మసీదులో లైంగిక వివక్షతను (CERTAIN SEGREGATION OF SEXES) తీవ్రవాద సాహిత్యాన్ని మసీదుల వెలుపల అమ్మటాన్ని, విశ్వాసంలేనివారిని, మతాచారాలను మార్చుతున్నారని చెప్పి చంపివేయమని తీవ్రవాదులకు బోధిస్తూ ఫత్వాలు జారీ చేయటాన్ని ముస్లిం సమాజం సమైక్యంగా నిరసించకపోవటం దురదృష్టం. ముస్లిం సమస్య ముస్లిం ప్రపంచం లోనే ప్రారంభమయింది. అందువలన దానిని పరిష్కరించు కొనవలసిన బాధ్యత మనమీదనే వున్నది.

ఇస్లాంను శాంతియుతమైన మతంగా చూపలేకపోవటం ప్రపంచ ముస్లిం సమాజాల ఉమ్మడి వైఫల్యం. హింసను, సాంఘిక దురభిమానాన్ని ఖండించటంలో మన స్వరాన్ని పెంచటంతోను, స్త్రీల హక్కులను బలపరచటంతోను మన కృషిని ప్రారంభించ వచ్చు. ఇతరులను అవిశ్వాసకులుగా ప్రకటించి వారిని రాక్షసులుగా చిత్రీకరించటం మానుకోవాలి. ముస్లిం దేశాలలోని ప్రజాస్వామ్య ఉద్యమాలను బలపరచాలి. శాంతికాముకులు, ఇస్లాం యెడల అంకితభావం గల ముస్లిం సమాజం, ఇంతకాలం పాటిస్తున్న మౌనానికి స్వస్తి చెప్పి, ఇస్లాంపై గొంతు వినిపించవలసిన సమయమిదే. మన ప్రతినిధులుగా చెప్పుకుంటున్న తీవ్రవాదుల గొంతుకంటే మనగొంతు పెద్దగా వినిపించాలి. *

కారల్ మార్క్స్‌కి ఆహ్వానాలు

కలలే నిండిన కార్మిక వర్గం
ఆతుర పడుతూ కమ్యూనిజంకై
మొహాలు ఎత్తి మోదం చూపి,
ప్రమోదమంది చేతులు చాచి,
రా రమ్మందా యోధుణ్ణి.
జై, జై, అందా విజయుడికి
సై, సై అందో సమరానికి.
క్రౌర్యం నిండిన విరోధి వర్గం
ధైర్యం చాలని దోపిడి వర్గం
గజ, గజ, గజ, గజ వణికింది.
జైళ్ళని అగ్నీ బార్లా తెరిచి,
రా రమ్మందా ధీరుణ్ణి.
నిషేధాలనే నిండుగ కూర్చి
నోరెత్తిందా కార్మిక వీరుని
నిండుగ తొణికే వివేకానికీ,
మెండుగ వెలసిన విశ్వాసానికీ,
నివ్వెరపడుతూ, నిరుత్తరమవుతూ,
వినలేనందా విజ్ఞతని
కనలేనందా సూర్యుణ్ణి
మనలేనందా వాదంతో
ఫో, ఫొమ్మందా వీరుణ్ణి.

డా॥ డి.ఎల్. విద్య
అసిస్టెంట్ ప్రొఫెసర్, గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్, కాకినాడ

ఇరాక్, ఆఫ్ఘనిస్థాన్‌లలో యుద్ధాలే అమెరికాలో నేటి దుస్థితికి మూలకారణం

ఆర్.ఎస్. యాదవ్

అన్ని విధాలా శక్తివంతమైన, ప్రపంచ ఏకైక అగ్రరాజ్యంగా వున్న అమెరికా ఇప్పుడు మాంద్యం కింద మూలుగుతోంది. ప్రపంచంలోనే అగ్రస్థానంలో వుండే దాని బ్యాంకులు, ఆర్థిక సంస్థలు పేకమేడల్లా కుప్పకూలిపోయాయి. ఈ దేశం ముందుగా సబ్‌ప్రైమ్ సంక్షోభాన్ని ఎదుర్కొంది. బ్యాంకులకు తమ గృహరుణాలను తిరిగి చెల్లించడంలో సామాన్య పౌరులు బకాయిపడడంతో ఈ సంక్షోభం ఏర్పడింది. అది అనతికాలంలోనే ఆర్థిక సంక్షోభంగా మారింది. అది సెప్టెంబరు 2008లో వరుసగా అగ్రస్థానంలోవుండే సంస్థల దివాలాలకు దారితీసింది. ఆవిధంగా ఈ ఆర్థిక సంక్షోభం మధ్యలో అమెరికా అధ్యక్షుని ఎన్నికల ప్రచారం జరిగింది.

ఆర్థిక సంక్షోభం, అదే సమయంలో కొనసాగిన ఎన్నికల ప్రచారం అమెరికా సమాజాన్ని ఒక కుదుపు కుదిపింది. దాని ఆలోచనాక్రమం, దాని ఓటర్ల అవగాహన, నడవడి, ఎంపిక అన్నీ ఒక విచిత్రమైన, ఆలోచనకందని సంపూర్ణమైన మార్పుకు దారితీసింది. అమెరికా చరిత్రలో మొట్టమొదటిసారిగా ఒక శ్వేతజాతీయేతర బారక్ ఒబామా అమెరికా ప్రెసిడెంటుగా ఎన్నిక య్యారు. అమెరికా జాతి వివక్షత సమాజంలో ఇదొక అసాధారణ మైన విన్యాసం.

ఈ ఆర్థిక సంక్షోభం, అసలైన ఆర్థిక వ్యవస్థకు విస్తరించింది. అమెరికాలోని భారీ పారిశ్రామిక, సేవా సంస్థలు సైతం భారీ నష్టాలతో తీసుకుంటున్నాయి. వాటి ఉత్పత్తి లక్ష్యాలకు కోత పెట్టు కుంటున్నాయి. ముఖ్యంగా వాటి వస్తు తయారీ ఫ్యాక్టరీలను మూసివేస్తున్నాయి. పెద్ద ఎత్తున రిట్రెంచ్‌మెంట్లకు, లే-ఆఫ్‌లకు పాల్పడుతున్నాయి. గత ఏడాది కాలంలో దేశం మాంద్యంలో వున్నదని అమెరికా ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. 2008లో 27.5 లక్షలకంటే ఎక్కువమంది కార్మికులు తమ ఉ పాధులను కోల్పోయారు. తాజా సమాచారాన్ననుసరించి, 2008 డిసెంబరులో 6.79 లక్షల కార్మికులు, 2009 జనవరిలో 6 లక్షలకు పైగా కార్మికులు తమ ఉపాధులను కోల్పోయారు. ప్రస్తుత పరిస్థితి ఏమిటంటే ప్రతిరోజూ సగటున దగ్గరదగ్గరగా 17,000 ఉపాధులు అమెరికా కోల్పోతోంది.

ఈ ఆర్థిక సంక్షోభ గందరగోళంలో, బ్యాంకులు తదితర ఆర్థిక సంస్థల వైఫల్యాలు, పారిశ్రామిక వస్తువులకు డిమాండు కుంచిం చుకుపోవడం, అమెరికాలో సమగ్రమైన ఆర్థిక సంక్షోభం చోటు చేసుకొన్నదని తెలియజేస్తోంది. ఈ సంక్షోభాన్ని అదుపు చేసేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల మధ్య ఒక ముఖ్యమైన అంశం మన దృష్టి నుండి తప్పించుకొంది. అది అమెరికా ఆర్థిక సంక్షోభం, అధ్యక్ష ఎన్నికలు ఇరాక్‌లో అమెరికా యుద్ధం, ఇరాక్, అఫ్ఘనిస్తాన్, ఇజ్రాయిల్‌లలో కొనసాగుతున్న అమెరికా జోక్యం, ఇతర ప్రాంతా లలో, మధ్య ప్రాచ్యంలో అమెరికా దుందుడుకు విధానాలు చర్యల మధ్య నున్న అంతర్గత సంబంధం.

ఎన్నికల ప్రచార సందర్భంగా ఆర్థిక సంక్షోభంపై ఇరాక్ అఫ్ఘనిస్తాన్ తదితర ప్రాంతాల్లో అమెరికా జోక్యంపై చాలా చర్చ జరిగింది. ఆర్థిక సంక్షోభంతో అమెరికా ఓటర్లు అసంతృప్తిగా వున్నారన్నది సుస్పష్టం. అది వారి అభిప్రాయాన్ని మార్చుకునేందుకు, రూపొందించుకునేందుకు తోడ్పడింది. దీనితోపాటే ఇరాక్, అఫ్ఘనిస్తాన్, తదితర ప్రాంతాల్లో అమెరికా జోక్యంవల్ల ఉపయోగం లేదనే అభిప్రాయం కూడా పెద్దఎత్తున చోటు చేసుకొంది. ఈ రెండు అంశాలు కలిసి అమెరికా సమాజ ధోరణిలో ఒక సమూలమైన మార్పును తీసుకొచ్చింది. అది బుష్ శకాన్ని ఖండించేందుకు బారక్ ఒబామా విజయానికి దారితీసింది.

ఆర్థిక సంక్షోభం, ఇరాక్, అఫ్ఘనిస్తాన్‌లలో అమెరికా యుద్ధంపై ఎన్నికల ప్రచారాన్ని బాగా కేంద్రీకరించారు. అయితే ఆర్థిక సంక్షోభానికి, ఇరాక్, అఫ్ఘనిస్తాన్‌లలో యుద్ధానికి మధ్యగల అంతర్గత సంబంధం ప్రజల దృష్టిలో పడకుండా తప్పించుకు పోయింది. నూతన అధ్యక్షుడు అధికారాన్ని చేపట్టిన తరువాతనైనా ఈ అంతర్గత సంబంధంపై జరగవలసిన కేంద్రీకరణ జరగలేదు. అయితే బారక్ ఒబామా తన తొలి ప్రధానమైన విధానప్రకటనలలో ఇరాక్ నుండి అమెరికా బలగాలు ఒక సంవత్సరంలో ఉపసంహ రించబడతాయని సూచించారు. అయితే దానితోపాటే అఫ్ఘనిస్తాన్‌లో మరింత జోక్యానికై ఆయన తన పథకాలను ప్రకటించారు. దీనిని బట్టి అమెరికా ప్రెసిడెంట్ కార్యాలయం కూడా ఆర్థిక సంక్షోభానికి యుద్ధానికి మధ్యగల అంతర్గత సంబంధాన్ని పట్టించుకోకుండా పోవాలి లేదా దానికి పెద్దగా ప్రాధాన్యతనైనా ఇవ్వకుండా ఉండాలి.

అధ్యక్ష స్థానంలో మార్పు ఉన్నప్పటికీ అలాగే ప్రెసిడెంట్ రంగు, జాతిలో మార్పు ఉన్నప్పటికీ, అమెరికా విధానాల కొనసా

గింపును ఇది ప్రతిబింబిస్తోంది. అమెరికా ఖజానాపై, అమెరికా ఆర్థిక వ్యవస్థపై ఇరాక్, అఫ్ఘనిస్తాన్‌లలో అమెరికా యుద్ధం తెచ్చిన లోటు గురించి అమెరికా ప్రభుత్వం, అభిప్రాయాన్ని మలచేవారు తక్కువ చేసి చూపుతున్నారు. ఇరాక్‌లో యుద్ధం ఓ రెండు వారాల్లో అంతమౌతుందని అమెరికా అంచనా వేసింది. అప్పుడు ఇరాక్ చమురును, ఇరాక్ మార్కెట్‌ను పూర్తిగా వాడుకోవచ్చునని భావించింది. దీర్ఘకాలం యుద్ధం కొనసాగిన తరువాత ఇరాక్ చమురుపై, ఇరాక్ మార్కెట్‌పై అమెరికా పట్టు సాధించింది. అయితే యుద్ధంలో గెలవలేకపోయింది.

అయితే చమురు మార్కెట్ అమెరికా కార్పొరేట్ల గుత్తాధిపతుల చేతుల్లోకి వెళ్ళిపోయింది. యుద్ధంపై జరిగే ఖర్చు మాత్రం అమెరికా సామాన్య ప్రజలు భరించాల్సి వస్తోంది. దోచుకున్న సొమ్ము కార్పొరేట్లకు, గుత్తాధిపతులకు వెళ్ళింది. వారు యుద్ధాలపై వర్ధిల్లుతున్నారు. దీని ఫలితంగా అమెరికా సమాజంలో అత్యధిక ఆదాయ అసమానతలు ఏర్పడ్డాయి. యుద్ధం కోసం సామాన్యుడు మూల్యం చెల్లించాడు. అతని ఆర్థిక స్థితిగతులు దిగజారిపోయాయి. అతను తన గృహ రుణాలను తిరిగి చెల్లించలేకపోయాడు. అది సబ్-ప్రైమ్ సంక్షోభం గనుక ఆర్థిక సంక్షోభానికి మూలకారణం అని భావిస్తే, అప్పుడు ఈ సంక్షోభానికి యుద్ధానికి సంబంధం వుందన్న మాట. అమెరికా విధాన నిర్ణేతలు ఆర్థిక శాస్త్రవేత్తలు ఈ సంబంధానికి పెద్దగా విలువ యివ్వటం లేదు.

సద్దాం హుసేన్‌ను పదవీభ్రష్టుణ్ణి చేసి అమెరికా, ఉరితీయగలిగింది. అమెరికా తైనాతీలను ఇరాక్ గద్దెపై కూర్చోపెట్టగలిగింది. ఎంత తక్కువ స్థాయిలోనైనా యుద్ధం కొనసాగుతోంది. అందువల్లనే అమెరికా తన బలగాలను వెనక్కు తీసుకురాలేకపోతోంది. అంతిమంగా యుద్ధంలో ఒక విజయుడు అమెరికా రాలేదని చెప్పడానికి అనేక సూచనలున్నాయి. అది దెబ్బతిన్న దేశంగానే బయటపడే అవకాశాలే ఎక్కువ.

ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్ యుద్ధాలలో అక్కడ అమెరికా జోక్యం కొనసాగుతూ ఉండడంతో అక్కడ వేల సంఖ్యలో మానవ ప్రాణాలను పణంగా పెట్టాల్సి వచ్చింది. అనేక రెట్లమంది ప్రజలు అవయవాలు కోల్పోయి అసమర్థులుగా మారారు. మానవ నష్టాలతోపాటు అమెరికా బడ్జెట్లపై, వ్యక్తిగతంగా అమెరికా పౌరుల బడ్జెట్‌పై మొత్తం అమెరికా ఆర్థికవ్యవస్థపై ఎంతో ప్రతికూల ప్రభావం చూపిస్తోంది. మొదట్లో ఊహించిన దానికంటే యుద్ధంపై ఖర్చు అనేక రెట్లు పెరిగిపోయింది. అమెరికా ఆర్థిక వ్యవస్థపై ఈ ప్రభావాన్ని పూర్తిగా అర్థం చేసుకోలేదు. అంచనా వేయలేదు. ప్రస్తుత సంక్షోభానికి సబ్-ప్రైమ్ సంక్షోభం కారణమని గుర్తిస్తున్నారు. అయితే పైన తెలియజేసినట్లుగా దానికీ, యుద్ధానికి సంబంధం వుంది.

హెచ్చు లోటుతో వున్న అమెరికా ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి, హెచ్చు రుణగ్రస్థత అమెరికా ఆర్థిక వ్యవస్థ యుద్ధాల ప్రతికూల ప్రభావాల గురించి చెప్పకనే చెబుతున్నాయి.

యుద్ధ పరిశ్రమే అమెరికాలో అతి పెద్ద పరిశ్రమ. ఈ పరిశ్రమ ఉద్రిక్త పరిస్థితులున్న కొన్ని ప్రాంతాలుండాలని కోరుకుంటుంది. అలాగే దేశాలమధ్య ఉద్రిక్తతలు సృష్టించేందుకు కూడా కుట్ర పన్నుతుంది. ఆవిధంగా ఈ పరిశ్రమకు మంచి మార్కెట్‌ను ఏర్పాటు చేసుకొంటుంది.

సైనికీకరణ, యుద్ధాలన్నవి ఆర్థిక వ్యవస్థను ఎల్లప్పుడూ నాశనం చేస్తాయి. సామాజికాభివృద్ధిని అడ్డుకొంటాయి. వనరులు ఆవిరైపోవడానికి దారితీస్తుంది. ఆర్థిక వ్యవస్థకు తీవ్రనష్టాన్ని కలుగజేస్తుంది. పౌరులకు కష్టాలను, కడగండ్లను తెచ్చిపెడుతుంది. అమెరికా ఆర్థిక దుస్థితిని చూస్తూ వుంటే అమెరికా సైతం దీనికి మినహాయింపు కాదని స్పష్టమౌతోంది. ✻

తిండిగింజలు పండించే రైతు, భార్యా పిల్లలతో, 'అలోలక్ష్మణా!' అంటూ ఆకలితో మలమల మాడిపోతున్నాడు. సమస్త ప్రపంచానికి సరిపడే బట్టలు నేసే సాలివానికి తన పిల్లలకు ఒళ్ళు కప్పుకునేందుకు గుడ్డముక్క కరువయిపోతోంది. తాపీ పనివాడు, కమ్మరి, వడ్రంగి దివ్యమైన భవనాలు నిర్మిస్తూ కూడా మురికివాడల్లో అస్పృశ్యులకు మల్లే మగ్గుతున్నారు. మరొకవంక పెట్టుబడిదారుడు, దోపిడీదారుడు, పరాన్నభుక్కులు తమ ముచ్చట్లు తీర్చుకునేందుకు కోట్ల కొద్దీ ధనం మంచినీళ్ల ప్రాయంగా ఖర్చుపెట్టేస్తున్నారు. ఈ భయంకరమైన వైరుధ్యాలు, వర్తమాన సమాజపు అసమానతలు, సమాజాన్ని అరాచకంవైపుకి నెట్టేస్తున్నాయి. ఈ పరిస్థితి ఎంతోకాలం ఇలా కొనసాగరాదు.

- భగత్‌సింగ్ (కోర్టు వాఙ్మూలం)

బ్రిటిష్ సామ్రాజ్యంపై సైద్ధాంతిక యోధ వి.జి. కీర్నన్

జాన్ ట్రంప్‌బోర్ *

విక్టర్ గార్డన్ కీర్నన్, ఎడిన్‌బరో విశ్వవిద్యాలయంలో ఆధునిక చరిత్ర బోధనలో ప్రొఫెసర్ ఎమిరటస్. విశ్వవిఖ్యాత చరిత్రకారుల్లో ఒకరుగా గుర్తింపుపొందిన ఆయన ఫిబ్రవరి 17న గుండె పనిచేయటం నిలిచిపోయినందున స్కాట్లాండ్‌లోని స్టోల్, గెలాషీల్స్‌లో స్వగృహంలో కన్నుమూశారు.

ఎడ్వర్డియన్ శకానికి సన్నిహితుడైన ఈ పండితుడి వయస్సు 95 సంవత్సరాలు. 1930నాటి పెను ఆర్థిక మాంద్యం నుండి, భారత ఉపఖండంలో ఒక దశాబ్దంపాటు వలస వ్యతిరేక పోరాటాన్ని తిలకించిన అనుభవంనుండి ఆయన రాడికల్ చైతన్యం పొందారు. బ్రిటిష్ సామ్రాజ్య గొప్ప వీరులలో ఒకరైన జనరల్ గార్డన్ ఆఫ్ ఖార్టుం నుండి ఆయన మధ్యపేరు వచ్చింది. బ్రిటిష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా అగ్రగామి సైద్ధాంతిక పోరాటయోధుల్లో ఒకరిగా కీర్నన్ ఆవిర్భవించారు.

మాంచెస్టర్ దక్షిణజిల్లా ఆష్టన్-ఆన్-మెర్సీలో 1913, సెప్టెంబర్ 4న ఇల్లా, జాన్ ఎడ్వర్డ్ కీర్నన్ దంపతులకు విక్టర్ గార్డన్ కీర్నన్ జన్మించారు. జాన్ కీర్నన్ ప్రైవేటు సంస్థ మాంచెస్టర్ షిప్ కెనాల్‌లో స్పానిష్, పోర్చుగీసు అనువాదకునిగా పనిచేశారు. కూటవాద మత వారసత్వం నుండి కీర్నన్ కుటుంబం వచ్చింది. 1946లో ఏర్పాటుచేసిన కమ్యూనిస్టు పార్టీ చరిత్రకారుల గ్రూపు సభ్యుల్లో అనేకమందిలో సోషలిస్టు భావాలు ఏర్పడటంలో మతాచారాలపట్ల అవిధేయత పాత్ర వహించిందని ఆయన ఉత్తరోత్తరా పేర్కొన్నారు. క్రిస్టీస్ ఓల్డ్ ఆర్గాన్ పేరుతో ఒ.ఎఫ్. వాల్టన్ రాసిన ఒక క్రైస్తవుని చిన్ననాటి కథ సోషలిస్టు సామాజిక వ్యవస్థపట్ల తనలో ఒక అస్పష్టమైన, యువకత్వంలోవుండే సానుభూతిని తనలో కలిగించిందని ఆయన వెల్లడించారు. (అది దారిద్ర్యం అనుభవిస్తున్న ఒక వృద్ధునికథ, అతనికీ ప్రపంచంలో మిత్రుడొక్కరూ లేరు) పెట్టుబడిదారీ వ్యవస్థ పక్కకు నెట్టివేసిన వారి మధ్య సంఘీభావాన్ని పునరుద్ధరించే సాముదాయకత రూపాలను ఆయన సోషలిజంలో చూశారు.

మాంచెస్టర్ గ్రామర్ స్కూల్లో స్కాలర్‌షిప్ విద్యార్థిగావున్న కీర్నన్ ప్రాచీన గ్రంథాలపట్ల అభిరుచి పెంచుకున్నారు. తను అప్పటికే ఇంటివద్ద నేర్చుకున్న ఆధునిక యూరోపియన్ భాషలకు తోడు గ్రీక్, లాటిన్ నేర్చుకున్నారు. మూడు కొత్త స్కాలర్‌షిప్‌లు పొందిన ఉత్సాహంతో కేంబ్రిడ్జి యూనివర్శిటీకి చెందిన ట్రినిటీ కాలేజీలో చేరారు. అక్కడ ఆయన చరిత్రలో (1934లో బి.ఎ, 1937లో ఎం.ఎ) జంట నక్షత్రాల ఫస్ట్ సాధించారు. కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయ విద్యార్థుల్లో రాడికల్ భావాలు బలంగా వున్న కాలంలో కీర్నన్ 1934లో కమ్యూనిస్టు పార్టీలో చేరారు. బ్రిటన్ సంపన్నుల ద్రోహంగా ఆయన పరిగణించిన విషయాలు ఆయనలోని రాడికలిజాన్ని మరింత దృఢపరిచాయి.

"బ్రిటిష్ సమాజానికి స్తంభాలుగావున్న వారు నాజీ కిరాతకులతో చెలిమికై న్యూరెంబర్గ్ పరుగెత్తటాన్ని మనం చూశాం. 'నేషనల్ గవర్నమెంట్' స్పానిష్ రిపబ్లిక్ పోరాటానికి ద్రోహం చేయటాన్ని మనం చూశాం. వర్గ ద్వేషంతో, రియోటింటో వంటి పెట్టుబడిదారులకు లబ్ధిచేకూర్చటానికి, మధ్యధరా ప్రాంతం ఫాసిస్టు సరస్సుగా మారే అవకాశంపట్ల, సామ్రాజ్యం జీవమార్గాలు తెగిపోయే అవకాశంపట్ల కళ్లు మూసుకుని స్పానిష్ రిపబ్లిక్ పోరాటానికి ద్రోహం చేశారు" అని ఆయన **లండన్ రివ్యూ ఆఫ్ బుక్స్** (1987, జూన్ 25)లో వివరించారు.

కేంబ్రిడ్జిలో ఫెలోషిప్ పూర్తిచేశాక కీర్నన్ దక్షిణాసియాలో రాజకీయ కార్యకలాపాలు ప్రారంభించారు. లాహోర్‌లోని సిక్కు నేషనల్ కాలేజీలో అచ్చిసన్ కాలేజీలో బోధన కూడా చేశారు. ఆయన 1938లో నాట్యకారిణి, రంగస్థల క్రియాశీల కార్యకర్త శాంతాగాంధీని వివాహం చేసుకున్నారు. 1946లో ఆయన బ్రిటన్ తిరిగివెళ్లాక వారు విడిపోయారు, కాని స్నేహితులుగా కొనసాగారు. కేంబ్రిడ్జి, ఆక్స్‌ఫర్డ్‌లు త్వరగానే తిరస్కరించటంతో కీర్నన్ 1948లో ఎడిన్‌బరో యూనివర్శిటీలో చేరారు. చరిత్రకారుడు రిచర్డ్ పరెస్ జోక్యంతో అది సాధ్యమైంది. ఈ స్కాటిష్ విద్యాపీఠంలో 1977లో రిటైర్మెంట్ వరకు అధ్యాపకునిగా పనిచేశారు. 1984లో కెనడాకు చెందిన పరిశోధకురాలు, చలనచిత్ర ప్రావీణ్యం కలిగిన హీతర్‌మాస్సెను కీర్నన్ వివాహం చేసుకున్నారు.

మేథో వారసత్వం

యుద్ధానంతరం బ్రిటిష్ మార్క్సిస్టు చరిత్రరచన వికాసానికి కీర్నన్ గొప్పగా దోహదం చేశారు. సామాజిక చరిత్ర అధ్యయనంలో అది పరివర్తన తెచ్చింది.

స్టాలినిజం ఘనీభూతస్థితి నుండి తప్పుకునే మార్గాలు వెదుక్కుంటూ, ఈ మేథో ఉద్యమం పలువురు ప్రముఖుల మూలలనుండి వృద్ధి చెందింది. నల్లజాతి దార్శనికుడు ఇ.పి.

* హార్వర్డ్ లా స్కూలు - కేంబ్రిడ్జి, మాంచెస్టర్‌లో లేబర్ అండ్ వర్క్‌లైఫ్ కార్యక్రమ రీసెర్చి డైరెక్టర్

థాంప్సన్, 17వ శతాబ్దపు రాడికల్ అసమ్మతి దిగ్గజం క్రిష్టఫర్ హిల్, మధ్యయుగాల రాడికల్ రాడ్నీ హిల్టన్, విజ్ఞానసర్వస్వంలాంటి కీర్నన్, ఆదిమకాల తిరుగుబాటు పండితుడు, పెద్ద ఎత్తున ఆర్థిక మార్పుకు కారకుడైన ఎరిక్ హాబ్స్‌బామ్ వంటి మహామేధావులు స్ఫూర్తిదాతలైనారు.

అతివాద సాంస్కృతిక ఆయుధాగారంలో ఉత్తమమైన ఆయుధాలు తమ చేతిలోవున్నాయన్న ఆత్మవిశ్వాసంతో మార్క్సిస్టేతర సాంప్రదాయాలతో వారు అరమరికలులేని చర్చను ఆహ్వానించారు. ఈ సంభాషణలో కొంత **పాస్ట్ అండ్ ప్రజంట్** జర్నల్‌లో వుంది. ఆ జర్నల్ ఆంగ్లభాషా ప్రపంచంలో అత్యంత ప్రతిష్టాత్మకతను సంతరించుకుంది. 1952లో ఆ జర్నల్‌లో తొలి సంచికకు ప్రధాన వ్యాసం రాసిన కీర్నన్, ఆ తదుపరి అనేక గొప్ప వ్యాసాలు రచించారు. 1973 నుండి 1983 వరకు దాని సంపాదకవర్గంలో పనిచేశారు. **న్యూలెఫ్ట్ రెవ్యూ**కు కూడా, ఆ జర్నల్‌లో ఎన్ని మార్పులు వచ్చినప్పటికీ, ఆయన రచనలు చేశారు. స్టువార్ట్ హాల్ ఆ జర్నల్ ప్రారంభ సంపాదకుడు (1960-62) కాగా, పెర్రీ ఆండర్సన్ (1962-82), రాబిన్ బ్లాక్‌బర్న్ (1982-99) సంపాదకులుగా పనిచేశారు.

థాంప్సన్, హిల్, హిల్టన్‌లు ఇంగ్లీషు సామాజిక చరిత్రలో నిష్ణాతులుకాగా కీర్నన్, హాబ్స్‌బామ్ మరింతగా ప్రపంచ ఆకాంక్షలతో చరిత్రకు చిత్రికపట్టారు. కీర్నన్ విశిష్ట దోహదాల్లో కొన్ని ఇలా వున్నాయి :

చరిత్రలో ఉన్నత స్థితిపరులు : మార్క్సిస్టు, రాడికల్ చరిత్రకారులు పెక్కుమంది "దిగువ నుండి చరిత్ర" (కార్మికులు, రైతులు) పై కేంద్రీకరించారు. కీర్నన్ "పై నుండి చరిత్ర" అవగాహనను అభివృద్ధి చేశారు. చరిత్రలో రాచరికాలను, సైన్యాలను ఆయన విశ్లేషించారు. ఉత్తరోత్తర మార్క్సిస్టులు సైనిక చరిత్రను విడనాడినప్పటికీ, కీర్నన్ సైన్యాల్లో ఏంగెల్స్‌కున్న ఆసక్తిని గమనంలోకి తీసుకున్నారు. ఈ కారణంతోనే ఏంగెల్స్‌ను మార్క్స్ కుటుంబం 'జనరల్' అని ముద్దుపేరుతో పిలిచేది.

గెరిల్లాలు, రైతులవట్ల మార్క్స్, ఏంగెల్స్‌లకు అనుమానాలుండేవని కీర్నన్ అంగీకరించారు. 20వ శతాబ్దపు కొందరు ఆకాంక్షిత విప్లవకారులకు, గ్రామీణ తిరుగుబాటుదార్లకు ఇది ఆశ్చర్యం కలిగించి వుండవచ్చు. చారిత్రక మార్పుకు చోదకశక్తిగా ప్రవర్థిత బూర్జువావర్గాన్ని గుర్తించటానికి అనేకమంది సాంప్రదాయక మార్క్సిస్టులు ఎంతో ఆసక్తికనబరిచినప్పటికీ, వారు నిర్దేశించిన ఆధునిక కాల చట్రాల ఆరంభం తర్వాత చాలా కాలం అనేక దేశాల్లో అరిస్టోక్రాటిక్‌వాదులు రాజకీయాధికారం కలిగివుండటాన్ని, అత్యంత ఉత్కృష్ట స్థానంలో వుండటాన్ని ఆయన స్థిరపరిచారు.

భూస్వామ్య ప్రభువర్గాల గూర్చిన, ఆధునిక పెట్టుబడిదారీ విధానం ఆరంభంగూర్చిన, టుడోర్-స్టూవర్ట్ రాచరికాలకున్న సామాజిక పునాదుల గూర్చిన ప్రశ్నలను తిరిగి చర్చించాలని కమ్యూనిస్టు పార్టీ చరిత్రకారుల గ్రూపును కీర్నన్ తన ప్రారంభదినాల్లో ఎలా ఒత్తిడిచేశారో, వెంటపడ్డారో డేవిడ్‌పార్కర్ కొత్త గ్రంథం "**ఐడియాలజీ, అబ్సల్యూటిజం అండ్ ద ఇంగ్లీష్ రివల్యూషన్**" (2008) విశదం చేసింది. 1956లో హంగరి, సూయజ్ వంటి సంక్షోభాల తదుపరి కొద్దికాలానికే ఈ గ్రూపు విచ్ఛిన్నమైంది, కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ గ్రేట్ బ్రిటన్‌కు అనేకమంది రాజీనామా చేశారు. తొలి న్యూలెఫ్ట్ (1956 తరం) ఆవిర్భవించింది.

"దిగువ నుండి చరిత్ర" భావనను విస్తరించటానికి కీర్నన్ ఉత్సాహం చూపినప్పటికీ, వామపక్షం గనుక పాలకవర్గాలను, అధికారం మాయోపాయాలను అవగాహన చేసుకోనట్లయితే విఫలంచెందే అవకాశంగూర్చి ఆందోళన చెందారు. కిరాయికి పనిచేసే సైన్యాల విస్తరణను మాఖియావెల్లి నిరసించగా, పరిపూర్ణ రాచరికాలు తిరుగుబాట్లను అణచివేయటానికి, సామాన్యప్రజలు సాయుధం కాకుండా నివారించటానికి ఆ సైన్యాలను ఎలా ఉపయోగించారో కీర్నన్ చూశారు.

తన కొత్త భావాలకు కీర్నన్ ఫస్ట్ న్యూ లెఫ్ట్ నుండి కొన్నిసార్లు ప్రతిఘటనను ఎదుర్కొన్నప్పటికీ, రెండవ న్యూ లెఫ్ట్ (1968 తరం) వాటిని మరింత బాహాటంగా స్వాగతించింది. పారిశ్రామిక పెట్టుబడిదారీ విధానాన్ని విశ్లేషించటంలో శాస్త్రీయ మార్క్సిజం బలంగా వుంది, కాని రాజకీయాలు, రాజ్యం సిద్ధాంతాలను రూపొందించటంలో ప్రాథమికమైన లోపాలున్నాయని వారికి ప్రాతినిధ్యం వహించే పెర్రీ అండర్సన్ పేర్కొన్నారు.

సామ్రాజ్యవాద పురాణాలు : సామ్రాజ్యవాద భావజాలాలను, దక్షిణాసియన్‌లను, ఆఫ్రికన్‌లు, తూర్పు ఆసియన్‌లు, అమెరికా ఆదిమ జాతీయులను పరిపాలించటానికి శ్వేతజాతి యూరోపియన్ ఆధిక్యతా పూరిత సమర్థనలను కీర్నన్ నిర్విరామంగా ఎండగట్టారు. తమ పరిపాలన అంతకుమునుపటి పాలనలకన్నా ఎంత ఔదార్యపూరితమో చిత్రించటానికి భారతదేశంలో నెలకొనివున్న సామాజిక దొంతర్లను బ్రిటిష్ సామ్రాజ్యవాదులు ఎలా ఉపయోగించుకున్నారో కీర్నన్ ప్రత్యేకించి పేర్కొన్నారు.

"**ద లార్డ్స్ ఆఫ్ హ్యూమన్ కైండ్**" (1969)లో ఆయన ఇలా రాశారు : "ఈ ఇంగ్లీషు పాలకులలోని రాచరిక లక్షణంలో ఆధిక్యత-కాఠిన్యం మూర్తీభవించివుంది. భారతదేశ వాతావరణం దాన్ని కఠినమొనర్చింది. తాము ఇతరులకన్నా ఉన్నతులమని వారు భావించసాగారు. తమను చిన్నచూపు చూస్తున్నారని హిందువులు

ఫిర్యాదుచేస్తే, వారు ఇతరులను ముఖ్యంగా అంటరానివారిని మరింతనీచంగా చూస్తున్న విషయాన్ని ఎప్పుడూ గుర్తుచేసేవారు."

బ్రిటిష్ పాలన దోపిడీగూర్చి థామస్ పైని 1792లో ఇలా వ్యాఖ్యానించారు: "తూర్పు ఇండీస్‌లో ఆంగ్లేయ ప్రభుత్వం ఇప్పుడు నటిస్తున్న భయానక దృశ్యం థగ్గులు, పిండారీలతో మాత్రమే పోల్చదగినది".

1770లో బెంగాల్ కరువు జనాభాలో మూడవ వంతును తుడిచిపెట్టి వుండవచ్చు. అయినా బ్రిటిష్ వలసపాలనను దయాళువుగా చిత్రించటానికి ఉత్సాహం చూపే చరిత్రకారులు లేకపోలేదు. వారిలో ప్రముఖుడు నియల్ ఫెర్గుసన్. 2004లో నాటి హార్వర్డ్ యూనివర్శిటి అధ్యక్షుడు లారెన్స్ సమ్మర్స్ ఆయనకు చరిత్ర పీఠాన్ని జీవితాంతం ఇచ్చి సత్కరించారు. కీర్నన్ రచన "లార్డ్స్ ఆఫ్ హ్యూమన్ కైండ్' ప్రభావం పాలస్తీనియన్ మేధావుల ఆధునిక కాల గ్రంథం **'ఓరియంటలిజం'** (1978)పై వుందని ఎడ్వర్డ్ సైద్ తరచూ పేర్కొన్నారు.

యూరోపియన్ తరహా వలసవాదమొక్కటే చరిత్రలో లేదని గుర్తించిన కీర్నన్, అమెరికా సంయుక్తరాష్ట్రాలు సొంతం చేసుకున్న నయా-సామ్రాజ్యవాద నమూనాలను అన్వేషించి గ్రంథస్థం చేశారు. ఆ రచన, **"అమెరికా, ద న్యూ ఇంపీరియలిజం ఫ్రం వైట్ సెటిల్మెంట్ టు వరల్డ్ హెజమొని"** (శ్వేతజాతి స్థిరావాసం నుండి ప్రపంచ ఆధిపత్యం వరకు) (1978లో ప్రచురితమైన ఈ గ్రంథాన్ని 2005లో హాబ్స్ బామ్ కొత్త పీఠికతో పునర్ముద్రించారు).

పెట్టుబడిదారీ విధానం, మితవాదతత్వం గూర్చిన జనపదం

న్యూలెఫ్ట్ రెవ్యూకు కీర్నన్ రాసిన "మార్క్సిస్టు చరిత్ర సమస్యలు", "పెట్టుబడిదారీ వ్యవస్థ కాపరులు" వంటి వ్యాసాల్లో ఫ్యూడల్ అవశేషాలు, వారసత్వాలు ఆర్థిక వ్యవస్థకు రూపుదిద్దే మార్గాలను దృష్టికి తెచ్చారు. పారిశ్రామిక స్ఫూర్తి గురించి పెట్టుబడిదారులు ఎంతో మాట్లాడతారు. అయితే వారిలో అనేకమంది పారిశ్రామిక పెట్టుబడిని స్పెక్యులేటివ్, అద్దె వ్యాపకాలకు మళ్లించటానికి ఆతృత చూపుతారు.

కీర్నన్ ఇలా వ్యక్తీకరించారు

"ఒక ఫ్యాక్టరీని నడిపే శ్రమదమాదులకన్నా సులభంగా ధనం సంపాదించే మార్గాలు ఎప్పుడూ వున్నాయి. జె.పి. మోర్గాన్ వాల్‌స్ట్రీట్ (స్టాక్ మార్కెట్) పార్లర్‌లో కూర్చుని చుట్టకాలుస్తూ ఏకపాత్రాభినయం చేస్తుంటారు. ధనం ఆయన వద్దకు ప్రవాహంలా వస్తుంది. పారిశ్రామిక ఉన్నతమార్గాన్ని తొలుత కనుగొన్న ఇంగ్లీష్‌వారు, నగరంలో అటువంటి పార్లర్లకొరకు త్వరలోనే ఆ బాటవీడటం ఆరంభించారు. పక్కమార్గాలను, దగ్గరిబాటలను, వలసవాద ఎల్‌డొరాడోస్‌వైపు మరిలారు."

కొత్త ద్రవ్య సంక్షోభంతో పెట్టుబడిదారీ విధానం కుదుపుకుగురికాగా, కీర్నన్ ద్రవ్యపెట్టుబడి అధిరోహణ గూర్చి ఘాటైన వ్యాఖ్యలు చేశారు. "పెట్టుబడిదారీ విధానంలోకి ముందుగా అడుగుపెట్టిన దేశం ఇంగ్లండ్. అది తొలుత వ్యవసాయ దేశం, తదుపరి పారిశ్రామిక దేశం. అయితే పారిశ్రామిక విధానం నుండి ద్రవ్య, స్పెక్యులేటివ్, వడ్డీవ్యాపార పెట్టుబడిదారీ విధానంలోకి మళ్లిన తొలి దేశం కూడా (హాలండ్‌ను మినహాయించి) అదే.

"దీర్ఘకాలం సాగిన భూస్వామ్య అధిరోహణానికి దీనితో తప్పనిసరిగా సంబంధం వుండి వుంటుంది. ఇంగ్లండ్ పాత పాలకవర్గం నక్కల్ని, చాటుమాటు దొంగల్ని తరమటంలో తీరికలేకుండా వుండేది. ఎదురు నోరెత్తిన వారిని బాటనీబేకి పంపటం ద్వారా శ్రమజీవులను అదుపులో వుంచి ఉత్పత్తిలో తన ప్రధాన వాటాని పొందేది. రష్యన్ భూస్వాములు తిరగబడే బానిసలను సైబీరియన్ పంపినట్లుగా వీరు బాటనీబే పంపేవారు. ఇది ప్రాథమికంగా మన నగరాల్లోని షార్క్ చేపలు, గండబేరుండ పక్షి వంటి పరాన్నభుక్కువర్గం. వారిలో అనేకమంది ఆ వంశవృక్షం నుండి దిగుమతి అయినవారే."

అతివాదం కుట్రలో మునిగివుంటుందనే మితవాదుల సర్వసాధారణ ఆరోపణను ఖండించిన తీరు కీర్నన్ అత్యంత వివాదాస్పద వ్యక్తీకరణల్లో ఒకటి. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో ప్రచ్ఛన్న యుద్ధం తొలినాళ్లలో సోవియట్ యూనియన్‌తో సహకరించిన "కేంబ్రిడ్జి ద్రోహుల మరో మొరుగుడు"పై ఆయన లండన్ రెవ్యూ ఆఫ్ బుక్స్ (జూన్ 22, 1987)లో ఇలా వ్యాఖ్యానించారు: "ప్రజల మెప్పుపొందటానికి తాజా అంశం ఏదీలేనపుడు అభివృద్ధి నిరోధకులు ఎడతెరిపిలేకుండా చేసే ఆరోపణ ఇది. అనేక సంవత్సరాల క్రితం కొద్దిమంది ఆదర్శవాదుల తుంటరితనం గూర్చి వీరు పతివ్రతల్లా ఆగ్రహం వ్యక్తం చేస్తుంటారు."

మితవాదులకు జ్ఞాపకశక్తి ఎంత తక్కువో కీర్నన్ ఎత్తిచూపారు. లిబరల్ ప్రభుత్వం ఐర్లాండ్‌కు స్వయంపాలన (హోంరూల్)ను అంగీకరించబోగా సైనిక తిరుబాట్లకు టోరీలు ఉత్సాహంగా తోడ్పాటివ్వటాన్ని వారు మరిచిపోయారు. అటుతర్వాత, "ఉల్‌స్టర్‌లో నిర్బంధకాండ అమలుచేయటంలో పాల్గొనటానికి అనేకమంది ఆఫీసర్లు నిరాకరించిన" విషయాన్ని వారు మరిచిపోయారు. "రొడీషియాలో శ్వేతజాతి తిరుగుబాటుదారులకు వ్యతిరేకంగా చర్యతీసుకోవటానికి బ్రిటిష్ ఆఫీసర్లు నిరాకరించినపుడు టోరీలలోని అత్యధిక మెజారిటీనుండి వారికి అరమరికలు లేని తోడ్పాటు లభించటాన్ని వారు మరిచిపోయారు. 1980వ దశకంలో, దక్షిణాఫ్రికాలో శ్వేతజాతీయుల అకృత్యాలపట్ల టోరీలు

సౌభ్రాతృత్వ మనోభావాలు కలిగివున్నారు. బాధితులను దోపిడీచేయటం పెట్టుబడిదారీ విధానపు సహజహక్కుగా భావించేవీరు దక్షిణాఫ్రికా శ్వేతజాతీయుల్లో తమ భాగస్వాముల్ని చూశారు. బ్రిటన్‌కు జరుగుతున్న నైతిక నష్టంగూర్చి, నల్లజాతి ఆఫ్రికాను, కామన్వెల్త్‌లో అత్యధికులను దూరం చేసుకోవటంవల్ల జరిగే పాదార్థిక నష్టాలను కూడా వారు పట్టించుకోలేదు.

ఈ బ్రిటిష్ దేశభక్తులు ప్రపంచంలో ప్రజాస్వామిక ప్రభుత్వాలను అస్థిరీకరించటంలో వాషింగ్టన్‌కు తరచూ తోడ్పాటివ్వటాన్ని ఆయన ఎత్తిచూపారు. లెఫ్ట్‌కు చట్టబద్ధతలేదని చెప్పటానికి మితవాదులు తరచూ దేశద్రోహం ఆరోపణలు చేస్తున్నారని, కొన్ని ఎదురుదెబ్బలు తీయవలసిన సమయం అరుదెంచిందని ఆయన భావించారు.

సాహిత్యం, సామాజిక మార్పు : ఒక యుగం కళలకు, ఆర్థిక వ్యవస్థకు సంబంధంలేదని **"సోషల్ హిస్టరీ అండ్ లిటరేచర్"** (1949)లో ఆర్.హెచ్. ట్వానీ వ్యక్తం చేసిన అభిప్రాయాలను కీర్నన్ తిరస్కరించారు. మేధాశక్తి సామాజిక వ్యవస్థకు అతీతమైందన్న వాదనను త్రోసిపుచ్చారు. "అలా ఊహించవచ్చుగాని, అది అసాధారణం. యుద్ధం, మరణం, ఆస్తి, వాటిని వెన్నంటివున్న బాధలగూర్చి షేక్స్‌పియర్ రాసినట్లుగా, ఆయన ఎక్కడో ఒలంపియన్ శిఖరంపై వుండివుంటే రాయగలిగేవాడా" అని ప్రశ్నించారు.

కీర్నన్, ఉర్దూ కవిత్వం : పశ్చిమ సాహిత్యంలో, హోరేస్ సాంప్రదాయక వారసత్వంలో మునిగినప్పటికీ, కీర్నన్ ఉర్దూ కవిత్వాన్ని మెచ్చుకున్నారు. ఆ సాహిత్య స్వర్ణయుగం నుండి - గాలిబ్ (1796-1869), ఇక్బాల్ (1877-1938) నుండి ఫైజ్ (1911-1984) వరకు ఆయన కొన్ని రచనలను అనువదించారు. అనేకమంది ప్రాచ్య రచయితలను ఆయన ఆంగ్ల సాహిత్యానికి పరిచయం చేశారు.

సామ్రాజ్యవాదానికి అద్భుతమైన నిభాయింపు శక్తి వుంది. అసంఖ్యాకమైన వందిమాగధ మేధావులు, వెన్నులేని పాత్రికేయుల అండదండలు దానికున్నాయి. ఈ వాస్తవాన్ని గుర్తిస్తూనే కీర్నన్, ప్రతిఘటనను ఉత్తేజితంగావించే చారిత్రక వనరులను, సాహిత్యాన్ని మనకు ఇచ్చివెళ్లారు. మన మధ్య హంతకులు, చిత్రహింసలు పెట్టేవారున్నపుడు మనం నిశ్శబ్దంగా వుండరాదని ఆయన మనల్ని కోరారు. అటువంటి సందర్భాల్లో కీర్నన్ తన వార్తాహరుడు ఫైజ్ 'మాట్లాడు' (1948) గేయాన్ని ఉదహరిస్తారు.

మాట్లాడు, నీ రెండు పెదవులు స్వేచ్ఛగా ఉన్నంతవరకు
మాట్లాడు, నీ నాలుక నీ సొంతమై ఉన్నంతవరకు
ఈ నిటారు దేహం నీదై ఉన్నంతవరకు
మాట్లాడు, నీ జీవితం నీదై ఉన్నంతవరకు
చూడు, కమ్మరి కొలిమి మంటలు
ఏవిధంగా ఎగిసిపడుతున్నాయో
ఉక్కు ఎర్రగా మారుతున్నదో,
కప్పతాళాలు నోళ్లు తెరుచుకుంటున్నాయి
ప్రతి గొలుసులో లింకులు సాగుతున్నాయి.
ఈ సంక్షిప్త గంటలోని సమయం చాలు
దేహం, నాలుక చచ్చే వరకు
మాట్లాడు, నిజం మాట్లాడు, నిజం బతకాలి.
మాట్లాడు, ఏమి చెప్పదలుచుకున్నా

(ఫ్రంట్‌లైన్, మార్చి 13, 2009 సౌజన్యంతో)

విప్లవానికి భావుకతకాని, చావుకాని అవసరం లేదు. దానికి కావలసింది నిరంతర పోరాటం. కష్టాలు భరించటం, త్యాగాలతో కూడిన జీవితం. ముందుగా వ్యక్తిగత మోహాలను కాలరాసెయ్యండి. వ్యక్తిగత సుఖసంతోషాల స్వప్నాల్ని తుడిచెయ్యండి. అప్పుడు ప్రారంభించండి పనిచెయ్యడం. ఒక్కొక్క అంగుళం చొప్పున సాగండి ముందుకు - అందుకు ధైర్యం, వేసిన అడుగు స్థిరంగా వుంచడం, గొప్ప దృఢ సంకల్పం అవసరం. కష్టాలు, అడ్డంకులు మిమ్మల్ని నిరుత్సాహపరచలేవు. ఏ వైఫల్యాలు, విద్రోహాలు మిమ్మల్ని అధైర్యపరచలేవు. మీలోని విప్లవ చేవను నాశనం చేయలేవు. కష్టాలూ, త్యాగాల అగ్నిపరీక్షలో మీరు తప్పక విజయం సాధిస్తారు.

* * *

విద్యార్థులు చేయాల్సిన ముఖ్యమైన పని చదువుకోవడం అని, వారు తమ దృష్టినంతటినీ చదువుమీదే లగ్నం చేయాలని మనం అంగీకరిస్తాం. అయితే దేశ పరిస్థితుల అవగాహన, వాటిని మెరుగుపరిచే ఆలోచనలను ప్రోదిచేసే యోగ్యతని కలిగించడం చదువులో భాగం కాదా? కాకపోతే ఆ చదువు వ్యర్థం అంటాను. అలాంటప్పుడు ఆ చదువు కేవలం క్లర్కుల్ని తయారుచేయడానికి తప్ప మరెందుకూ పనికిరాదు. ఇలాంటి చదువులు మనకి దేనికి?

\- భగత్‌సింగ్

మనవి

రచయితలకు :

మార్క్సిస్టు సైద్ధాంతిక మాసపత్రిక, **కమ్యూనిజం** ఏప్రిల్ 2008 సంచికతో పునః ప్రారంభమైంది. ఏప్రిల్ ప్రత్యేక సంచికతో సహా గత పదమూడు మాసాలుగా పత్రికను నియమబద్ధంగా పాఠకులకు అందించాం. పునఃప్రారంభించిన తొలి సంచికలో నివేదించినట్లు ప్రస్తుత ప్రపంచ పరిస్థితుల సంక్లిష్టత, సంకీర్ణత, ప్రజా పోరాటాల దిశ, దశల బహుముఖ పార్శ్వాలపై విప్లవోద్యమ శ్రేణులకు, పార్టీ కార్యకర్తలకు, ప్రగతిశీల పాఠకులకు సంతృప్తిని కలిగించే రీతిలో పత్రికను అందించ ప్రయత్నించాం. ఈ ప్రయత్నంలో మీరు అందించిన సహకారానికి కృతజ్ఞతలు.

పత్రిక విజయవంతంగా నిర్వహించబడాలంటే అందులోని అంశాలు ఆసక్తికరంగా, విజ్ఞానదాయకంగా, సమాచారాన్ని సమృద్ధిగా అందించేవిగా వుండాలి. అందుకు మీ సహాయాన్ని వినమ్రపూర్వకంగా అర్థిస్తున్నాం.

ఉద్యమంలో పనిచేయడానికి మన పత్రిక కరదీపికగా ఉపయోగపడాలి. అందువలన మీరు బాధ్యులుగా వున్న ప్రజారంగంలోని వివిధ సమస్యలను మార్క్సిస్టు దృక్కోణాన్నుండి విశ్లేషణ చేసి, మీ ఉద్యమ అనుభవాలను జోడించి వ్యాసాలను పంపాలని మనవి చేస్తున్నాం. మన కార్యకర్తలను చైతన్యవంతులను చేయడానికి **కమ్యూనిజం** మాసపత్రిక మంచి **"ఆయుధం"**గా ఉపయోగపడటానికి మీ పూర్తి సహాయ, సహకారాన్ని మరోసారి అర్థిస్తున్నాం.

మే 2009 మూడో వారానికి పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడతాయి. ఎన్నికల ఫలితాలను విశ్లేషిస్తూ వ్యాసాలు రాసి పంపవలసిందిగా కోరుతున్నాం.

వీలైనంతవరకు మీ వ్యాసం అచ్చులో నాలుగు పేజీలకు మించకుండా పంపించ మనవి. మీ సహాయానికి సదా కృతజ్ఞతలు.

పాఠకులకు :

పత్రికలో వచ్చే వివిధ అంశాలపై మీ అభిప్రాయాలను సంపాదకవర్గానికి పంపించ ప్రార్థన.

చందాదారులకు :

మీకు వచ్చే పత్రిక పోస్టల్ అడ్రసుపైన మీ చందా ఏ మాసం వరకు / సం॥ వరకు చెల్లించబడిందో చూసి గమనించగలరు. కాలపరిమితి పూర్తిగాకుండానే చందాను కొనసాగించ ప్రార్థన. మనీ ఆర్డర్లను/ డి.డి.లను "మేనేజర్, కమ్యూనిజం, విజయవాడ" పేర పంపగోరుతాం.

చందా వివరాలను మేనేజర్, కమ్యూనిజం, చంద్రం బిల్డింగ్స్ మాచవరం, విజయవాడ-520 004కు రాసిగానీ లేక 0866-2431301కు ఫోన్ చేసిగానీ తెలుసుకో గలరు.

గద్దం కోటేశ్వరరావు

(సంపాదకుడు)

R.N.I. Regd.No. 27682/75 Postal Regd.No. VJ/112/2008-10

Communism (Telugu Monthly) Vol : 34 No. 5 May 2009

కమ్యూనిజం

గతంలో సమాజం వర్గ వైషమ్యాల ద్వారా వృద్ధి చెందినందున, నీతి ఎల్లప్పుడూ వర్గనీతిగానే వుంటూ వచ్చింది. అది పాలకవర్గ ప్రయోజనాల్నీ, పెత్తనాన్నీ సమర్థించడమైనా చేసింది; లేదా పీడిత వర్గం తగినంత శక్తిని పుంజుకున్నప్పటి నుంచీ ఆ పెత్తనంపట్ల పీడిత వర్గ ఆగ్రహాన్నీ, ఆ వర్గ భవిష్యత్ ప్రయోజనాల్నీ ప్రకటించడమైనా చేసింది. ఈ క్రమంలో మొత్తంమీద మిగతా జ్ఞాన రంగాలన్నిటిలాగే నీతి కూడా అభివృద్ధి చెందిందనడంలో సందేహం లేదు. కాని, మనమింకా వర్గ నీతిని అధిగమించలేదు. సమాజంఏ దశలో వర్గ వైషమ్యాలను అధిగమిస్తుందో దానితోబాటు ఏ దశలో వాటిని నిత్య జీవితంలో మరచిపోతుందో, ఆ దశలో మాత్రమే నిజమైన మానవ నీతి, వర్గ వైషమ్యాల కతీతమైనట్టిది, సాధ్యపడుతుంది. – ఏంగెల్స్

Printed and Published by **E. Nageswara Rao** for Visalaandhra Vignana Samithi at Nagarjuna Enterprises, Chandram Buildings, Vijayawada-520 004 Editor : **Gaddam Koteswara Rao**

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVA102M103
పుస్తకం పేరు	కమ్యూనిజం
తారీఖు	07 February 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	45
పెద్ద సైజు పేజీలు	no
ఖాళీ పేజీలు	no
లేని పేజీలు	no
తయారు చేసినది	Priyanka
పేజీలు విడదీసినది	Priyanka
స్కాన్ చేసినది	S.lakshmi
పరీక్ష చేసినది	LAKSHMI
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	Good